

ఒంగోలులో ఓ షాపింగ్ మాల్ ప్రారంభోత్సవం సందర్భంగా సినీ హీరోయిన్ శ్రీలీల సందడి చేశారు. పాటలకు స్టెప్పులు వేసి యువతను హుషారెత్తించారు.

వెనుకబడి

- ప్రభుత్వ పాఠశాలల పనితీరు దారుణం
- ఒక్కదానికీ దక్కని ఫైవ్ స్టార్ రేటింగ్
- కొన్ని నాలుగు స్టార్లకే పరిమితం
- మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్భాటం తప్ప విద్యను పట్టించుకోకపోవడమే కారణం



ప్రభుత్వ బడులు విద్యలో వెనుకబడిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామంటూ చెప్పినదంతా ఆర్భాటపు ప్రచారమనేది తేటతెల్లమైంది. కొన్ని స్కూళ్లల్లో సదుపాయాలు ఉంటే.. ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న కొన్నిచోట్ల వసతులు అంతంతమాత్రంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఈ రెండూ లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన పాఠశాలలు ఒక్కటీ జిల్లాలో లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై విద్యాశాఖాధికారులు దృష్టిసారించారు. ఆర్జేడీ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టారు.

జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలకు రేటింగ్ ఇలా...

స్టార్ రేటింగ్	సదుపాయాలు	అభ్యసన ఫలితాలు
జీరో స్టార్	2	07
1స్టార్	60	699
2స్టార్	871	1,446
3స్టార్	1,034	250
4స్టార్	439	04
5స్టార్	00	00

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా చేపట్టిన అధ్యయనంలో ప్రభుత్వ పాఠశాలల్లో వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాలను(లెర్నింగ్ అవుట్ కమ్స్) క్రోడీకరించి ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ పాఠశాల ఏ స్థాయి ఉంది? తదితర అంశాలపై వివరాలు సేకరించడంతో మొన్నటి వరకు ఉన్న వైసీపీ ప్రభుత్వం నాడు-నేడు పథకం పేరుతో చేసిన హడావుడి అంతా ఉత్తదేనని తేలిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ఫైవ్ స్టార్లు, అభ్యసన ఫలితాలకు ఫైవ్ స్టార్లు ప్రామాణికంగా తీసుకొని జిల్లాలో ఈ అధ్యయనం చేశారు.

నాడు-నేడు అంతా హడావుడే

జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 2,406 ఉండగా వాటిలో ఏ ఒక్క పాఠశాలకు కూడా కనీస విభాగంలో ఫైవ్ స్టార్ వచ్చిన పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిగా దీటుగా అభివృద్ధి చేసినట్లు

మిగతా 6లో...

స్టార్ రేటింగ్ ఇలా...

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడామైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్, తరగతి గదులు, తాగునీరు తదితర అంశాలను పరిశీలించారు. ఒక్కొక్క అంశానికి ఐదు చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన పాఠశాలలకు ఫైవ్ స్టార్లు కేటాయించగా 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్‌ను ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గత ఏడాది పదవ తరగతి పరీక్ష ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదవ తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకొని ఈ అధ్యయనం చేశారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40శాతం, ఫలితాలకు 60శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండు కలిపి 90శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలు ఉన్న పాఠశాలలకు ఒకటి నుంచి నాలుగు స్టార్లు కేటాయించారు.

మేఘావృతం

- జిల్లాపై తుఫాన్ ప్రభావం
- వర్షం లేకున్నా ఆకాశంలో మబ్బులు
- గణనీయంగా పడిపోయిన ఉష్ణోగ్రతలు
- వాతావరణం మార్పులతో సీజనల్ వ్యాధులపై భయాందోళన


ఆకాశం మబ్బు పట్టిన వేళ ఒంగోలు నగరం ఇలా...

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాపై తుఫాన్ ప్రభావం కనిపించింది. జిల్లావ్యాప్తంగా మబ్బులు పట్టి చలిగాలితోపాటు ఆకాశం మేఘావృతమై ఉంది. తమిళనాడులో తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉంది. అయితే గురువారం జిల్లావ్యాప్తంగా వాతావరణం మారింది. మబ్బులు కమ్మి ఉండటంతో సూర్యుడు కనిపించలేదు. జిల్లాలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు కూడా గణనీయంగా పడిపోయాయి. రెండు రోజుల క్రితం వరకు 31 నుంచి 32 వరకు గరిష్ఠ ఉష్ణోగ్రతలు ఉండగా గురువారం 28.4 పడిపోయాయి. వాతావరణంలో మార్పులు రావడంతో అటు రైతాంగం, ఇటు ప్రజల్లో ఆందోళన నెలకొంది. ఇప్పటికే ఫెంగల్ తుఫాన్ ప్రభావంతో వారంరోజుల పాటు భారీ వర్షాలు కురిశాయి. ఆ ప్రభావం నుంచి ఇప్పుడిప్పుడే రైతులు కోలుకుంటున్నారు. ఈ నేపథ్యంలో బంగాళాఖాతంలో మరో తుఫాన్ రావడంతో ఆ ప్రభావం జిల్లాపై కనిపిస్తోంది.మొన్నటి వర్షానికి పంటలకు తెగుళ్ల ప్రభావం ఉండగా, మళ్లీ వర్షాలు పడితే ఇబ్బందికర పరిస్థితులు తలెత్తుతాయని ఆందోళన చెందుతున్నారు. మరోవైపు ఇప్పటికే జిల్లావ్యాప్తంగా సీజనల్ వ్యాధులు విజృంభించాయి. ప్రస్తుత వాతావరణంతో మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజానీకం ఆందోళన చెందుతున్నారు.

బోగస్ రోల్‌ను తొలగించాలి

- పాఠశాలల పనితీరును మెరుగుపర్చాలి
- ముగ్గురు సస్పెన్షన్‌కు ప్రతిపాదనలు పంపాలి
- డీఈవోకు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశం

ఒంగోలు విద్య, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పాఠశాలల్లో బోగస్ ఎన్‌రోల్‌మెంట్ ఉంటే వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గుంటూరు విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో ఉపవిద్యాధికారులు, మండల విద్యాధికారులు, స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలతో గురువారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాజరు సక్రమంగా లేని విద్యార్థులను చివరి వరకు ఉంచి బోగస్ ఎన్‌రోల్ చేయడం సరికాదన్నారు. స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోగస్ ఎన్‌రోల్ ఉంటే శుక్రవారం సాయంత్రంలోపు తొలగించాలన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలని చెప్పారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. వరుసగా 30రోజులు బడికి రాకుంటే డ్రాప్ అవుట్స్ లిస్టులో చేర్చాలన్నారు. తరచూ బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మాట్లాడాలని ఆదేశించారు. హాజరు రిజిస్టర్‌లో విద్యార్థుల సంఖ్యకు, యూడైస్ సైట్‌లోని సంఖ్య సరిపోయే విధంగా ఉండాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల హాజరు 75శాతం ఉండాలన్నారు. వారు హాజరయ్యేలా చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎంలపై ఉందన్నారు. ఇంకా పదవ తరగతి పరీక్ష ఫీజు చెల్లించని 604 మంది విద్యార్థుల చేత చెల్లించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్‌జీపాడు ఎంఈవోలు, హెచ్‌ఎంపై చర్యలు

గత నెలలో తాను నాగులుప్పలపాడు జిల్లా పరిషత్

మిగతా 6లో...

వీరుడికి వీడ్కోలు


వెంకటసుబ్బయ్యకు అధికార లాంఛనాలతో అంత్యక్రియలు

- అధికార లాంఛనాలతో వెంకటసుబ్బయ్య అంత్యక్రియలు
- పాల్గొన్న పలువురు అధికారులు, నాయకులు

కంభం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జమ్మూకాశ్మీర్‌లో ఉగ్రవాదులు అమర్చిన మందుపాతర పేలి వీరమరణం పొందిన వరికుంట్ల వెంకటసుబ్బయ్య అంత్యక్రియలు గురువారం అనంతపురం జిల్లా నార్పల గ్రామంలో అధికారికంగా సైనిక లాంఛనాలతో నిర్వహించారు. అంత్యక్రియలలో వెంకటసుబ్బయ్య తల్లి గాలెమ్మ, భార్య లీలావతి, కుటుంబసభ్యులు, సింగనమల ఎమ్మెల్యే శ్రావణి, కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్, ఆర్డీవో కేశవులనాయుడు, సైనిక సంక్షేమశాఖ డైరెక్టర్ బ్రిగేడియర్ వెంకటరెడ్డి, ఉమ్మడి అనంతపురం జిల్లా సైనిక సంక్షేమ అధికారి పి.తిమ్మప్ప, ఎస్పీ జగదీష్, రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఇండియన్ ఆర్మీ తరఫున సికింద్రాబాద్ నుంచి ఈఎంఈ రెజిమెంట్ లెఫ్టినెంట్ కల్నల్ జాకబ్, 9 మద్రాస్ 26ఆర్ఆర్ ఏవోసీ, ఎన్‌సీసీ రెజిమెంట్ ఆర్మీ అధికారులు, జవాన్లు, మాజీ సైనికులు, స్థానిక నాయకులు, రెవెన్యూ, పోలీసు అధికారులు హాజరయ్యారు. ప్రజలు.. వెంకటసుబ్బయ్య 'అమర్ రహే' అంటూ నినాదాలు చేస్తూ నివాళి అర్పించారు.

కుటుంబసభ్యులకు ఎమ్మెల్యే పరామర్శ

జమ్మూకాశ్మీర్ వద్ద మందుపాతర పేలి వీరమరణం పొందిన కంభం మండలం రావిపాడుకు చెందిన వీరజవాన్ వరికుంట్ల వెంకటసుబ్బయ్య మృతిపై ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి విచారం వ్యక్తం చేశారు. వెంకటసుబ్బయ్య కుటుంబ సభ్యులకు గురువారం ఫోన్ చేసి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. జవాన్ కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని, ప్రభుత్వం నుంచి రావలసిన సదుపాయాలన్నీ కల్పిస్తామని అశోక్‌రెడ్డి భరోసా ఇచ్చారు. అలాగే కంభం మండల మాజీ సైనికుల సంఘం అధ్యక్షులు వేణుగోపాల్, మాజీ సైనికులు జవాన్ వెంకటసుబ్బయ్యకు నివాళులు అర్పించారు.



పోలీస్ కస్టడీకి..

- విచారణకు సీఐడీ మాజీ ఏఎస్పీ విజయ్‌పాల్
- ట్రిపుల్ ఆర్ కస్టోడియల్ టార్చర్ కేసు దర్యాప్తు వేగవంతం
- రెండు రోజుల పాటు విచారించనున్న పోలీసులు

మెయిన్‌లో...

సంతోషంగా.. సరదాగా ఉండాలంటూనే..

- గిరిజన విద్యార్థి అనుమానాస్పద మృతి
- హాస్టల్ భవనం పైనుంచి దూకి ఆత్మహత్య
- శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీలో ఘటన
- అనుమానం వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు
- పెద్దపీఆర్‌సీ తాండాలో విషాదం
- చదువులో మేటి.. జిల్లా స్థాయిలో ర్యాంక్

'జీవితం ఎప్పుడు ముగుస్తుందో.. ఎవరికీ తెలియదు. అందుకే ఎప్పుడూ సంతోషంగా.. సరదాగా ఉండాలి' అని తోటి స్నేహితులకు తరచూ చెప్పే ఆ విద్యార్థికి ఏమైందో.. అర్ధరాత్రి వేళ ఆత్మహత్య చేసుకున్నాడు. ఎప్పుడూ చలాకీగా ఉండేవాడు.. కొన్నాళ్లుగా ముభావంగా ఉంటున్నాడు. మూడు రోజుల కిందట తన జీ మెయిల్ 'ది ఎండ్' అని రాసుకున్నాడు. నిజంగాన్నే తన జీవితాన్ని అర్ధంతరంగా ముగించాడు. తల్లిదండ్రులకు, కుటుంబసభ్యులకు, స్నేహితులకు తీరని విషాదాన్ని మిగిల్చాడు. కాగా.. ప్రేమ వైఫల్యమే కారణమని పోలీసుల దర్యాప్తులో తేలింది.


ప్రవీణ్ నాయక్

పల్లలచెరువు/ఎచ్చెర్ల, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళం జిల్లాలోని ట్రిపుల్ ఐటీ క్యాంపస్ (ఎచ్చెర్ల మండలం ఎస్.ఎం.పురం)లో సివిల్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరం చదువుతున్న రమావత్ ప్రవీణ్ నాయక్(19) ఆత్మహత్య చేసుకున్నాడు. బుధవారం అర్ధరాత్రి బాలుర హాస్టల్ భవనం మూడో అంతస్తు పైనుంచి దూకాడు. రెండేళ్ల కిందట ఇదే క్యాంపస్‌కు చెందిన ఓ విద్యార్థి తన హాస్టల్ గదిలో ఉరేసుకున్నాడు. తాజాగా ఈ ఘటన చోటుచేసుకోవడంతో.. క్యాంపస్‌లో విషాదం అలుముకుంది. ఎప్పుడూ చలాకీగా, అందరితో కలుపుగోలుగా ఉండే ప్రవీణ్‌నాయక్ ఇటీవల ముభావంగా ఉండేవాడని, ఎవరితోనూ కలిసేవాడు కాదని తోటి స్నేహితులు చెబుతున్నారు. ఒంటరిగా ఉండేందుకు ఇష్టపడేవాడని తెలిపారు. జీవితం ఎప్పుడు ముగుస్తుందో ఎవరికీ తెలియదని, అందుకే సంతోషంగా, సరదాగా ఉండాలని తరచూ చెబుతుండేవాడని అంటున్నారు. ఇటీవల భోజనానికి పిలిచే సమయంలో.. తిండి కోసం ఎన్నాళ్లు ఉంటామంటూ నిరాశగా మాట్లాడాడని చెబుతున్నారు. మూడు రోజుల క్రితం తన జీ మెయిల్‌లో ది ఎండ్ అని రాసుకున్నాడని, ఇది ఇంత తీవ్రంగా ఉంటుందని ఊహించలేకపోయామని

మిగతా 6లో...

సమగ్ర నివేదిక

- వెలిగొండ పూర్తి
- డెయిరీ పునరుద్ధరణ
- ట్రిపుల్ ఐటీ, ఏకే వర్సిటీ పూర్తి వంటి కీలక అంశాలు ప్రభుత్వం దృష్టికి
- జిల్లా భవిష్యత్ ప్రణాళికతో కలిపి సదస్సులో నివేదించిన కలెక్టర్ అన్సారియా


ప్రజంటేషన్ ఇస్తున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ఒంగోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఐదేళ్లలో జిల్లా ప్రగతి ప్రణాళికలతోపాటు అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మౌలిక రంగాలకు సంబంధించిన కీలక అంశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. రెండురోజుల పాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో రెండవ రోజైన గురువారం రాత్రి జిల్లా విజన్ ప్రణాళిక-29పై వివరించే అవకాశం ఆమెకు లభించింది. ప్రణాళికలు బాగా రూపొందించిన మూడు జిల్లాల్లో ఒకటిగా జిల్లాగా ఎంపిక కావడంతో సంబంధిత అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సదస్సులో ఇచ్చారు. కొద్దిపాటి సమయమే దక్కగా అధికభాగం నివేదిక రూపంలో ఇచ్చారు. అందులో ప్రధానంగా ప్రస్తుతం జిల్లా ఉన్న స్థూల ఉత్పత్తి రూ. 50,350 కోట్లు, తలసరి ఆదాయం

మిగతా 6లో...

వెనుక'బడి'

(5వ పేజీ తరువాయి)

గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారం చేసుకుందే తప్ప వాటి అభివృద్ధిని పట్టించుకోలేదు. నాడు-నేడుతో పాఠశాల స్వరూపాన్నే మార్చామని జగన్మోహన్‌రెడ్డి పదే పదే చెప్పుకోవడం తప్పా ఆచరణలో అభివృద్ధి చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన అధ్యయనంలో స్టార్ రేటింగ్ ఫలితాల్లో 5 స్టార్ ఫలితాలు వచ్చిన పాఠశాలలు ఒక్కటి లేదు. 4 స్టార్ ఫలితాల్లో కేవలం 439 పాఠశాలలు ఉండగా అభ్యసనలో 4 స్టార్‌లో నాలుగు పాఠశాలలు ఉన్నాయంటే పాఠశాలల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

ఆర్భాటంతో బోధన నిర్వీర్యం

గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలలను రాజకీయ ప్రచారానికి వాడుకుందనేది ఇప్పుడు బహిర్గతమైంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్వీర్యం చేసిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్లుగా మార్చేసి ఫలితాలను దిగజార్చిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

బోగస్ రోల్‌ను తొలగించాలి

(5వ పేజీ తరువాయి)

హైస్కూలును సందర్శించానని, అయినా ఈ రోజుకు పాల్యాబ్ 0.04శాతంగానే ఉందన్నారు. తాను స్వయంగా పరిశీలించిన తర్వాత కూడా మెరుగుపర్చకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే క్యాంప్‌ఎలో మండల విద్యాధికారి కార్యాలయం కూడా ఉందని, అయినా తగిన విధంగా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంతఈవేలు ఇద్దరు, ఎన్‌జీపాడు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎంలను సస్పెండ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని డీఈవో కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. గిద్దలూరు, వైపాలెం ప్రాంత మండలాలకు మార్కాపురంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పాఠశాలల్లో ఆట స్థలానికి రూ.5లక్షలు గతంలో మంజూరు చేశామని, వెంటనే ఆ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్ష చేసి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డీఈవో ఏ.కిరణ్‌కుమార్, డీసీబీవీ సెక్రటరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సమగ్ర నివేదిక

(5వ పేజీ తరువాయి)

రూ.1,97,357 కోట్ల నుంచి 2029 నాటికి స్థూల ఉత్పత్తి రూ.1,14,712 కోట్లు, అలాగే రూ.4.27 లక్షల తలసరి ఆదాయం పెరిగేలా చేయడానికి లక్ష్యం నిర్దేశం, దాని సాధన కోసం అనుసరించాల్సిన వ్యూహాలను పేర్కొన్నారు. ప్రధానంగా వ్యవసాయ అనుబంధ రంగాల్లో పాడి పరిశ్రమ, ఉద్యాన పంటల సాగుకు గణనీయ ప్రోత్సాహం, పారిశ్రామిక రంగంలో మైనింగ్, అలాగే సేవా రంగంలో రియల్ ఎస్టేట్, రవాణా రంగాల వృద్ధి కీలకమని వివరించారు. అందుకు ఆయా రంగాల వారీ తీసుకోవాల్సిన చర్యలపై నివేదికలో పలు సూచనలు చేశారు ఆదే సమయంలో జిల్లాకు సంబంధించి ఆయా రంగాలలో అత్యంత కీలకంగా ఉండే మౌలిక సదుపాయాలు, ఉపాధి అంశాలను ప్రత్యేకంగా నివేదించారు. అందులో అత్యంత కీలకమైన వెలిగొండ ప్రాజెక్టు పూర్తి, ట్రిపుల్ ఐటీ, ఆంధ్రకేసరి యూనివర్శిటీ నిర్మాణం, ఒంగోలు డెయిరీని పునరుద్ధరించడం వంటి అంశాలను పేర్కొన్నారు. జిల్లాలో వాటి ప్రాధాన్యత, ప్రస్తుత వాటి పరిస్థితి, నిర్మాణాలు పూర్తికి తీసుకోవాల్సిన ఆర్థిక ఇతర అంశాలు, డెయిరీ ప్రాధాన్యతలను నివేదిక రూపంలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళారు.

కొలువుదీరనున్న శ్రీ వేణుగోపాలస్వామి

- కొండమంజులూరు గ్రామస్థులు, దాతల విరాళాలతో పునర్ నిర్మితం
- 23న వైభవంగా ప్రతిష్ఠోత్సవం



కొండమంజులూరులో పునర్ నిర్మాణమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం



శ్రీ వేణుగోపాల స్వామి మూలవిరాట్

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో రూ.2 కోట్ల 40 లక్షల వ్యయంతో పునర్ నిర్మాణమైన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం శిఖర గోపురాలు, వాటిపై రూపుదిద్దుకున్న, దేవతా మూర్తుల రాతి చిత్రాలతో ఆధ్యాత్మిక శోభ సోభిల్లుతుంది.

దాతలు, గ్రామస్థుల సహకారంతో ఈ ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. 2018లో గ్రామస్థులు 13 లక్షల 40 వేల రూపాయల మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించగా, నాటి ప్రభుత్వం రూ.26 లక్షల 60వేల సీజీఎఫ్ నిధులను మంజూరు చేసింది. భూమి పూజ అనంతరం 2019లో ప్రారంభమైన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఐదేళ్ల కాల వ్యవధిలో పలువురు దాతలు, గ్రామస్థులు అందించిన భూరి విరాళాలతో శోభాయమానంగా రూపుదిద్దుకున్న ఈ ఆలయంలో ఈనెల 23న దేవతామూర్తులను శాస్త్రోక్తంగా కొలువు దీర్చేందుకు ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది.

దాతల భూరి విరాళాలతో

కొండమంజులూరు గ్రామంలో 16వ శతాబ్దంలో ఆ నాటి విజయనగర రాజులు రుక్మిణీసత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు మకర తోరణాల కింద అంత్రాలపై లిఖితమైన ఆనవాళ్లున్నాయి. ఎంతో ప్రాచుర్యం ఉన్న ఈ ఆలయం శిథిలావస్థకు చేరింది. దీంతో 2018లో గ్రామస్థులు ఆలయ పునర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రానైట్ రాతి కట్టడంతో నిర్మించ తలపెట్టిన ఆలయానికి గర్భ గుడికి అవసరమైన గ్రానైట్ రాయిని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమకూర్చారు. గుడిపై గోపుర నిర్మాణానికి విశ్రాంత రెవెన్యూ అధికారి కరణం లింగారావు రూ.14లక్షలు, ముఖ మండప నిర్మాణానికి గ్రామానికి చెందిన రావులవారి వంశస్తులు రూ.41లక్షల నిధులు సమకూర్చారు. ఆలయం ముందు భాగంలో శోభాయమానంగా రూపు దిద్దుకున్న రాజగోపుర నిర్మాణానికి ప్రవాసాంధ్రులు, గ్రామవాసి చింతల రమేష్ రూ.25లక్షలు విరాళంగా అందచేశారు. ఆలయ ముందు భాగంలో నిర్మితమైన గరుత్మంతుని గుడి ఏర్పాటుకు కరణం కోటేశ్వరరావు, పున్నారావు రూ.8లక్షల నిధులు సమకూర్చగా, ఆలయ ధ్వజ స్తంభ నిర్మాణానికి విశ్రాంత ఉపాధ్యాయులు బత్తుల బాపయ్య రూ.8లక్షల నిధులను అందచేశారు. దేవతా మూర్తుల విగ్రహాలకు గుంటుపల్లి శ్రీకాంత్ రూ.6లక్షలు, ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చింతల సహదేవుడు రూ.10లక్షలు, రావుల రామకృష్ణ 2 లక్షలు నిధులు సమకూర్చారు. గ్రానైట్ వ్యాపారి వేములపల్లి శ్రీనివాసరావు, ఆలయంలో స్టోర్ రూము నిర్మాణానికి రూ.5లక్షల విరాళాన్ని బొప్పూడి నాగేశ్వరరావు,ఎడవల్లికి చెందిన ఇన్నమూరి శ్రీనివాసరావు సత్యవాణి, గుండవరపు వెంకట ప్రసాద్, మండవ కృష్ణమూర్తితో పాటు గ్రామస్థులు అందించిన సుమారు రూ.35లక్షల భూరి విరాళాలతో ఆలయ నిర్మాణం చకచకా పూర్తయినట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్మాణ పర్యవేక్షకులు దొప్పలపూడి వీరయ్య తెలిపారు. కొండమంజులూరు కొండకు దిగువన తూర్పు దిక్కుగా సుందరంగా నిర్మితమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్ నిర్మాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈనెల 23వ తేదీన శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ పునర్ నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ



16వ దశాబ్దంలో కొంమంజులూరు గ్రామంలో నిర్మితమైన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాల స్వామి ఆలయం శిథిలావస్థకు చేర డంతో స్వామి వారికి పూజా కైంకర్యాలు, నిత్య నైవేద్య నిర్వహణకు కొంత కాలంగా ఇబ్బందిగా అనిపించేది. తమ వంశస్తులు తరతరాలుగా ఆలయంలో కొలువు దీరిన శ్రీ వేణుగోపాలస్వామి వారికి సేవ చేసే భాగ్యం ప్రసాదించిన సాక్షాత్తు ఆ మహా విష్ణువు భక్తుల మదిలో కొలువుదీరి, గ్రామస్థులను ఆలయ పునర్ నిర్మాణానికి పురికొల్పాడనే భావన కలుగుతుంది. ఆలయం సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నిర్మాణంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

- ముప్పాళ్ల శ్రీనివాస్, ఆలయ అర్చక స్వామి

విద్యుత్ అక్రమ వినియోగంపై నిఘా

- అధికారుల ఆకస్మిక తనిఖీ
- 63 మందిపై కేసులు, రూ.3,18,000 అపరాధ రుసుం విధింపు



తనిఖీలపై విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ మస్తానరావు, డీఈ

మార్టూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందచేస్తున్నామని, అయితే విద్యుత్ శాఖను మోసం చేస్తూ నిబంధనలును ఉల్లంఘించే వారిపై నిఘాను పెంచాలని విద్యుత్ శాఖ అద్దంకి ఈఈ ఎస్.మస్తాన్‌రావు విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం మార్టూరులో విద్యుత్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు గ్రానైట్ పరిశ్రమలను, వ్యాపారవర్గాలు, పలు వినియోగదారుల గృహాలను తనిఖీ చేసి విద్యుత్ అక్రమ వినియోగం, అధికలోడు, కరెంటు మీటర్ల వినియోగం తదితర అంశాలను వారు తనిఖీ చేశారు. వారిలో నిబంధనలను ఉల్లంఘించిన 63 మందిపై కేసులు నమోదు చేసి, వారిపై రూ.3,18,000 అపరాధ రుసుంతో కేసులు నమోదుచేసినట్లు ఈఈ మస్తానరావు తెలిపారు. ఈ తనిఖీలలో ప్రత్యేకంగా 30 మందితో కూడిన అధికారుల బృందం పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయం వద్ద ఈఈ మస్తాన్‌రావు తనిఖీ అధికారులతో కలిసి మాట్లాడారు. గ్రామాలలో విద్యుత్ అక్రమ వినియోగం చేసే వారిపై చర్యలు ఉంటాయని, ఈ విషయంపై వినియోగదారులకు అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో మార్టూరు డీఈఈ ఎం.సురేంద్రబాబు, అద్దంకి డీఈఈ ఎం.దామోదరరాజుతో పాటు అద్దంకి డివిజన్‌లోని పలువురు మండల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

నీటి సంఘం ఎన్నికపై సిబ్బందికి సూచనలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్నికల అధికారి సుమంత్

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 14న జరుగనున్న ఎన్ని కలకు సంబంధించి పంగులూరు - 2 నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల అధికారి సుమంత్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది 14వ తేదీ ఉదయం 8 గంటలలోపే ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిర్ణీత వ్యవధిలో పోటీ చేసే ఆసక్తి గల రైతుల నుంచి నామినేషన్లు స్వీకరించడం, వాటి పరిశీలన, ఉపసంహరణ కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రక్రియ సాయంత్రం 5 గంటలలోపు పూర్తి చేసేందుకు సిబ్బంది ఎన్నికల నిర్వహణాధికారికి సహకరించాలని కోరారు. నిబంధనల మేరకు ఎన్నిక నిర్వహించడంతో పాటు ఓటర్లతో సమన్వయంతో వ్యవహరించి ఎన్నిక పక్రియ శాంతియుతంగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్, ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

రైలు నుంచి జారి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చింతల శ్రీకాంత్ (30) బుధవారం రాత్రి రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడి నెల్లూరు సమీపంలో మృతి చెందాడు. కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన చింతల వెంకయ్య రెండో కుమారుడు చింతల శ్రీకాంత్ బుధవారం తన ఇంటి నుంచి తిరుపతి బయలుదేరి ఒంగోలులో రైలు ఎక్కాడు. నెల్లూరు సమీపానికి రైలు వెళ్లగానే శ్రీకాంత్ ప్రమాదవశాత్తూ కదిలే రైలు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. శ్రీకాంత్ రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని రైల్వే పోలీసు లు వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. గురువారం నెల్లూరు నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. శ్రీకాంత్‌కు వివాహం కాలేదు.

సంతోషంగా.. సరదాగా ఉండాలంటూనే..

(5వ పేజీ తరువాయి)

స్నేహితులు పేర్కొంటున్నారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు ఇంకా తెలియడం లేదని చెబుతున్నారు.

అర్ధరాత్రి వేళ..

ప్రవీణ్‌నాయక్‌ది ప్రకాశం జిల్లా పుల్లలచెరువు మండలం పెద్దపీఆర్‌సీ తాండ. 2022-23 బ్యాచ్‌లో శ్రీకాకుళం క్యాంపస్‌లో చేరాడు. రెండేళ్లపాటు చిలకపాలెంలోని శివానీ క్యాంపస్‌లో పీయూసీ పూర్తి చేశాడు. ప్రస్తుతం సివిల్ ఇంజనీరింగ్ ప్రథమ సంవత్సరానికి ప్రమోట్ కావడంతో.. మూడు నెలల కిందటే ఎస్ఎంపురం కొండపై ఉన్న క్యాంపస్‌కు మార్చారు. ఈక్రమంలో బాలురు హాస్టల్‌లో ఆరుగురు తోటి విద్యార్థులతో కలిసి మూడో అంతస్తులోని ఓ గదిలో ఉంటున్నాడు. గురువారం ఇంటర్నల్ ఎగ్జామ్ ఉండటంతో ప్రవీణ్‌నాయక్ బుధవారం అర్ధరాత్రి 1.40 గంటల సమయం వరకు మెలకువగా ఉండి.. ఆ సమయంలో మూత్ర విసర్జన కోసం వెళతానని స్నేహితులకు చెప్పి బయటకు వచ్చాడు. మూడో అంతస్తు పైనుంచి కిందకు దూకాడు. అదే భవనంలో కింద అంతస్తులో నిద్రిస్తున్న విద్యార్థులు ఆ శబ్దాన్ని గమనించి బయటకు వచ్చి చూశారు. రక్తపు మడుగులో ఉన్న ప్రవీణ్‌నాయక్‌ను గుర్తించారు. వెంటనే విధుల్లో ఉన్న సిబ్బందికి తెలియజేయగా ఉన్నతాధికారులకు సమాచారం అందించారు. వెంటనే క్యాంపస్ డైరెక్టర్ డాక్టర్ కేవీజీడీ బాలాజీ, ఏవో ముని రామకృష్ణ, పలువురు అధ్యాపకులు సంఘటనా స్థలానికి చేరుకున్నారు. క్యాంపస్‌కు చెందిన అంబులెన్స్‌తో శ్రీకాకుళం సర్వజనాసుపత్రికి హుటాహుటిన తరలించగా ప్రవీణ్‌నాయక్ చికిత్సపొందుతూ మృతిచెందాడు.

వ్యవసాయ కుటుంబం

మృతుడి తల్లిదండ్రులు రవీంద్రనాయక్, విజయాబాయి వ్యవసాయం చేస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు ముగ్గురు కుమారుల్లో ప్రవీణ్‌నాయక్ మొదటి సంతానం. రెండో కుమారుడు ఆర్‌కే వ్యాలీ ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌లో పీయూసీ-1 చదువుతున్నాడు. మూడో కుమారుడు అదే గ్రామంలోనే పదో తరగతి చదువుతున్నాడు. కుమారుడి మృతి వార్త తెలిసి వారు విషాదంలో మునిగిపోయారు. ఎచ్చెర్ల ఎస్‌ఐ వి.సందీప్‌కుమార్ సంఘటనా స్థలాన్ని సందర్శించి వివరాలు సేకరించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. డీఎస్పీ వివేకానంద, సీఐ అవతారం, తహసీల్దార్ సింహాచలం తదితరులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అలాగే ఎచ్చెర్ల ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం ఉదయం ట్రిపుల్ ఐటీ క్యాంపస్‌ను సందర్శించారు. విద్యార్థి దూకిన చోట కిటికీ లేకపోవడాన్ని చూసి అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఈ విషయాన్ని మంత్రి నారా లోకేశ్ దృష్టికి కూడా తీసుకెళ్తున్నట్టు చెప్పారు.

తాండలో విషాదఛాయలు

రామావత్ ప్రవీణ్‌కుమార్‌నాయక్ మృతిచెందాడని ట్రిపుల్ ఐటీ నుంచి అధికారి గురువారం ఉదయం తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం ఇచ్చారు. విషయం తెలిసిన వెంటనే వారు బయలుదేరి వెళ్లిపోయారు. కాగా ప్రవీణ్‌కుమార్ చదువులో చురుగ్గా ఉండేవాడు. పదవ తరగతిలో జిల్లాస్థాయిలో ర్యాంకు సాధించి ట్రిపుల్ ఐటీలో సీటు దక్కించుకున్నాడు. ప్రవీణ్ ఆత్మహత్య చేసుకునేంత పిరికివాడు కాదని, దీని వెనుక బలమైన కారణాలు ఉండి ఉంటాయని తల్లిదండ్రులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు లోతైన దర్యాప్తు చేస్తే మరిన్ని వివరాలు తెలుస్తాయన్నారు. ప్రవీణ్‌కుమార్ తండ్రి రవీంద్రనాయక్ కూలీ పనులు చేసుకొని పిల్లలను చదివిస్తున్నాడు. ప్రవీణ్ మృతితో తాండలో విషాదఛాయలు అలముకున్నాయి.

ప్రేమ వైఫల్యమే కారణం: డీఎస్పీ

ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్‌నాయక్ ఆత్మహత్యకు.. ప్రేమ వైఫల్యమే కారణమని శ్రీకాకుళం డీఎస్పీ సీహెచ్.వివేకానంద తెలిపారు. గురువారం సాయంత్రం శ్రీకాకుళంలోని డీఎస్పీ కార్యాలయంలో విలేకరులతో ఆయన మాట్లాడారు. 'ట్రిపుల్ ఐటీ విద్యార్థి ప్రవీణ్‌నాయక్ ఆత్మహత్య ఘటనపై నైట్ వాచ్‌మెన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి సీఐ ఎం.అవతారం విచారణ చేపట్టారని తెలిపారు. ప్రవీణ్.. కళాశాలలోని ఓ అమ్మాయిని ప్రేమించాడని, ఆ విషయం ఆమెకు చెప్పగా తిరస్కరించడంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నట్టు ప్రాథమిక విచారణలో తేలిందన్నారు. హాస్టల్‌లో తోటి విద్యార్థుల దగ్గర ఈ విషయాన్ని ప్రవీణ్ ప్రస్తావించాడని, తల్లిదండ్రులతోపాటు, కళాశాలలో కూడా విచారిస్తున్నామన్నారు. ల్యాప్‌ట్యాప్, సెల్‌ఫోన్‌లో సమాచారం సేకరిస్తున్నామని వివరించారు. విద్యార్థులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని, ఇకపై కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తామని తెలిపారు.

యువతిని పెళ్లి చేసుకుంటానని

ఆటోడ్రైవర్ మోసం

● వాంఛతో వత్తిడి చేసిన అతడి తండ్రి ● పోలీసులకు బాధితురాలి ఫిర్యాదు

ఒంగోలు(క్రైం), డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ప్రేమిస్తూ పెళ్లి చేసుకుంటానని చెప్పి ఓ యువతిని ఆటో డ్రైవర్ మోసం చేశాడు. దీంతో బాధితరాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. వివరాలలోకి వెళితే.. సంతనూతలపాడు మండలానికి చెందిన ఓ యువతి ఒంగోలులోని ఓ ప్రైవేటు వైద్యశాలలో పని చేస్తుంది. స్థానిక నేతాజీకాలనీలో నివాసం ఉంటున్న ఆటోడ్రైవర్ రమవత్ పరుశురామ్ ఏడాది క్రితం ఆమెకు పరిచయం అయ్యాడు. పెళ్లి చేసుకుంటానిని చెప్పి లొంగదీసుకున్నాడు. ఈక్రమంలో యువతి తనను పెళ్లి చేసుకోవాలంటూ నిలదీయ్యగా రూ.5లక్షలు వరకట్నం కావాలని డిమాండ్ చేశారు. అంతేగాకుండా పరుశురామ్ తండ్రి, తన కోరిక తీర్చాలని, అప్పుడే తన కుమారుడుతో వివాహం చేస్తానని యువతికి చెప్పాడు. దీంతో మానసికంగా వేదన చెందిన బాధితురాలు ఒంగోలు వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పరుశురామ్‌తోపాటు అతని తల్లిదండ్రులపై కేసు నమోదు చేసినట్లు వన్‌టౌన్ సీఐ నాగరాజు తెలిపారు.

ఆటోలను నిరంతరం తనిఖీలు చేస్తాం

● డీటీసీ సుశీల

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఒంగోలు(క్రైం), డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): ఆటోలలో పరిమితికి మించి స్కూలుకు వెళ్లే పిల్లలను తరలిస్తే కేసులు నమోదు చేస్తామని జిల్లా రవాణాశాఖ డిప్యూటీ కమిషనర్ ఆర్.సుశీల తెలిపారు. గురువారం ఆంధ్రజ్యోతిలో ప్రచరితమైన 'ప్రమాదంలో బంగారు బాల్యం' అనే కథనంపై రవాణా శాఖ స్పందించింది. ఈ ఏడాది ఏప్రిల్ నుంచి ఇప్పటి వరకు 7,568 కేసులు నమోదు చేశామని డీటీసీ తెలిపారు. ఆటోలలో పరిమితికి మించి పిల్లలను తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అలాగే ముమ్మర తనిఖీలు చేస్తామని ఆమె వెల్లడించారు.

భూ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి అన్నా రు. మండలంలోని రామకూరు, కల్లంవారిపాలెం గ్రామాలలో గురువారం తహసీల్దార్ సింగారావు పర్యవేక్షణలో రెవెన్యూ సదస్సు ను నిర్వహించారు. రామకూరులో ఆర్‌వోఆర్‌కు సంబంధించి 31, ఎఫ్‌లైన్ కోరుతూ 6, 22-ఎ(1) సి -1, కల్లంవారిపాలెం గ్రామ సదస్సులో ఆర్వోఆర్-4, ఎఫ్‌లైన్‌కు 7 దరఖాస్తులు అందగా, నాలుగు సమస్యలు సదస్సులోనే పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపా రు. కార్యక్రమంలో కల్లంవారిపాలెం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, చినఆదిరెడ్డి, గుడిపాటి సుబ్బారెడ్డి, రామకూరు ఉప సర్పంచ్ అశోక్, సర్వేయర్ సురేష్, ఆర్ఐ బాపయ్య, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : గ్రామాలలో ఉన్న రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. గురువారం మండలంలోని నక్కబొక్కలపా డులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా నక్కబొక్కలపాడు గ్రామ ప్రజలు శివాలయానికి వెళ్లేందుకు దారి అక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. ఈ సభలో ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, సర్పంచ్ ధూళిపాళ్ల బుల్లిరామయ్య పాల్గొన్నారు.

చినగంజాం : సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్‌ల కోసం 12, భూ సర్వేకు నాలుగు, అండగల్ 1బీ కోసం రెండు అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్బారావు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రెవెన్యూ సదస్సులో సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ పి.బ్రహ్మయ్య కోరారు. గురువారం చెరుకూరు, కొత్తపాలెంలో జరి గిన సదస్సుల్లో ఆయన 11 అర్జీలను స్వీకరించారు.

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి పూజలు

వేటపాలెం, చీరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దత్త క్షేత్రంలో దత్తజయం తి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం భక్తు లు దత్త క్షేత్రంలోని శ్రీరామ యంత్ర క్షేత్రంలో తాము రాసిన రామకోటి ప్రతులను నిక్షిప్తం చేశారు. అనంతరం దత్తయజ్ఞం, పంచదత్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1008 సార్లు సిద్ధ మంగళ స్తోత్రాన్ని పారాయణం చేవారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ప్రతి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ 15వ తేదీ ఆదివారం దత్త జయంతి పర్వదినాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. శ్రీవేంకటేశ్వర కోలాట భక్త బృందం దత్త మందిరం, రామభక్త హనుమాన్ మందిరంలలో నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రమీలదేవి, చుండూరి లక్ష్మి, కరణం మురళీకృష్ణ, గుర్రం రంగనాయకులు, కన్నయ్య, రాంబాబు, వెంకట్రావు, చంద్ర, చంద్రకళ, రమాదేవి, భువనేశ్వరి, రాజేశ్వరి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ఇంకొల్లు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు వెంటనే బకాయి చెల్లించాలని స్త్రీనిధి ఏజీఎం నాగబాబు ఆదేశించారు. వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం సహాయకులకు సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏజీఎం నాగబాబు మాట్లాడుతూ ఇంకొల్లు మండలానికి రూ.4కోట్ల 50లక్షల స్త్రీనిధి రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మండలంలో మొండి బకాయిలను వెంటనే చెల్లించినట్లయితే తిరి గి రుణాలు పొందవచ్చన్నారు. ఇడుపులపా డు గ్రామంలో ఎక్కువ రుణ బకాయిలు ఉ న్నాయని వాటి రికవరీపై సిబ్బంది దృష్టి సారించాలని ఏపీఎం అనూరాధను ఆదేశించారు.

బకాయి ఉన్న ప్రతి గ్రూపు సభ్యురాలికి మండల సమాఖ్య నుంచి నోటీసులు జారీ చేయాలని సూచించారు. తీసుకున్న రుణాలతో జీవనోపాధి అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామసహాయకులు, సీసీలు డి.అశోక్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఒక్కొక్కరికి రూ.3వేల జరిమానా

వేటపాలెం, చీరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 216 జాతీయ రహదారిలో బచ్చులవారిపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం తహసీల్దార్ పార్వతి సిబ్బందితో కలసి నిర్వహించిన ఆకస్మిక తనిఖీలలో అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈక్రమంలో తహసీల్దార్‌తో అక్రమార్కులు ఒకింత వాదనకు దిగారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలు నేరమన్నారు. అలాం టి చర్యలను ఉపేక్షించమని తహసీల్దార్ పార్వతి హెచ్చరించారు. ఒక్కొక్కరికీ రూ.3వేల చొప్పున ముగ్గురికి రూ.9వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

గిరిజనాభివృద్ధే లక్ష్యంగా..


చెంచు గూడేల్లో తాగునీటి కోసం పైపులైను పనులు

చెంచు గిరిజనులకు బాసటగా డీఏజేజేజీయూ పథకం

- గిరిజన గ్రామాల్లో అభివృద్ధి పనులకు కేంద్రం శ్రీకారం
- జిల్లా నుంచి 3 మండలాల్లోని 16 గ్రామాల ఎంపిక
- ఇప్పటికే అమలులో ఉన్న 'జన్‌మన్' నూతన పథకంలో విలీనం


మర్రిపాలెం గిరిజన గ్రామం

దేశంలోని గిరిజనుల అభ్యున్నతి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. దేశ వ్యాప్తంగా చెంచు గిరిజనులు అన్నిరకాల సౌకర్యాలు, హక్కులు పొందేందుకు నూతన కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. గిరిజనులను సామాజికంగానూ, ఆర్థికంగానూ బలోపేతం చేసేందుకు ప్రధానమంత్రి దర్తీ అబ జన్ జాతీయ గ్రామ ఉత్కర్ష్ అభియాన్ (డీఏజేజేజీయూ) పథకాన్ని ప్రారంభించింది. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా గత అక్టోబరు 2వ తేదీన జార్ఖండ్ రాష్ట్రం హజారీబాగ్‌లో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకానికి జిల్లా నుంచి 16 గ్రామాలను ఎంపిక చేశారు. ఆయా గ్రామాల్లో ఏమేం చేయబోతున్నారో చూద్దాం.

- పెద్ద దోర్నాల/ఒంగోలు నగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి)

డీఏజేజేజీయూ అమలు తీరు ఇలా..

పీఎం జన్‌మన్ ద్వారా చెంచు గిరిజనుల సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందని భావించిన కేంద్ర ప్రభుత్వం గిరిజనుల్లోని అన్నివర్గాల ప్రజలకు మేలు జరిగేలా దర్తీ అబ జన్ జాతీయ ఉత్కర్ష్ అభియాన్‌ను రూపొందించింది. ఈ పథకం ద్వారా 17 మంత్రిత్వ శాఖలను ఒక గొడుగు కిందకు చేర్చి 25 కేంద్ర ప్రభుత్వ పథకాలను ఏకీకృతం చేయనున్నారు. దీంతో దేశ వ్యాప్తంగా ఉన్న గిరిజనులకు నేరుగా ప్రభుత్వ ఫలాలు అందించాలన్నదే ప్రభుత్వాల లక్ష్యం. ఈ పథకం అమలుకు కేంద్రం నిధులు 70 శాతం, రాష్ట్ర నిధులు 30 శాతం వాటాగా దేశ వ్యాప్తంగా 228 రాష్ట్రాలు, 4 కేంద్ర పాలిత ప్రాంతాల్లోని 700లకుపైగా ఉన్న గిరిజన తెగల అభివృద్ధి కోసం రూ.79,156 కోట్లు కేంద్రం కేటాయించింది. వీటితో దేశంలోని 63 వేల గ్రామాల్లో 5 కోట్ల మంది గిరిజనులకు మౌలిక వసతులు, విద్య, వైద్యం జీవనోపాధి కల్పిస్తుంది.


అభివృద్ధికి దూరంగా ఆవాసాలు

ఇప్పటికే అమలులో ఉన్న పీఎం జన్‌మన్

- గతేడాది నవంబరులో పీఎం జన్‌మన్ పథకాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో అమలు చేస్తున్నాయి. ఈ పథకం కింద 11 రకాల విభాగాల అధికారులు చెంచు గిరిజనులకు సేవలందిస్తున్నారు. ఇంటింటి సర్వే నిర్వహించి లబ్ధిదారుల వ్యక్తిగత అవసరాలతో పాటు గ్రామాల అభివృద్ధికి అవసరమయ్యే మౌలిక సదుపాయాలను క్షేత్రస్థాయిలో గుర్తించి ప్రతిపాదనలు తయారు చేసి ఉన్నతాధికారులకు పంపించారు.
- జన్‌మన్ ద్వారా జిల్లాలోని అన్ని చెంచు గిరిజన గ్రామాలనూ ఎంపిక చేశారు. పనులు కూడా ప్రారంభించారు. గ్రామాలకు విద్యుత్తు సౌకర్యం ఏర్పాటుకు అటవీ శాఖాధికారుల అనుమతులతో స్తంభాలు పాతి తీగలు కూడా లాగారు. సగానికిపైగా గూడేల్లో విద్యుత్తు సౌకర్యం ఏర్పాటు చేశారు.
- జలజీవన్ మిషన్ పథకంలో భాగంగా తాగునీరు అందించేందుకు ప్రతి ఇంటికీ కొళాయిలు ఏర్పాటు చేస్తున్నారు.
- 1167 పక్కాగృహాల నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించగా 467 గృహాలు మంజూరయ్యాయి. వీటిని ప్రభుత్వ సహకారంతో ఆర్‌డీటీ సంస్థ నిర్మించనుంది. జన్‌మన్ కింద దేశవ్యాప్తంగా రూ.24,000 కోట్లు నిధులు కేటాయించారు. ఈ పథకం కేవలం చెంచు గిరిజనుల అభివృద్ధి కోసమే అమలు చేస్తున్నట్లు సంబంధిత అధికారులు తెలిపారు. జన్‌మన్ పథకాన్ని కొత్తగా ప్రవేశపెట్టిన డీఏజేజేజీయూ (దర్తీ అబ జన్ జాతీయ ఉత్కర్ష్ అభియాన్)లో విలీనం చేస్తారు.

జిల్లాలో 3 మండలాలు ఎంపిక

- ఈ పథకానికి జిల్లా నుంచి 3 మండలాల్లోని 16 గ్రామాలను కేంద్ర ప్రభుత్వం పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసింది.
- దోర్నాల మండలంలోని తుమ్మలబైలు, మర్రిపాలెం, చింతల, నల్లగుంట్ల గూడెం, చిలకచెర్ల గూడెం, ఎర్రగొండపాలెం మండలంలోని పాలుట్ల, అల్లిపాలెం, గుట్టలచెరువు, వెంకటాద్రిపాలెం, మిల్లంపల్లి, ఎర్రగొండపాలెం, దద్దనాల, ఆమని గుడిపాడు, గుర్రపసాల, గొల్లవిడిపి ఎంపికయ్యాయి. విడతల వారీగా మిగిలిన గ్రామాలను ఎంపిక చేస్తారని ఐటీడీఏ అధికారులు తెలిపారు.
- గ్రామాల్లో ఏయే రకమైన వసతులు కల్పించాలన్న దానిపై ప్రతిపాదనలు తయారు చేస్తారు. గ్రామాల్లోని గిరిజనుల అభిప్రాయాలు, వినతులు, సూచనలు సంబంధిత అధికారులు స్వీకరిస్తారు. కలెక్టర్ ద్వారా నిధుల కోసం కేంద్ర ప్రభుత్వానికి నివేదికలు అందజేస్తారు.

చేపట్టే పనులివే..

చెంచు గిరిజన గ్రామాల్లో పక్కా గృహాలు, రోడ్ల అనుసంధానం, నీటి సరఫరా, విద్యుత్, మొబైల్ మెడికల్ యూనిట్లు ఏర్పాటు, గిరిజనానికి ఆయుష్మాన్ కార్డులు, గ్యాస్ కనెక్షన్లు, అంగన్వాడీ కేంద్రాల ఏర్పాటు, వసతి గృహాల నిర్మాణం, పౌష్టికాహారం పంపిణీ, సమాచార సౌకర్యం, స్కిల్ ఇండియా మిషన్, సుస్థిరమైన వ్యవసాయం, చేపల పెంపక, పశు పోషణ, ఆదివాసీ అతిథి గృహాల నిర్మాణాలతో పాటు గిరిజన సాధికారిత సాధించే దిశగా అవసరమైన అన్ని పనులూ డీఏజేజేజీయూ పథకం కింద చేపట్టనున్నారు.


గోల్డ్‌మెడల్ అందుకుంటున్న యోగిరాములు

దొనకొండ యువకుడికి స్విమ్మింగ్‌లో గోల్డ్‌మెడల్

దొనకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయిలో హైదరాబాద్ గచ్చీబౌలిలోని జీఎంసీ బాలయోగి స్టేడియంలో ఈనెల 8 నుంచి జరిగిన 7వ ఇండియన్ ఫిన్ స్విమ్మింగ్ నేషనల్ ఫెడరేషన్ కప్ పోటీల్లో దొనకొండ మండలం, చందవరం గ్రామానికి చెందిన కన్నెబోయిన యోగిరాములు సత్తాచాటి గోల్డ్‌మెడల్ సాధించాడు. భారతదేశంలోని పది రాష్ట్రాలకు చెందిన క్రీడాకారులు ఈ పోటీల్లో పాల్గొనగా ఆంధ్రప్రదేశ్ తరుపున యోగిరాములు ఈ పోటీల్లో పాల్గొని తన ప్రతిభ కనబర్చాడు. యోగిరాములు ఫ్రీ స్టయిల్ స్విమ్మింగ్ విభాగంలో 4.50 మీటర్లల్లో సిల్వర్ మెడల్, 4.100 మీటర్లల్లో గోల్డ్‌మెడల్ సాధించాడు. వెనుకబడిన దొనకొండ మండలంలోని చందవరం గ్రామంలో పేదరికంలో పుట్టి హస్టల్‌లో విద్యాభ్యాసం కొనసాగిస్తూ ఒకవైపు చదువుకుంటూ మరోవైపు క్రీడల్లో రాణిస్తున్నాడు.


రోడ్డు పక్కనే రాళ్లను, వ్యర్థాల కుప్పలు

రాష్ట్ర రహదారి పక్కనే రాళ్లకుప్పలు, వ్యర్థాలు..

- వాహనదారులకు ఇక్కట్లు

చీమకుర్తి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోనే అత్యంత రద్దీ ఉన్న రహదారుల్లో ఒంగోలు నుంచి కర్నూల్‌కు వెళ్లే రాష్ట్ర రహదారి ఒకటి. ఈ రహదారి చీమకుర్తి నుంచి వెళ్తూ పశ్చిమ ప్రకాశానికి ముఖద్వారంగా ఉంది. చీమకుర్తి శివారున పశ్చిమ బైపాస్ రోడ్డు పక్కనే రాళ్లను, వ్యర్థాలను కుప్పలుగా పోస్తుండటం వాహనదారులు, ప్రయాణికులు ఇక్కట్లపాలవుతున్నారు. ఆ వ్యర్థాలు గాలిలో కలిసిపోయి ద్విచక్ర వాహనదారులకు ఇబ్బందికరంగా, ప్రమాదకరంగా మారింది. రోడ్ పక్కనే ఉండటంతో వాహనాలకు మార్జిన్ కూడా లేక అగచాట్లు పడుతున్నారు. సంబంధిత అధికారులు తక్షణమే ఈ విషయంపై దృష్టి సారించి తగు చర్యలు చేపట్టి ప్రమాదాలు జరగకుండా చూడాలని వాహనదారులు కోరుతున్నారు.


సౌత్ ఇండియా షాపింగ్‌మాల్‌ను ప్రారంభిస్తున్న సినీనటి శ్రీలీల


జ్యోతి వెలిగిస్తున్న ఎమ్మెల్యే దామచర్ల దంపతులు, పక్కన ఎస్ఎన్‌పాడు ఎమ్మెల్యే విజయ్‌కుమార్, షోరూం నిర్వాహకులు

ఘనంగా సౌత్ ఇండియా షాపింగ్ మాల్ ప్రారంభం

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): వస్త్ర ప్రపంచంలో తనకంటూ ఒక ప్రత్యేకత సంతరించుకున్న సౌత్ ఇండియా షాపింగ్‌మాల్ షోరూం ప్రారంభోత్సవం ఒంగోలులో గురువారం ఉదయం ఘనంగా జరిగింది. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ ఎదురుగా ఏర్పాటు చేసిన ఈ షాపింగ్‌మాల్‌ను ప్రముఖ సినీ నటి శ్రీలీల ప్రారంభించారు. ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్, మేయర్ గంగాడ సుజాత ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రఖ్యాతి చెందిన సౌత్ ఇండియా షాపింగ్ మాల్‌ను ఒంగోలులో ప్రారంభించటం ఎంతో ఆనందంగా ఉందన్నారు. షాపింగ్‌మాల్ డైరెక్టర్ సురేశ్ సీర్ల మాట్లాడుతూ తమ 38వ షోరూంను ఒంగోలులో ప్రారంభించినట్లు తెలిపారు. మరొక డైరెక్టర్ అభినయ్ మాట్లాడుతూ రాబోయే క్రిస్మస్, నూతన సంవత్సరం, సంక్రాంతి పండుగలను దృష్టిలో ఉంచుకుని సంప్రదాయ కలెక్షన్లను అతి తక్కువ ధరలకు ప్రజలకు అందుబాటులో ఉంచామని అన్నారు. నాణ్యతకు తాము ఎంతో ప్రాధాన్యతనిస్తున్నట్లు డైరెక్టర్లు రాకేశ్, కేశవ్‌లు తెలిపారు. ఈ సందర్భంగా పెద్దసంఖ్యలో వచ్చిన కొనుగోలుదారులతో షాపింగ్ మాల్ కిక్కిరిసిపోయింది.


కేంద్ర మంత్రి శరబానంద్ సోనోలోవాల్‌కు వినతిపత్రం అందజేసి చర్చిస్తున్న మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్య

పోర్టులకు అనుబంధంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు

- దామచర్ల సత్యకు కేంద్రమంత్రి సోనోవాల్ హామీ

ఒంగోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కీలక పోర్టులకు అనుబంధంగా ఆ రంగాల్లో నైపుణ్యం పెంపు, వృత్తిపరమైన శిక్షణకు ఉపకరించేలా నైపుణ్యాభివృద్ధి కేంద్రాల ఏర్పాటుకు కేంద్ర ఓడరేవులు, నౌకాయన శాఖల మంత్రి వరబానంద్ సోనోవాల్ హామీ ఇచ్చినట్లు రాష్ట్ర మారిటైం బోర్డు చైర్మన్ దామచర్ల సత్యనారాయణ (సత్య) తెలిపారు. రాష్ట్రంలో తీర ప్రాంత అభివృద్ధి, పోర్టుల నిర్మాణం ఇతర అభివృద్ధి అంశాలపై కేంద్ర మంత్రి సోనోవాల్‌ను ఢిల్లీలో గురువారం దామచర్ల సత్య కలిసి చర్చించారు. పలు అభివృద్ధి అంశాలపై పెండింగ్‌లో ఉన్న, కొత్త ప్రతిపాదనలపై వినతిపత్రం అందజేసి ఆయా అంశాలపై చర్చించారు. ప్రధానంగా రాష్ట్రంలో విస్తారంగా ఉన్న తీర ప్రాంత అభివృద్ధి కోసం కేంద్రం చేపట్టిన సాగరమాల ప్రాజెక్టులో రాష్ట్రానికి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కాకినాడు, మచిలీపట్నం, రామాయపట్నం, మూలపేట పోర్టులకు అనుబంధంగా నైపుణ్యాభివృద్ధి కేంద్రాలు, రాష్ట్రంలో షిప్ బిల్డింగ్ క్లస్టర్ ఏర్పాటు, విభజన చట్టంలో పేర్కొన్న విధంగా రాష్ట్రంలో పోర్టు కమ్ షిప్ యార్డును మంజూరు చేయాలన్నారు. కేంద్ర జలరవాణా పథకం ద్వారా గుర్తించిన అంతర్గత జలరవాణా మార్గాల అభివృద్ధి, మారిటైం షిప్ బిల్డింగ్‌లో సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ (సెమ్స్) బలోపేతానికి చర్యలతో పాటు బాపట్ల జిల్లా చినగంజాం మండలం పెద్దగంజాం-మోటుపల్లి ప్రాంతంలో గ్రీన్‌ఫీల్డ్ పోర్టు, షిప్ బిల్డింగ్ యూనిట్ల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు. ఆయా అంశాలపై సాధ్యసాధ్యాలు, రాష్ట్రంలో పోర్టుల అభివృద్ధికి చర్యలపై కేంద్రమంత్రితో చర్చించగా పలు అంశాలపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు సత్య తెలిపారు.


సుబ్బయ్య అంత్యక్రియలకు తీసుకెళ్తున్న వాహనం


సుబ్బయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న తల్లి

కన్నీటి సంద్రమైన నార్పల

సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు

నార్పల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తోటి సైనికుల ప్రాణాలను కాపాడి, వీర మరణం పొందిన జవాను వెంకట సుబ్బయ్య అంతిమ యాత్రకు జనం పోటెత్తారు. అనంతపురం జిల్లా నార్పల మండల కేంద్రంలోని వ్యవసాయ భూమిలో గురువారం ఆయన అంత్యక్రియలను సైనిక లాంచనాలతో పూర్తి చేశారు. నార్పల మండలంతోపాటు జిల్లాలోని వివిధ ప్రాంతాల ప్రజలు భారీఎత్తున తరలివచ్చారు. సుబ్బయ్య అమర్ రహే అంటూ నినాదాలు చేస్తూ అంతిమయాత్రలో పాల్గొన్నారు. వివిధ రాజకీయ పార్టీ నాయకులు, ఉద్యోగులు, విద్యార్థులు, అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు హాజరై.. జోహార్లు అర్పించారు. శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆలం నరసానాయుడు, పార్టీ నాయకులు ఆలం వెంకటనరసానాయుడు, ఆకుల ఆంజనేయులు, ఆకుల విజయ్‌కుమార్‌బాబు, పిట్టు రంగారెడ్డి, వైసీపీ నాయకులు సత్యనారాయణ రెడ్డి తదితరులు సుబ్బయ్యకు ఘన నివాళులు అర్పించారు. జవాన్ సుబ్బయ్య భౌతిక కాయానికి కప్పిన జాతీయ జెండాను ఆయన భార్య, తల్లికి ఆర్మీ అధికారులు అందజేశారు. ఆర్మీ అధికారులు గాలిలోకి కాల్పులు జరిపి గౌరవ వందనం సమర్పించారు. ఆయన భార్యకు ప్రభుత్వ ఉద్యోగం ఇప్పించడంతోపాటు అన్నివిధాలుగా తోడ్పాటును అందజేస్తామని ఆర్డీఓ కేశవనాయుడు తెలిపారు. డీఎస్పీ వెంకటేశ్వర్లు, జిల్లా సైనిక సంక్షేమ అధికారులు తిమ్మప్ప, రఫీ, డిప్యూటీ తహసీల్దారు శ్రీనివాసమూర్తి, మాజీ సైనిక అధికారులు అంత్యక్రియలలో పాల్గొన్నారు.


సుబ్బయ్య మృతదేహం వద్ద రోదిస్తున్న భార్యలీలావతి

కన్నీటి సంద్రం

సుబ్బయ్య భౌతికకాయం వద్ద చివరి రోజున భార్య లీలావతి, ఇద్దరు పిల్లలు నిఖిల్ సాయి, ప్రియ కన్నీరు మున్నీరయ్యారు. 'డాడీ.. మాతో మాట్లాడు డాడీ.. పైకి లే' అంటూ చిన్నారులిద్దరూ తమ తండ్రిని తట్టిలేపేందుకు ప్రయత్నించడం అక్కడున్నవారిని కంటతడి పెట్టించింది. 'వచ్చే సోమవారం వస్తానని ఫోన్‌లో చెబితివి కదా..? ఆ రోజు కోసం ఎంతగా ఎదురుచూశాను..? గంటలను లెక్కపెట్టుకుంటిని కదా..? చివరకు శవమై వచ్చావా..' అంటూ లీలావతి బోరున విలపించారు. తన భర్త భౌతిక కాయంమీద పడి వెక్కివెక్కి ఏడ్చారు.



విరిగిపోయిన ప్లాస్టిక్ జారుడు బల్లలు


ప్రమాదకరంగా ఉన్న కరెంటు తీగలు


కుంగిపోయిన వాకింగ్‌ట్రాక్


చెరువులా మారిన ఆటస్థలం

ఎన్టీఆర్ పార్కులో ఆహ్లాదం ఆవిరి


పార్కులో నిలిచిన వర్షపునీరు


పగిలిపోయిన ఊయలలోని సీట్లు

- పిలిస్తే పలుకుతున్న సమస్యలు
- వర్షం వస్తే చెరువులా మారుతున్న మైనం
- పిచ్చి మొక్కలతో చిట్టడవిలా..
- పట్టించుకోని కార్పొరేషన్ యంత్రాంగం
- ఇబ్బందిపడుతున్న వాకర్స్

ఒంగోలు కార్పొరేషన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఒంగోలు నగరంలోనే పెద్దదైన వార్డు. పదివేలకు పైగా ఓటర్లు ఉంటారు. ఆ ప్రాంతవాసుల ఆహ్లాదం కోసం ఏర్పాటు చేసిన ఏకైక పార్కు. అదే చెన్నకేశవ లే అవుట్ ఎన్టీఆర్ పార్కు. ప్రతిరోజు రెండువేల మందికి పైగా వాకింగ్, వ్యాయామంతోపాటు, సాయంత్రం వేళలో పిల్లల ఆటలతో సందడి వాతావరణం కనిపిస్తుంది. అయితే ప్రస్తుతం ఆ పరిస్థితి లేదు. పార్కులో సమస్యలు మాత్రం పిలిస్తే పలుకుతున్నాయి. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో అభివృద్ధి ఊసే లేకపోవడంతో స్థానిక పార్కు కమిటీ నిర్వాహకులే వాటి బాగోగులు చూసుకుంటున్నారు. పచ్చని మొక్కలు, సిమెంట్ బల్లలు, వాకింగ్ ట్రాక్ ఇలా ఆహ్లాదానికి అవసరమైనవన్నీ సమకూర్చుకున్నారు. అందుకోసం కొంత కమిటీ నిర్వాహకులే నిధులు సమకూర్చుకోగా, కొంత కార్పొరేషన్ నుంచి కొద్దిమొత్తంలో ఖర్చు చేశారు. అయితే ప్రస్తుతం ఎన్టీఆర్ పార్కులో పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. వర్షం వస్తే పార్కు చెరువులా మారిపోతోంది. తలపిస్తుంది. దట్టంగా పెరిగిన పిచ్చి మొక్కలతో అడవిని తలపిస్తోంది. పాడైపోయిన ఆట వస్తువులు, పట్టించుకునేవారు లేక పారిశుధ్యం అధ్వానంగా మారింది. దీంతో పేరుకే పార్కుగా ఉంది. ఒకవైపు పట్టణాలు, నగరాల అభివృద్ధి కోసం ప్రభుత్వం ఎస్క్యాప్ నిధులు కేటాయించి పనులు చేపట్టాలని ఆదేశిస్తుండగా, ఇక్కడి పార్కు గురించి పెద్దగా పట్టించుకునేవారు కరువయ్యారు. నగరంలో వివిధ అభివృద్ధి పనులకు, నగర అందాల కోసం నిధులు ఖర్చు చేస్తున్న కార్పొరేషన్ అధికారులు.. ఎన్టీఆర్ పార్కును బాగు చేయాలని కోరుతున్నారు. వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధి చెయడంతో పాటు దట్టంగా పెరిగిన మొక్కలను తొలగించాలని, అలాగే లోతట్టుగా ఉండటంతో కొద్దిపాటి వర్షం కురిసినా చెరువులా మారుతుందని, మట్టిని తోలించి ప్లే గ్రౌండ్‌గా మార్చాలని కోరుతున్నారు. విరిగిపోయిన ఆట వస్తువులను తిరిగి ఏర్పాటు చేయడంతోపాటు, ఓపెన్ జిమ్‌ను కూడా అందుబాటులో ఉంచాలని అక్కడి ప్రజలు కోరుతున్నారు.

పార్కు అభివృద్ధి ఊసే లేదు ..



నగరంలోనే అతి పెద్ద ఎన్నికల డివిజన్. పదివేలకు పైగా ఓటర్లు ఇక్కడ ఉన్నారు. గత ఎన్నికల్లో కూటమికి అధికంగా మెజారిటీ తీసుకొచ్చారు. అయితే కనీసం పార్కు అభివృద్ధి మాత్రం పట్టించుకోవడం లేదు. నగరంలో ప్రభుత్వం మంజూరు చేసిన ఎస్క్యాప్ నిధులతో నగరమంతా ముస్తాబు చేస్తున్నారు. కనీసం మా పార్కు బాగోగులు మాత్రం పట్టించుకోవడం లేదు. రోజుకు రెండువేల మంది చిన్నాపెద్దా కలిసి ఇక్కడకు వస్తుంటారు. కానీ కనీస వసతులు లేకపోవడం బాధాకరం. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని సమస్యలు పరిష్కరించాలి.

\- చెన్నుపాటి వరప్రసాద్, పార్కు అభివృద్ధి కమిటీ సభ్యులు

గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం



గతంలో చెన్నకేశవ లే అవుట్ పార్కు అంటే ప్రతి ఒక్కరూ ఇష్టపడేవారు. అందుకోసం గతంలో కార్పొరేషన్ నిధులపై ఆధారపడకుండా స్థానికులందరూ కలిసికట్టుగా పార్కును బాగు చేశాం. ప్రస్తుతం ఆ పరిస్థితి లేకుండాపోయింది. వాన వస్తే పార్కులోకి వచ్చే పరిస్థితి లేదు. అలాగే కనీసం పిల్లలు ఆడుకోవడానికి స్థలం లేదు. ప్రాంగణం మొత్తం మొక్కలు, గడ్డితో నిండిపోయింది. వాకింగ్ ట్రాక్ అధ్వానంగా మారింది. ఆట వస్తువులు పెరిగిపోయాయి. అధికారులు పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. పార్కులో సమస్యలపై గతంలో అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. అయినా ఎలాంటి ప్రయోజనం లేదు.

\- కుర్రా భాస్కర్‌రావు, పార్కు కమిటీ ప్రతినిధి

15న 'చెట్లతో చెలిమి' పుస్తకావిష్కరణ

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి డాక్టర్ కందేపి రాణీప్రసాద్ రచించిన చెట్లతో చెలిమి బాలల సైన్స్ వ్యాసాల పుస్తకావిష్కరణ ఈ నెల 15వ తేదీన జరుగుతుందని నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం(నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంసీఏభవన్‌లో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి పాకల ఝాన్సీరాణి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. డాక్టర్ నూనె అంకమ్మరావు, పి.రాజ్యలక్ష్మి, సింహాద్రి జ్యోతిర్మయి, కుర్రా ప్రసాద్‌బాబు హాజరవుతారని, కవి సమ్మేళనం ఉంటుందని తెలిపారు. కనుక సాహిత్యవేత్తలు, సాహిత్యాభిమానులు పాల్గొనాలని కోరారు.

16 నుంచి సర్టిఫికెట్ కోర్సు పరీక్షలు

ఒంగోలు విద్య, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సర్టిఫికెట్ కోర్సు ఇన్ లైబ్రరీ అండ్ ఇన్ఫర్మేషన్ సైన్స్ పరీక్ష ఈనెల 16నుంచి 21వ తేదీ వరకు గుంటూరు, కడపలో జరుగుతుందని జిల్లా విద్యాశాఖాధికారి ఎ.కిరణ్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ప్రభుత్వ వెబ్‌సైట్ నుంచి హాల్ టిక్కెట్లను డౌన్‌లోడ్ చేసుకోవాలని ఆయన కోరారు.

విమాన ప్రయాణంపై మాగుంట ప్రశ్న

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): దేశంలో విమాన ప్రయాణం, సేవలు, విమానాశ్రయాలు, డేటా భద్రత తదితర అంశాలపై ఒంగోలు లోక్‌సభ సభ్యుడు మాగుంట శ్రీనివాసులురెడ్డి గురువారం పార్లమెంట్‌లో ప్రశ్నించారు. దీనిపై కేంద్ర పౌర విమానయానశాఖ సహాయక మంత్రి మురళీధర్ మొహోల్ సమాధానం ఇస్తూ విమాన ప్రయాణికులకు సౌకర్యవంత ప్రయాణం అందించేందుకు పౌర విమానయానశాఖ రూపొందించిన యాప్ డీజీయాత్ర అని అన్నారు. భౌతిక పత్రాల అవసరం లేకుండా చెక్‌పోస్టులు/తనిఖీ కేంద్రాల వద్ద త్వరగా ప్రయాణికుల గుర్తింపు ధృవీకరించేందుకు ముఖ గుర్తింపుతో చేసే సదుపాయమని చెప్పారు. దేశంలో ప్రస్తుతం ఈ డీజీయాత్ర సదుపాయం 24 విమానాశ్రయాలలో ఉండగా ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నం, విజయవాడలో ఉందన్నారు. ప్రయాణికుల డేటా మొత్తం వారి స్మార్ట్‌ఫోన్లలో ఉంచడం జరుగుతుందన్నారు. ధృవీకరణ తర్వాత విమానం బయలు దేరిన 24 గంటల్లో సిస్టం నుంచి తొలగిస్తామని కేంద్రమంత్రి వివరణ ఇచ్చారు.

రేపు ఎంపీ మాగుంట రాక

ఎంపీ మాగుంట శ్రీనివాసులురెడ్డి శనివారం ఒంగోలుకు రానున్నారు. ఉదయం 8గంటలకు స్థానిక రామనగర్‌లోని మాగుంట కార్యాలయంలో ప్రజలకు అందుబాటులో ఉంటారు. 9.30 గంటలకు పాత బైపాస్‌రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన ఓ ప్రైవేటు కార్యక్రమంలోను, అనంతరం నగరంలో జరిగే పలు కార్యక్రమాలకు ఆయన హాజరవుతారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక


విద్యార్థులకు ట్రోఫీ అందజేస్తున్న విజయరామరాజు

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కళాఉత్సవ్ పోటీలలో జాతీయ స్థాయికి ప్రకాశం జిల్లా ఫోక్ డ్యాన్స్ ఎంపికైంది. జిల్లాస్థాయిలో మైనంపాడు డైట్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిన ఈ బృందం రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో జాతీయ స్థాయికి ఎంపికయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఫోక్ డ్యాన్స్‌కు ఎంపికైన విద్యార్థులను డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు.

ట్రాన్స్‌ఫార్మర్ల చోరీల నియంత్రణకు చర్యలు

మర్రిపూడి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇటీవలకాలంలో జిల్లాలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలు పెరిగిపోవడంతో ఆశాఖ అధికారులు వాటి నియంత్రణపై దృష్టి సారించారు. ఇప్పటివరకు ట్రాన్స్‌ఫార్మర్ల బిగించడానికి ఉపయోగిస్తున్న మరబోల్టులకు బదులుగా యాంటీ థెఫ్ట్‌బోల్టులను వినియోగించాలని నిర్ణయించారు. వీటిని వాడటం వలన ట్రాన్స్‌ఫార్మర్ పైభాగంలో మూతతీసేందుకు దొంగలకు కష్టంగా ఉంటుంది. ఇకపై అన్ని ట్రాన్స్‌ఫార్మర్లకు థెఫ్ట్‌బోల్టులను ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపట్టాలని ఆ శాఖ ఎస్ఈ వెంకటేశ్వర్లు, డీఈ శ్రీనివాసులు క్షేత్రస్థాయి సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చారు. రైతులలో కూడా అవగాహన కల్పించాలని నిర్ణయించారు. రైతులు కూడా ఆకస్మికంగా తమ పొలాలలో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లను పరిశీలిస్తూ ఉండాలని ఏఈ సుబ్బారెడ్డి కోరారు.

తైక్వాండో పోటీలకు ఢిల్లీ వెళ్లిన విద్యార్థులు


పోటీల్లో పాల్గొనేందుకు బయలుదేరిన చిన్నారులు

కొండపి, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) : ఢిల్లీలో ఈనెల 14, 15 తేదీల్లో జరిగే తైక్వాండో నేషనల్ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు 12 మంది విద్యార్థులు ఢిల్లీకి గురువారం సాయంత్రం బయలుదేరి వెళ్లారు. కట్టావారిపాలేనికి చెందిన మన ఊరి వికాసం సంస్థ సహకారంతో పోటీలకు విద్యార్థులు హాజరవుతున్నారు. విద్యార్థులకు శిక్షణ ఇచ్చిన తైక్వాండో ఇంటర్నేషనల్ 8త్ డాన్ ఇప్పటికే ఢిల్లీలో ఈవెంట్‌ను ఆర్గనైజ్ చేస్తున్నారు. విద్యార్థులతోపాటు వారి తల్లిదండ్రులు కూడా బయలుదేరి వెళ్లారు.

గ్యాస్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం

మద్దిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్యాస్ కనెక్షన్ కలిగిన ప్రతి ఒక్కరు తప్పనిసరిగా ఆధార్ అనుసంధానం చేసుకోవాలని తహసీల్దార్ సృజన్‌కుమార్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గ్యాస్ ఏజెన్సీ డెలివరీ బాయ్ దగ్గర కూడా ఈకేవైసీ చేయించుకోవచ్చని సూచించారు.

ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలి

మద్దిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పొగాకు బదులుగా ప్రత్యామ్నాయ పంటలు సాగుచేయాలని డీడీఏడీఆర్‌సీ అధికారి ఎస్.రామ్మోహనరావు పేర్కొన్నారు. గురువారం నాగన్నపాలెంలో జరిగిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడుతూ శనగ, మినుము, కంది పంటలను సాగు చేసుకోవాలని, వాటి ద్వారా తక్కువ పెట్టుబడితో అధిక లాభాలు పొందవచ్చన్నారు. పొగాకు మార్కెట్ ధరలు స్థిరంగా లేకపోవడం, సాగు, అధిక కూలీల ఖర్చు, ధరలు తగ్గుదల, కౌలు ధరలు విపరీతంగా పెరగటం వల్ల రైతులు నష్టపోయే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో వెంకట్రావు, డీఆర్సీ శైలజ, వీఐఏ చాందినీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి


మాట్లాడుతున్న ఈవోఆర్డీ బాలచెన్నయ్య

ఒంగోలు(రూరల్), డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల సమగ్రమైన సుస్థిరాభివృద్ధి లక్ష్యంగా సర్పంచులు, మండల స్థాయి అధికారులు బాధ్యత తీసుకోవాలని ఈవోఆర్డీ ఎ.బాలచెన్నయ్య కోరారు. గురువారం ఒంగోలు ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. గ్రామాల్లో రోడ్లు, తాగు నీటి సౌకర్యాలు, పారిశుధ్య కార్యక్రమాలు, వీధిదీపాలు, ప్రజలకు కావాల్సిన సంక్షేమ పథకాలు అన్ని దృష్టిలో పెట్టుకొని అభివృద్ధి చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శేషుబాబు, రెవెన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి చీమకుర్తిలో సీపీఎం జిల్లా మహాసభలు

చీమకుర్తి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సీపీఎం 14వ జిల్లా మహాసభలు శుక్రవారం నుంచి మూడు రోజులపాటు చీమకుర్తిలోని బీవీఎస్ఆర్ కళ్యాణమండపం వద్ద నిర్వహించనున్నారు. తొలిరోజు సాయంత్రం 3 గంటలకు బస్టాండ్ వద్ద నుంచి ప్రదర్శన జరుగుతుంది. 4 గంటలకు కళ్యాణమండపం వద్ద బహిరంగసభ నిర్వహిస్తారు. ముఖ్యవక్తగా రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, వక్తలుగా వై.వెంకటేశ్వరరావు, కారుసాల సుబ్బరావమ్మ, ఉమామహేశ్వరరావు, పూనాటి ఆంజనేయులు తదితరులు పాల్గొంటారు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు.

పర్యావరణ పరిరక్షణకు పాటుపడాలి : వీసీ


మొక్కలను నాటుతున్న వీసీ మూర్తి

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పర్యావరణ పరిరక్షణకు విద్యార్థులు పాటు పడాలని అందుకోసం మొక్కలు పెంపకాన్ని ఒక లక్ష్యంగా చేసుకొని ముందుకు సాగాలని ఆంధ్రకేసరి యూనివర్శిటీ వైస్ చాన్సలర్ డీవీఆర్.మూర్తి పిలుపునిచ్చారు. వనమహోత్సవంలో భాగంగా గురువారం యూనివర్శిటీ కళాశాల ప్రాంగణంలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన మూర్తి మాట్లాడుతూ మొక్కలు నాటడంతో పాటు వాటి పరిరక్షణకు బాధ్యత తీసుకోవాలన్నారు. అనంతరం వీసీ మూర్తి, రిజిస్ట్రార్ హరిబాబు మొక్కలు నాటారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రాజమోహన్‌రావు, వైస్‌ప్రిన్సిపాల్ నిర్మలామణి, ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ హర్షప్రీతమ్‌దేవ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు ఒంగోలులో వైసీపీ నిరసన ర్యాలీ

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రైతులను దగా చేసిందని వైసీపీ జిల్లా అధ్యక్షుడు, దర్శి ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డి ఆరోపించారు. ఒంగోలులోని వైసీపీ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ శుక్రవారం ఒంగోలులో ప్రభుత్వ వైఖరిని నిరసిస్తూ రైతుల కోసం నిరసన ర్యాలీ చేపడుతున్నట్లు చెప్పారు. ఇందుకు సంబంధించిన పోస్టర్లను జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మతో కలిసి ఆవిష్కరించారు. రాష్ట్రంలో జెమిలి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా సిద్ధంగా ఉన్నామని వారు తెలిపారు. కార్యక్రమంలో నియోజకవర్గ ఇన్‌చార్జి చుండూరి రవిబాబు, కఠారి శంకర్, మారెడ్డి సుబ్రమణ్యేశ్వరరెడ్డి, బొట్లా సుబ్బారావు, డీఎస్.క్రాంతికుమార్, మీరావలి పాల్గొన్నారు.

8 మద్యం బాటిళ్లు పట్టివేత

సింగరాయకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : శానంపూడి గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న కూతల భాస్కర్‌రావును గురువారం ఎక్సైజ్ సీఐ శివకుమారి అదుపులోకి తీసుకున్నారు. అతని వద్ద 8క్వార్టర్ బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి ఎక్సైజ్ కార్యాలయానికి తరలించారు.

చలో గుంటూరును విజయవంతం చేయండి

టంగుటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 15న జరగనున్న చలో గుంటూరును విజయవంతం చేయాలని మాల ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు తుల్లిబిల్లి అశోక్ కోరారు. గురువారం మండలంలోని అనంతవరం, పుల్లారెడ్డిపాలెం, బాపూజీకాలనీలలో హలో మాల, చలో గుంటూరు వాల్‌పోస్టర్లు, కరపత్రాలను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మిడసల బాలకోటయ్య పాల్గొన్నారు.

సమాఖ్యలను దిగ్విజయంగా నడపాలి


మాట్లాడుతున్న ద్రాక్షాయణి

టంగుటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): విప్లవాత్మక మార్పులతో సంఘాలను ముందుకు నడిపించాలని సీసీ దాక్షాయణి సూచించారు. టంగుటూరు మహిళా శక్తి భవన్‌లో గురువారం మండల సమాఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా దాక్షాయణి మాట్లాడుతూ సంఘాల్లో పనులన్నీ కచ్చితంగా నిర్వహించాలని చెప్పారు. కోఆర్డినేటర్ కళ్యాణ్, ఏపీఎం సుబ్బారావు, సీసీలు వెంకట్రావు, కోటేశ్వరి, శ్రీను పాల్గొన్నారు.

టాంటాం భూములకు
దేవాలయాల పేరుపై పాస్‌పుస్తకాలు ఇవ్వాలి

- ఆలయాల అధికారుల వినతి


వినతిపత్రం ఇస్తున్న స్థానికులు

ఒంగోలు(రూరల్), డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): ఒంగోలు మండలం కరవది గ్రామంలోని టాంటాం భూములను సంబంధిత దేవాలయాల పేరుపై పాస్‌పుస్తకాలు మంజూరు చేయాలని దేవాలయాల అధికారులు తహసీల్దార్ వాసుకు వినతిపత్రం అందజేశారు. గురువారం కరవదిలో రెవెన్యూసదస్సు జరిగింది. ఈ సందర్భంగా దేవాలయాల అధికారులు మాట్లాడుతూ గ్రామంలోని రామలింగేశ్వర దేవాలయం, శ్రీవేణుగోపాలస్వామి దేవాలయం, శ్రీసీతారాములస్వామి దేవాలయాలకు చెందిన సర్వే నంబరు204లో 16.88 ఎకరాలు, సర్వేనంబరు 571లో గల 7.04ఎకరాల భూములను టాంటాం ఇనామీల కింద కొందరు పట్టాదారు పాసుపుస్తకాలు పొందారని చెప్పారు. అయితే ఈ భూములు పట్టాలు పొందిన వారు దేవాలయాలకు ఎలాంటి పనులు చేయటం లేదని, ఎంతో విలువైన ఈ ఈనామ్ భూములు దేవాలయాల పేరులపై పట్టాదారుపాసు పుస్తకాలు ఇవ్వాలని తహసీల్దార్‌కు అర్జీ అందజేశారు. అనంతరం నాయకుడు యల్లమంద మాట్లాడుతూ కరవదిలోని జగనన్నకాలనీల భూముల్లో అవినీతి జరిగిందని, దానిపై విచారణ జరపాలని వినతిపత్రం అందజేశారు. జగనన్న కాలనీలలో పూర్తిగా అనర్హులకు నివేశన స్థలాల పట్టాలు ఇచ్చారన్నారు. అందుల్లో ప్రభుత్వ ఉద్యోగులకు, గృహాలు ఉన్నవారికి స్థలాలు ఇచ్చారని చెప్పారు. అనర్హులను తొలిగించి అర్హత గల పేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ విష్ణు, దేవాలయాల ఇన్‌స్పెక్టర్ వేణుగోపాల్, బి.శ్రీనివాసరావు, రంగయ్య, పోలవరపు వెంకట్రామయ్య, సర్పంచ్ దేవరపల్లి కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి ఎన్నికల నిర్వహణకు సర్వం సిద్ధం

- తహసీల్దార్ రవి

సింగరాయకొండ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో శనివారం నిర్వహించనున్న సాగునీటి ఎన్నికలు సజావుగా నిర్వహించడానికి అన్నీ ఏర్పాట్లు చేసినట్లు తహసీల్దార్ రవి తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎన్నికలకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. మండలంలో సోమరాజుపల్లి 1, 2 పాకల 1, 2 బింగినపల్లి, కలికివాయి, కనుమళ్ల గ్రామాల సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయని తెలిపారు. సోమరాజుపల్లి-1 కింద 12 టీసీ (ప్రాదేశిక నియోజకవర్గం సభ్యులు) (806ఓటర్లు), సోమరాజుపల్లి-2 కింద 6 టీసీ (248ఓటర్లు), పాకల-1 కింద 12టీసీ (574ఓటర్లు), పాకల-2 కింద 12 టీసీ (1222 ఓటర్లు), కలికివాయి- 6టీసీ (331ఓటర్లు), కనుమళ్ల-6 టీసీ (584 ఓటర్లు) మొత్తం 66 టీసీ ఉన్నట్లు వివరించారు. సోమరాజుపల్లి-1 సాగునీటి ఎన్నికలు మూలగుంటపాడు ఏఆర్‌సీ ప్రభుత్వ పాఠశాలలో, సోమరాజుపల్లి-2 ఎన్నికలు ఏఆర్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతాయని చెప్పారు. పాకల-1, 2 సాగునీటి ఎన్నికలు పాకల జడ్పీ హైస్కూల్‌లో, బింగినపల్లి సాగునీటి ఎన్నికలు గ్రామసచివాలయం కాంప్లెక్స్, కలికివాయిలో ఎంపీపీస్కూల్‌లో, కనుమళ్లలో గ్రామసచివాలయ కాంప్లెక్స్‌లో నిర్వహించనున్నట్లు తెలిపారు. ఉదయం 8గంటలకు సాగునీటి సభ్యులను ఎన్నుకునే కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.

పంటల్లోని చీడలను నివారించుకోవాలి

కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రామ్‌మోహనరావు


మాట్లాడుతున్న రామ్‌మోహన్‌రావు

ఒంగోలు(రూరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): సాగులో ఉన్న శనగ, మినప, మిరప పంటల్లో చీడలను నివారించాలని కృషి విజ్ఞాన కేంద్రం కోఆర్డినేటర్ రామ్‌మోహనరావు కోరారు. ఒంగోలు నగరం గుత్తికొండవారిపాలెంలో ఆయన రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు శనగ పంట సాగు చేయని రైతులు విత్తన శుద్ధి చేయాలన్నారు. పచ్చిరొట్ట ఎరువులతో భూములు సిద్ధం చేసుకోవాలని సూచించారు. సహాయ సంచాలకుడు వెంకటరావు, ఏవో జి.కిషోర్‌బాబు, శైలజ, ఏఈవో రామకృష్ణారెడ్డి, వీహెచ్‌ఏ రవిచంద్ర పాల్గొన్నారు.

పంటల బీమా చేయించుకోవాలి

మద్దిపాడు: రైతులు తాము సాగుచేసే పంటలకు బీమా చేయించుకోవాలని ఏవో జి.రమేష్‌బాబు తెలిపారు. గురువారం మద్దిపాడు వ్యవసాయ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్క రైతు 2024-25 సంవత్సరానికి బీమా చేయించుకోవాలన్నారు. శనగ పంటకు ఎకరానికి రూ.368, మినుముకు రూ.103, వరికి రూ.215, మిరపకు రూ.525, మొక్కజొన్నకు రూ.105 బీమా ప్రీమియంగా చెల్లించాలన్నారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు రెలుపులో జాగ్రత్తలు

కొండపి: పొగాకు రెలుపులో జాగ్రత్తలు పాటించాలని, పక్వానికి వచ్చిన ఆకులను మాత్రమే రెల్చాలని కొండపి పొగాకు వేలం కేంద్రం నిర్వహణాధికారి జి. సునీల్‌కుమార్ సూచించారు. వేలం కేంద్రం పరిధిలోని ధర్మవరం గ్రామంలో ఆయన తన సిబ్బందితో కలిసి పొగాకు తోటలు, క్యూరింగ్‌లో ఉన్న బ్యారన్‌లను పరిశీలించారు. కార్యక్రమంలో ఐటీసీ కంపెనీ మేనేజర్ శ్రీరత్నం, జీపీఐ కంపెనీ మేనేజర్ స్వాతి, బోర్డు ఫీల్డ్ ఆఫీసర్ సాగర్‌బాబు పాల్గొన్నారు.


మద్దిపాడులో మాట్లాడుతున్న ఏవో


ధర్మవరంలో మాట్లాడుతున్న సునీల్‌కుమార్

భూసమస్యలు తక్షణమే పరిష్కరించుకోవాలి

మద్దిపాడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): రైతుల భూ సమస్యలను త్వరితగతిన పరిష్కరించటానికి కృషి చేస్తామని తహసీల్దార్ సృజన్‌కుమార్ అన్నారు. గురువారం కొలచనకోట రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా మోపర్తి లాల్‌బహదూర్ అనే రైతు తన భూ సమస్యల గురించి తహసీల్దార్ దృష్టికి తెచ్చారు. 21మంది అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు మండవ జయంత్‌బాబు, ఆర్ఐ రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

మాచవరంలో 20 అర్జీలు

నాగులుప్పలపాడు: మాచవరం గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 20 అర్జీలు అందినట్లు తహసీల్దార్ కె.ప్రవీణ్‌కుమార్ తెలిపారు. వాటిని నిర్దిష్ట గడువులోగా పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో డీటీ వాసుదేవరావు, ఆర్ఐ రమేష్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

కొండపి ప్రాంతంలో వర్షం

కొండపి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కొండపి ప్రాంతంలో బుధ, గురువారాలు తేలికపాటివర్షం కురిసింది. వాతావరణం చల్లగా, మేఘావృతమై ఉండటంతో పొగాకు, కంది, శనగ పంటలు వేసిన రైతులు చీడపీడలతో అవస్థలు పడుతున్నారు. ఇప్పటికే అతి వర్షాలతో పంట పొలాలు కునారిల్లుతున్నాయి. ఇపుడు తాజా పడుతున్న తేలికపాటి వర్షాలు పంటలకు మరింత చెడుపు చేస్తాయని రైతులు ఆందోళన చెందుతున్నారు.

అధికారులు, సచివాలయ సిబ్బందికి శిక్షణ

టంగుటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : గవర్నమెంట్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, రూరల్ డెవలప్‌మెంట్ ట్రైనింగ్ ఆన్ లోకలైజేషన్, సస్టైన్‌బార్ డెవలప్‌మెంట్‌పై టంగుటూరు మండల పరిషత్ కార్యాలయంలో గురువారం పంచాయతీ కార్యదర్శులు, మండల అధికారులు, గ్రామ సచివాలయ సిబ్బందికి శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీవో దేవసేనకుమారి, ఈఓఆర్డీ రామసుబ్బారావు, ఏసీ పద్మావతి, ఏపీఎం సుబ్బారావు, అనంతవరం పంచాయతీ కార్యదర్శి మాలతి, డీఎంజీ ఎం.శ్రీనివాసరావు, శిక్షకులు వెంకట్రావు, మల్లీశ్వరి, రమాదేవి పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

త్రిపురాంతకం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విశ్వ నాథపురం, ఎండూరివారిపాలెం గ్రామాల్లోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లయిస్ జిల్లా మేనేజర్ వరలక్ష్మి గురువారం పరిశీలించారు. రైతులు తమ ధాన్యం తేమ శాతం 17 లోపు ఉండేలా ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులకు కావాల్సిన గన్ని బ్యాగులను, హమాలీ, రవాణా చార్జీలు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నిర్దేశించిన కనీస మద్దతు ధర ద్వారా రైతులు లబ్ధి పొందాలని ఆమె సూచించారు.

అవీ..ఇవీ

ఎరువుల దుకాణాల తనిఖీ

● 5 లక్షల జరిమానా



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న ఏడీఏ, అధికారులు

కంభం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కంభం మండలంలోని పలు ఎరువుల దుకాణాలను ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు ఆకస్మిక తనిఖీ చేశారు. దుకాణాల యజమానులకు రూ.5లక్షల జరిమానా విధించినట్లు గిద్దలూరు ఏడీఏ బాలాజీనాయక్ తెలిపారు. ఒంగోలు ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి జే.కులశేఖర్ ఆధ్వర్యంలో దాడులు జరిగినట్లు తెలిపారు. ఐదు దుకాణాలను తనిఖీ చేయగా, రెండు దుకాణాల్లో ఎరువులు, పురుగుమందు నిల్వలు, రిజిష్టర్లు, బిల్లులు, ఇన్‌వాయిస్‌లను పరిశీలించారు. పలు వ్యత్యాసాలు గుర్తించారు. ఆ రెండు షాపులను సీజ్ చేసి 6ఏ కేసు నమోదు చేశారు. నిర్వాహకులపై రూ.5లక్షల జరిమానా విధించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో విజిలెన్స్ ఈవో శివనాగప్రసాద్, బీసీడీవో రామారావు పాల్గొన్నారు.

కంప్యూటర్ అందజేత



కంప్యూటర్ అందజేస్తున్న ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డి

గిద్దలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఎన్.బయనపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలకు పూర్వవిద్యార్థి, ఉపాధ్యాయుడు ముత్తుముల రామకృష్ణారెడ్డి కంప్యూటర్‌ను బహూకరించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం వీవీ.శేషయ్య, ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు. కంప్యూటర్ అందజేసిన ఉపాధ్యాయుడు రామకృష్ణారెడ్డిని సన్మానించారు.

'ఛలో గుంటూరు'ను విజయవంతం చేయాలి



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఉద్యోగులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): 'హలో మాల ఛలో గుంటూరు' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాష్ట్ర మాల ఉద్యోగ సంఘం అధ్యక్షుడు అశోక్‌బాబు అన్నారు. స్థానిక ఆర్టీసీ బస్టాండ్ సమీపం లోని అంబేడ్కర్ విగ్రహం వద్ద గురువారం 'హలోమాల ఛలో గుంటూరు' గోడపత్రికలు, కరపత్రాలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అశోక్‌బాబు మాట్లాడుతూ.. ఎస్సీ రిజర్వేషన్ వర్గీకరణ, క్రిమిలేయర్ వల్ల దళితుల మధ్య ఐక్యత దెబ్బతిని భవిష్యత్తులో రాజ్యాంగ హక్కులు దూరమయ్యే ప్రమాదం ఉందన్నారు. ఎస్సీ జనాభా పెరిగినందున అనుగుణంగా రిజర్వేషన్ శాతం పెంచాలన్నారు. కార్యక్రమంలో మాలమహానాడు నాయకులు జనుమాల నాగయ్య, నూతలపాటి రాజు, కె.అబ్బన్న, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి


● సీడీపీవోకు కార్యకర్తల వినతి



సీడీపీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్యకర్తలు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలకు 42 రోజుల సమ్మె ఒప్పందంలో భాగంగా ఇచ్చిన హామీలను ప్రభుత్వం అమలుచేసి సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. స్థానిక ఐసీడీఎస్ కార్యాలయంలో సీడీపీవో సుశీలాదేవికి వారు గురువారం వినతిపత్రాలు అందజేశారు. మినీసెంటర్‌లను మెయిన్ సెంటర్లుగా మార్చాలన్నారు. అంగన్‌వాడీల వేతనాలు పెంచాలని, సర్వీస్‌లో ఉండి చనిపోయినవారికి అంతిమ సంస్కారాల కోసం రూ.20వేలు ఇచ్చి వారి కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలన్నారు. ఆయాల ప్రమోషన్‌లకు సంబంధించి నిర్దిష్టమైన విధివిధానాలు అమలు చేయాలన్నారు. అంగన్‌వాడీ సెంటర్‌లకు ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని 13 రకాల డిమాండ్‌లతో వినతిపత్రం ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు వెంకటరత్నం, ధనలక్ష్మి, పార్వతి, కాశింబీ తదితరులు పాల్గొన్నారు.

18న యూత్ క్రిస్మస్ వేడుకలు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న చర్చి సభ్యులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఎస్ఎస్.నగర్‌లోని తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో ఈ నెల 18న యూత్ క్రిస్మస్ వేడుకలు నిర్వహిస్తున్నట్లు చర్చి యూత్ అధ్యక్షులు దేవరకొండ సౌమ్య తెలిపారు. స్థానిక తెలుగు బాప్టిస్టు టౌన్ చర్చిలో యూత్ క్రిస్మస్‌కు సంబంధించిన గోడపత్రికలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ.. యూత్ క్రిస్మస్ వేడుకల్లో ముఖ్య ప్రసంగీకుల్లా విజయవాడకు చెందిన పాల్ ఇమ్మాన్యుయేల్ వ్యాఖ్యసందేశం ఇస్తారన్నారు. అనంతరం యువత ఆధ్వర్యంలో వివిధ కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో కౌన్సిలర్ దారివేముల హర్షిత, విజయ్, సాగర్, విమలా, హెప్సిబా తదితరులు పాల్గొన్నారు.

15న 'చెట్లతో చెలిమి' పుస్తకావిష్కరణ

ఒంగోలు(కల్చరల్), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి డాక్టర్ కందేపి రాణీప్రసాద్ రచించిన చెట్లతో చెలిమి బాలల సైన్స్ వ్యాసాల పుస్తకావిష్కరణ ఈ నెల 15న నవ్యాంధ్ర రాష్ట్ర రచయిత్రుల సంఘం (నరసం) రాష్ట్ర గౌరవాధ్యక్షురాలు తేళ్ల అరుణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎంసీఏభవన్‌లో ఉదయం 10 గంటలకు జరిగే కార్యక్రమంలో నాగభైరవ సాహిత్యపీఠం అధ్యక్షుడు నాగభైరవ ఆదినారాయణ ముఖ్య అతిథిగా పాల్గొంటారని, డ్వామా జిల్లా విజిలెన్స్ అధికారి పాకల ఝాన్సీరాణి పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని పేర్కొన్నారు. డాక్టర్ నూనె అంకమ్మరావు, పి.రాజ్యలక్ష్మి, సింహాద్రి జ్యోతిర్మయి, కుర్రా ప్రసాద్‌బాబు హాజరవుతారన్నారు.

పాత ప్రధాన రహదారిలో

ఆక్రమణలు తొలగించేదెన్నడో..?

● మార్కాపురంలో వన్ వేలో పలుచోట్ల తీవ్ర ఇబ్బందులు ● అరవింద్‌ఘోస్ వీధిపై దృష్టిసారించని యంత్రాంగం



శివాలయం ఆర్చి సమీపంలో ఇరుకుగా ఉన్న రహదారి

మార్కాపురం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పట్టణంలో సుమారు 18 సంవత్సరాల తర్వాత ఆక్రమణల తొలగింపు ప్రక్రియను మళ్లీ ప్రారంభించారు. నెలన్నరగా ప్రధాన రహదారులు, అత్యంత రద్దీగా ఉండే పలు వీధుల్లో కాలువల బయట వరకు మున్సిపల్ యంత్రాంగం ఆక్రమణలు తొలగిస్తోంది. ఈ నేపథ్యంలోనే వాహనాల రద్దీని తగ్గించేందుకు విశ్వేశ్వర థియేటర్ వద్ద నుంచి మెయిన్ బజార్ వరకు వన్‌వేగా మార్చారు. ఇంతవరకు బాగానే ఉన్నా, పట్టణంలోకి వాహనాలు వచ్చేందుకు ఏర్పాటు చేసిన వన్‌వేలో చాలాచోట్ల ఇంకా పూర్తిస్థాయిలో ఆక్రమణల తొలగింపు పూర్తిచేయలేదు. అంతేకాక అరవింద్‌ఘోస్ వీధి నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు కూడా రహదారిని విస్తరిస్తే ట్రాఫిక్ కష్టాలు మరింత తగ్గే అవకాశాలున్నాయి. ముఖ్యంగా చెరువు సప్లై ఛానల్‌పై పెద్దపాటి వాహనాలు తిరిగేలా నూతన వంతెనను నిర్మిస్తే నేరుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు వాహనాలు వెళ్లేందుకు అవకాశం ఏర్పడనుంది.

పలు చోట్ల తీవ్ర ఇబ్బందులు

స్థానిక విశ్వేశ్వర థియేటర్ నుంచి ప్రారంభమయ్యే వన్‌వే తూర్పువీధి జువ్విచెట్టు వరకు రహదారి వెడల్పుగానే ఉంటుంది. కానీ అక్కడ నుంచి శివాలయం ఆర్చి సమీపం వరకు ఎదురుగా ఎలాంటి వాహనం పొరపాటున వచ్చినా ట్రాఫిక్ నిలిచిపోవాల్సిందే. మరీ ముఖ్యంగా శివాలయం ఆర్చి వద్ద రహదారి మరీ కుంచించుకుపోవడంతో పెద్దపాటి వాహనాలు తిరగాలంటే అవస్థలు పడాల్సివస్తోంది. అదేవిధంగా మెయిన్ బజార్ వైపు వాహనాలు మళ్లే సమయంలో వినాయక స్వామి దేవాలయం వద్ద కూడా లారీలు, బస్సులు ఇబ్బందులు పడాల్సివస్తోంది. అక్కడ చెన్నకేశవస్వామి మండపం ముందు దేవస్థానానికి చెందిన దుకాణాలు అడ్డుగా ఉండడం ప్రతిబంధకంగా మారుతోంది. ఆయా ప్రాంతాల్లో ఇంకా మురుగుకాలువల వద్ద పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించలేదు. దీంతో వన్‌వే ఏర్పాటు చేసినా వాహనదారులకు ఇంకా అవస్థలు తప్పడంలేదు.

అరవింద్‌ఘోస్ వీధిలో ఆక్రమణలు

మార్కాపురం పట్టణానికి ఒకప్పుడు ప్రధాన రహదారి ప్రస్తుతం వన్‌వే చేసినదే. విశ్వేశ్వర థియేటర్ వద్ద నుంచి దొడ్డబజార్‌లోని అలుగు వరకు సుమారు 50 అడుగుల విస్తీర్ణంలో రహదారి ఉండేది. కాలక్రమేణ కొన్నిచోట్ల ఆక్రమణల ప్రభావంతో రహదారి 20 అడుగులకు కుంచించుకుపోయింది. మరీ ముఖ్యంగా అరవింద్‌ఘోస్ వీధిలో రహదారి ప్రస్తుతం 15 అడుగులకే పరిమితమైంది. 2006లో పట్టణం మొత్తం ఆక్రమణల తొలగింపు జరిగినా ఒక్క అరవింద్ ఘోస్ వీధిని వదిలేశారు. దానికి ప్రధాన కారణం ఆ వీధిలో వున్న ఓ వ్యాపారవేత్త రాజకీయ నాయకులపై ఒత్తిడి తెచ్చి ఆక్రమణల తొలగింపును అప్పట్లో నిలుపుదల చేయించినట్లు ప్రచారం జరిగింది. కానీ ప్రస్తుతం పట్టణ భవిష్యత్తు అవసరాల దృష్ట్యా ఆ వీధిలో ఆక్రమణల తొలగింపు చేపడితే ట్రాఫిక్‌కు ఇబ్బందులు తీరతాయి. ఆ వీధిలో రహదారిని విస్తరిస్తే నేరుగా ఆర్టీసీ బస్టాండ్ వరకు వాహనాలు వెళ్లే అవకాశం ఏర్పడుతుంది. ఈ దిశగా మున్సిపల్ యంత్రాంగం చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

నూతన బ్రిడ్జి నిర్మాణంతో తీరనున్న కష్టాలు

అరవింద్‌ఘోస్ వీధి నుంచి అలుగు వరకు వాహనాలు వచ్చినా అక్కడ నుంచి ఆర్టీసీ బస్టాండ్ వరకు చేరుకోవాలంటే మాత్రం చెరువు సప్లై ఛానల్‌పై ఉన్న పాత బ్రిడ్జిస్థానంలో నూతన వంతెనను తప్పక నిర్మించాల్సిందే. గతంలో పలుమార్లు ప్రతిపాదనలు పెట్టినా నిధుల లేమితో పాలకులు, అధికారులు వెనుకడుగు వేశారు. ప్రస్తుతం ఉన్న వంతెన కేవలం ద్విచక్ర వాహనాలు వెళ్లేంత మార్గమే ఉంది. ఆటోలు, లారీలు, బస్సులు తిరగాలంటే 30 అడుగుల వెడల్పుతో నూతన బ్రిడ్జి ఏర్పాటు చేయాల్సిందే. అంతేకాక అలుగు చివరి నుంచి బ్రిడ్జి వరకు ఆకాశవాణి కేంద్రం ప్రహరిగోడను ఆనుకుని సుమారు 25 అడుగుల మేర రహదారిని పలువురు ఆక్రమించుకున్నారు. ఆ ఆక్రమణలపై కూడా అధికారులు దృష్టిసారిస్తే రహదారిపై వాహనాలు సులువుగా తిరిగేందుకు అవకాశం ఏర్పడనుంది.







పూర్తిస్థాయిలో ఆక్రమణలు తొలగించాల్సిన అరవింద్‌ఘోస్ వీధి అలుగు సమీపంలో కుచించుకుపోయిన వీధి, చెరువు సప్లై ఛానల్‌పై ఇరుకుగా ఉన్న వంతెన

మార్చి నాటికి 100 పడకల ఆస్పత్రి

ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి



అధికారులతో సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి

గిద్దలూరుటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి నాటికి గిద్దలూరు ప్రభుత్వ వైద్యశాలను 100 పడకల ఆసుపత్రిగా తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం ప్రభుత్వ వైద్యశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే అశోక్‌రెడ్డి మాట్లాడారు. గడిచిన వైసీపీ ప్రభుత్వ హయాంలో 100 పడకల ఆసుపత్రిగా ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని 40 పడకల ఆసుపత్రిగా తయారు చేశారని, ఆస్పత్రి నిర్మాణం నాశిరకంగా ఉందన్నారు. ఈ అంశంపై జిల్లా వైద్యశాఖ అధికారి సుధాకర్‌రెడ్డి, ఇతర అధికారులతో కలిసి ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి ఆస్పత్రిని పరిశీలించారు. అనంతరం వారితో సమావేశమై వైద్యశాలలో జరగాల్సిన అభివృద్ధిపై చర్చించారు. మార్చి నాటికి ప్రజలకు 100 పడకలు తీసుకురావాలని సంబంధిత అధికారులకు సూచించారు.

శిథిలావస్థలో ఓవర్‌హెడ్‌ట్యాంక్

● భయం గుప్పెట్లో విద్యార్థులు ● 2002లో నిర్మించి గాలికొదిలేసిన ఆర్‌డబ్ల్యూఎస్ విభాగం



దెబ్బతిన్న ఓవర్‌హెడ్ ట్యాంక్ పిల్లర్

పుల్లలచెరువు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మల్లాపాలెంలో అధికారుల నిర్లక్ష్యంతో ఓవర్‌హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరింది. 2002లో అప్పటి టీడీపీ ప్రభుత్వ హయాంలో ఆర్‌డబ్ల్యూఎస్‌శాఖ పైలెట్ ప్రాజెక్టు కింద మల్లాపాలెంలో ప్రాథమికోన్నత పాఠశాల పక్కనే ఓవర్‌హెడ్ ట్యాంకు నిర్మించింది. పదేళ్లపాటు పనిచేసిన ఓవర్‌హెడ్ ట్యాంకు వినియోగంలో ఉంది. ఆ తరువాత అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో ట్యాంకు వద్ద ఉన్న బోరు, మోటారు, సామగ్రి కూడా కనిపించకుండా పోయాయి. నీళ్లు రాకపోవడంతో ఓవర్‌హెడ్ ట్యాంకును పూర్తిగా అధికారులు గాలికి వదిలేశారు. దీంతో ట్యాంకు పిల్లర్లు శిథిలావ్యవస్థకు చేరి ట్యాంకు బలహీనంగా ఉంది. అయితే ట్యాంకు గ్రామంలోని ప్రాథమికోన్నత పాఠశాల ఆవరణలో ఉండడంతో విద్యార్థులు, ఉపాధ్యాయులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ట్యాంకు సామర్థ్యాన్ని పరిశీలించాలని గ్రామస్థులు కోరుతున్నారు.

మినీ డంపింగ్ యార్డులుగా రోడ్డు అంచులు

రోడ్డు పక్కనేచెత్తా చెదారం వ్యర్థాలు



పట్టణంలోని రాచర్ల రోడ్డులో రోడ్డు పక్కనే ఉన్న చెత్తాచెదారం

గిద్దలూరు, డిసెంబరు 9 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని పలు ప్రాంతాల్లోని రోడ్డు మార్జిన్లు మిని డంపింగ్ యార్డులుగా మారాయి. ఇళ్ల నుంచి చెత్తను సేకరించే చెత్తరిక్షాల వారు సమీపంలోని ఒక ప్రాంతాన్ని ఎన్నుకుని రోడ్డు మార్జిన్లలో ఆ చెత్తాచెదారాన్ని వదలి వేస్తున్నారు. మున్సిపల్ ట్రాక్టర్ ఏదో ఒక సమయంలో వచ్చి ఆ చెత్తను ప్రధాన డంపింగ్ యార్డుకు తీసుకుని వెలుతుంది. ఇలాగ ఆ రోడ్డు గుండా వెళ్ళాలంటే ప్రజలు ముక్కులు మూసుకుని కూడా నడవలేని పరిస్థితి నెలకొంటున్నది. పట్టణం లోని రాచర్ల రోడ్డులో గల రాంభూపాల్ రెడ్డి సొసైటీ కాలనీ ఎదురుగా, పొట్టిశ్రీరాములు విగ్రహం సెంటర్‌లో, కొంగళవీడు రోడ్డులోని వరసిద్ది వినాయకస్వామి దేవాలయం సమీపంలో ఇలా పలు ప్రాంతాల్లోని రోడ్డు మార్జిన్లు మిని డంపింగ్ యార్డులుగా మారడంతో చెత్త ఎత్తుకుని పోయే కొన్ని గంటలపాటు దుర్వాసన భరించలేక ఆప్రాంత ప్రజలు సతమతమవుతున్నారు. నివాసాలకు దూరంగా ఖాళీ స్థలాలలో మిని డంపింగ్ యార్డులు ఏర్పాటు చేసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

కరివెన సత్రాల కమిటీ సభ్యులకు సన్మానం



సన్మానిస్తున్న బ్రాహ్మణసంఘం నాయకులు

మార్కాపురం వన్‌టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): అఖిల భారత బ్రాహ్మణ కరివెన నిత్యాన్నదానసత్రాల నూతన బాధ్యతలను బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో సన్మానించారు. నెహ్రూబజార్‌లోని షిరిడీ సాయి మందిరంలో అఖిల భారత బ్రాహ్మణ కరివెన సత్రాల వర్కింగ్ కమిటీ సభ్యులుగా ఎన్నికైన పట్టణానికి చెందిన భారతుల శ్రీనివాసశాస్త్రి పీఎల్ఎన్‌వీ నాగరాజులను సన్మానించారు. కార్యక్రమంలో కరివెన సత్రాల కోశాధికారి గోపాలుని హరిహరరావు, సహాయ కార్యదర్శి కాలంరాజు రామకృష్ణ, అడ్వైజరీ కమిటీ సభ్యులు తంగిరాల నాగజగన్నాథ్, సభ్యులు శ్రీనివాస్, సోమయాజుల సుబ్బశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక

ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కళాఉత్సవ్ పోటీలలో జాతీయ స్థాయికి ప్రకాశం జిల్లా ఫోక్ డ్యాన్స్ బృందం ఎంపికైంది. జిల్లాస్థాయిలో వైనంపాడు డైట్‌లో జరిగిన పోటీల్లో ప్రతిభ చాటిన ఈ బృందం రాష్ట్రస్థాయిలో జరిగిన పోటీల్లో జాతీయస్థాయికి ఎంపికయ్యింది. ఈ సందర్భంగా విద్యార్థులు విద్యాశాఖ డైరెక్టర్ విజయరామరాజు చేతుల మీదుగా అవార్డును అందుకున్నారు. ఎంపికైన విద్యార్థులను డైట్ ప్రిన్సిపాల్ సామా సుబ్బారావు, అధ్యాపకులు, సిబ్బంది అభినందించారు. జాతీయ స్థాయిలో సత్తా చాటాలని ఆకాంక్షించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించిన డీఎం



కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై డీఎం వరలక్ష్మి

త్రిపురాంతకం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని విశ్వనాథపురం, ఎండూరివారిపాలెం గ్రామాల్లో నిర్వహిస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సివిల్ సప్లై జిల్లా మేనేజరు వరలక్ష్మి గురువారం పరిశీలించారు. రైతులు తమ ధాన్యం తేమ శాతం 17 లోపు ఉండేలా ఆరబెట్టుకుని కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులకు కావాల్సిన గన్ని బ్యాగులను, హమాలీ చార్జీలు, రవాణా చార్జీలు పూర్తిగా ప్రభుత్వమే భరిస్తుందన్నారు. నిర్దేశించిన కనీస మద్దతు ధర ద్వారా రైతులు లబ్ధి పొందాలని సూచించారు. కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారిణి కె.నీరజ, రైతులు పాల్గొన్నారు.

మిరప తోటల పరిశీలన



తోటలను పరిశీలిస్తున్న విష్ణుప్రియ

గిద్దలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వెంగళ రెడ్డిపల్లి గ్రామపరిధిలో సాగైన మిరపపైరును ఉద్యానవన శాఖాధి కారిణి విష్ణుప్రియ పరిశీలించారు. తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో పంటను పరిశీలించిన విష్ణుప్రియ రైతులతో మాట్లాడారు. పంటపొలాల్లో నీటి నిల్వ లేకుండా కాలువల ద్వారా బయటకు పంపుకోవాలని సూచించారు. కోతకు సిద్ధంగా ఉన్న పంటను వర్షాలులేని రోజుల్లో కోసుకుని జాగ్రత్త పడాలని పేర్కొన్నారు. పైపాటుగా యూరియా, 19-19-19, 13-04-45 మొక్కలకు అందించాలన్నారు. ప్రస్తుతం తామర పురుగు, తెల్లదోమ ఎక్కువగా ఉన్న దృష్ట్యా ఎకరాకు 30 నుంచి 40 బ్లూ, పసుపురంగు జిగురు అట్టలను ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. మిరప పైరకు ఎకరాకు బీమా ప్రీమియం రూ.525 చెల్లిస్తే ఎకరాకు పంట నష్టపోయిన సందర్భాలలో రూ.1.05 లక్షలు పొందవచ్చన్నారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని రైతులకు సూచించారు. కార్యక్రమంలో రైతుసేవా కేంద్రం సిబ్బంది శేఖర్, నూర్ పాల్గొన్నారు.

భోజన సామగ్రి అందజేత



సామగ్రిని అందజేస్తున్న సురేష్

గిద్దలూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని అయ్యప్ప స్వామి దేవస్థానానికి ఎస్‌బీ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న పోకల సురేష్ భోజన సామగ్రిని అందచేశారు. మాలదారులకు దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో నిత్యం ఉచితంగా అన్నదానం చేస్తున్నారు. ఇందుకు అవసరమైన ప్లేట్లు, గ్లాసులు, ఇతర సామగ్రిని కానిస్టేబుల్ సురేష్ ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో దేవస్థాన కమిటీ ప్రతినిధులు కమతం శ్రీనివాసులు, సానె వెంకటేశ్వర్లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

గిద్దలూరుటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులకు అనేక రకాలుగా సంక్షేమ పథకాలు అందించడమే ఎన్‌డీఏ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి అన్నారు. గురువారం గిద్దలూరు మండలం కృష్ణంశెట్టిపల్లె గ్రామంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన పాల్గొని మాట్లాడారు. గడిచిన వైసీపీ పాలనలో రైతులకు ఎలాంటి లబ్ధిచేకూరలేదన్నారు. ల్యాండ్ టైటిల్ యాక్ట్, రైతు వ్యవసాయ బోర్లకు మీటర్లు బిగించి రైతులను వంచించాడన్నారు. నాడు రైతులు అనేక కష్టాలు పడడం చూసి వాటిని పరిష్కరించేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, డిప్యూటీ ముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ రెవెన్యూ సదస్సులకు శ్రీకారం చుట్టారన్నారు. ప్రతి రైతు తమ సమస్యలను అర్జీ రూపంలో అందచేస్తే వాటిని పరిష్కరిస్తామన్నారు. అనంతరం రైతుల నుండి ఎమ్మెల్యే స్వయంగా అర్జీలను తీసుకుని వాటిని పరిష్కరించాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ ఎలిజబెత్, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పాలుగుళ్ల ప్రతాపరెడ్డి, మాజీ సర్పంచ్ దప్పిలి విజయభాస్కర్‌రెడ్డి, తహసీల్దార్ ఆంజనేయరెడ్డి, టీడీపీ మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి, నాయకులు పూనూరు భూపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

పెద్దదోర్నాల : మండలంలోని యడవల్లి గ్రామంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో 8 అర్జీలు అందినట్లు తహసీల్దారు కే.శాంతి తెలిపారు. పట్టాదారు పాసుపుస్తకాలు మంజూరు చేయాలని కోరుతూ దరఖాస్తులు అందజేశారన్నారు. పరిశీలించి త్వరలోనే అందజేస్తామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ఎర్రగొండపాలెం రూరల్ : మండలంలోని గుర్రపుశాల గ్రామంలో తహసీల్దార్ ఏ.బాలకిషోర్ అధ్యక్షతన గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సులో భూసర్వే కోసం 17, ముటేషన్ కోసం 15, పొలాలకు సంబంధించి ఆన్‌లైన్ డీఎస్ పెండింగ్ కోసం 2 అర్జీలు, మరో అర్జీ మొత్తం 35 అర్జీలు వచ్చాయన్నారు. ఆన్‌లైన్ డీఎస్ పెండింగ్‌లో ఉన్న రెండు అర్జీలను అక్కడే పరిష్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సు ద్వారా గ్రామాల్లో సమస్యలు అక్కడికక్కడే పరిష్కారం అవుతాయని వాటిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. వీఆర్‌వో కాసా వెంకటసత్యనారాయణ, సర్వేయర్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

తర్లుపాడు : మండలంలోని గొల్లపల్లెలో రెవెన్యూ గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా భూ సమస్యలపై పలు అర్జీలను తహశీల్దార్ విజయ్ భాస్కర్ స్వీకరించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ.. భూ సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఇచ్చిన అర్జీలకు ఖచ్చితంగా 45 రోజుల్లోపు పరిష్కారం చూపనున్నట్లు ఆయన పేర్కొన్నారు. గ్రామంలో 21 అర్జీలు వచ్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీవో చక్రపాణి ప్రసాద్, ఈవీఆర్‌డీ సుకుమార్, వీఆర్‌వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బంది, పాల్గొన్నారు.



గజ్జలకొండలో దారి సమస్యను పరిశీలిస్తున్న తహసీల్దార్

గజ్జలకొండలో రెవెన్యూ సదస్సు

మార్కాపురం రూరల్ : మండలంలోని గజ్జలకొండ గ్రామంలో గురువారం రెవెన్యూ సదస్సును తహసీల్దార్ చిరంజీవి అధికారలతో కలిసి నిర్వహించారు. ఈ సదస్సులో ప్రజలనుంచి వినతులు స్వీకరించి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామస్థులు పొలాలకు వెళ్లే దారి సమస్యను క్షేత్ర స్థాయిలో పరిశీలించి సమన్వయ పరిచి దారి సమస్యను పరిస్కరించినట్లు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజల భూమస్యలను పరిస్కరించేందుకే ప్రభుత్వం రెవెన్యూ సదస్సు కార్యక్రమాలను మీ గ్రామంలోనే నిర్వహిస్తుందన్నారు. ప్రభుత్వ భూములను ఆక్రమిస్తే చట్టపరమైన కఠినచర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కార్యక్రమంలో సర్వేయర్ సంజీవయ్య, వీఆర్‌వోలు, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ముత్తుముల అశోక్‌రెడ్డి

అవీ..ఇవీ



ఎండోమెంట్ స్థలాల్లోని ఆక్రమణలను పరిశీలిస్తున్న ఏసీ పానకాలరావు

ఆక్రమణకు గురైన ఎండోమెంట్ భూముల పరిశీలన

పామూరు,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దేవస్థానాలకు చెందిన సెంటు భూమినీ వదలమని, తిరిగి స్వాధీనం చేసుకుంటామని ఎండోమెంట్ శాఖ సహాయ కమిషనర్ ఎం. పానకాలరావు తెలిపారు. పట్టణంలోని మదనవేణుగోపాల, వల్లీ భుజంగేశ్వరస్వామి దేవస్థానాలకు చెంది ఆక్రమణకు గురైన భూములను గురువారం పరిశీలించారు. ఆక్రమణ భూముల్లో శాశ్వత కట్టడాలు నిర్మించిన, వెంచర్లు వేసిన వారు ఎంతటి వారైనా ఎండోమెంట్ చట్ట ప్రకారం చర్యలు తీసుకొంటామని హెచ్చరించారు. తాము హెచ్చరించినా భవన నిర్మాణాలు కొనసాగించిన వారిపై క్రిమినల్ కేసులు పెట్టాలని ఈవో నరసింహబాబును ఆదేశించారు. దేవాలయ భూముల్లో అక్రమంగా వేసిన వెంచర్లలో ప్లాట్లు కొని మోసపోవద్దని సూచించారు. ఈ కార్యక్రమంలో కందుకూరు డివిజన్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, బీజేపీ నాయకులు కేవీ రమణయ్య, మాజీ పాలక మండలి అధ్యక్షులు గుర్రం వెంకటేశ్వర్లు, నరసింహులు, బి. నారాయణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు, పాల్గొన్న అధికారులు

విద్యుత్ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

దర్శి, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సిబ్బంది ప్రమాదాల బారిన పడకుండా అప్రమత్తంగా ఉండాలని విద్యుత్‌శాఖ ఒంగోలు ఎస్‌ఈ కట్టా వెంకటేశ్వర్లు సూచించారు. దర్శిలో గురువారం డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ పనులు నిర్వహించే సమయంలో అప్రమత్తంగా వ్యవహరించాలని కోరారు. విద్యుత్ బకాయిలను వెంటనే వసూలు చేయాలని స్పష్టం చేశారు. పీఎం సూర్యఘర్ పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగం చేసుకునేలా చైతన్య వంతులను చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో విద్యుత్‌శాఖ దర్శి ఈఈ పి. శ్రీనివాసులు, ఏపీటీఎస్ సీఐ టీటీ నాయక్, డివిజన్ పరిధిలోని అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న పొగాకు బోర్డు సూపరింటెండెంట్ రామకృష్ణ

వాతావరణ సమతుల్యాన్ని కాపాడాలి

తాళ్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాతావరణ సమతుల్యాన్ని కాపాడాలని వెల్లంపల్లి పొగాకు బోర్డు సూపరింటెండెంట్ కె.రామకృష్ణ తెలిపారు. మండలంలోని కొర్రపాటివారిపాలెం గ్రామంలో వెల్లంపల్లి పొగాకు బోర్డు ఆధ్వర్యంలో స్వచ్ఛతాహే సేవ కార్యక్రమంలో భాగంగా కొర్రపాటివారిపాలెం కాలువలపై గురువారం మొక్కలు నాటారు. ఈసందర్భంగా మాట్లాడుతూ అడవి మొక్కల పెంపకంతో చల్లని నీడతోపాటు కలప నిస్తాయన్నారు. రైతులు కూడా తమ గట్లపై ఇతర ప్రాంతాల్లో విరివిగా మొక్కలు పెంచి పర్యావరణ పరిరక్షణకు తోడ్పాటు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్‌ఆఫీసర్ హర్ష, ఎఫ్ఏలు ఆర్.నవీన్‌నాయక్,పవన్, పొగాకు బ్యారన్ రైతులు తదితరులు పాల్గొన్నారు.



కర్రలోడుతో ఉన్న ట్రాక్టర్ డ్రైవర్‌కు కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్సై కోటయ్య

నిబంధనలు అతిక్రమిస్తే కఠిన చర్యలు

పీసీపల్లి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిబంధనలు అతిక్రమించి వాహనాలు నడిపితే కఠినచర్యలు తప్పవని పీసీపల్లి ఎస్సై జి.కోటయ్య అన్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా గురువారం పీసీపల్లి శివారులో వాహనాలను తనిఖీ చేశారు.బ్యారన్లకు కర్రలను తరలిస్తున్న ట్రాక్టర్‌లను ఆపిడ్రైవర్‌లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. గతంలో కర్ర ట్రాక్టర్ చోదకుల నిర్లక్ష్యంతో ప్రమాదాలు జరిగి పలువురు మృతిచెందారన్నారు. డోర్ వెలుపలకు కర్ర లోడ్ చేయకుండా ఉండడంతో పాటు ట్రాక్టర్‌కు ముందు వెనకాల రేడియం స్టిక్కరింగ్ వేయించాలన్నారు. అలాగే ట్రాలీకి వెనుకవైపు కూడా లైటును అమర్చుకోవాలని సూచించారు.

నిధుల దుర్వినియోగంపై విచారణ చేపట్టాలి

పామూరు, డిసెంబరు12 (ఆంధ్రజ్యోతి) :పనులు చేపట్ట కుండానే పంచాయతీ నిధులను దుర్వినియోగం చేసిన గ్రామ సర్పంచ్‌పై అధికారులు విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని మండలంలోని కంబాల దిన్నె గ్రామానికి చెందిన మల్లెల శ్రీనివాసులు ఇటీవల ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో జరిగిన మీ కోసంలో ఫిర్యాదు చేశారు. గ్రామ సర్పంచ్ నీలం రమణమ్మ కొళాయి కనెక్షన్లు, ఎస్సీ కాలనీలో బావిపేరున, డీప్‌బోర్లు వేయకుండా వేసినట్లు పెద్దఎత్తున నిధులు డ్రా చేశారని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. జిల్లా అధికారులు నిధుల దుర్వినియోగంపై విచారణ చేయాలని అందులో కోరారు.

చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని ఆగ్రహం ● మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు అందజేత

కనిగిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దగుల్బాజీ విజయసాయిరెడ్డి చంద్రబాబుపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకునేది లేదని, ఖబడ్దార్ అని.. ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. స్థానిక అమరావతి గ్రౌండ్స్‌లో జనని చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఉచిత కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా నూకసాని మాట్లాడుతూ టీడీపీ,జనసేన, బీజేపీ ఎంతో కలసి కట్టుగా ఉంటుంటే చూస్తూ ఓర్వలేని ముసలి నక్క విజయసాయిరెడ్డి తప్పుడు మాటలు మాట్లాడుతున్నాడని మండిపడ్డారు. తప్పుడు లెక్కలు రాసే వ్యక్తి విజయసాయిరెడ్డికి చంద్రబాబు గొప్పతనం ఏం తెలుసునని ప్రశ్నించారు. దొడ్డిదారిన పదవుల పొందిన విజయసాయిరెడ్డి చంద్రబాబును విమర్శించే స్థాయి లేదన్నారు. మళ్లీ ఇలాంటి వ్యాఖ్యలు చేస్తే జనాలే కాదు నేనే తోలు తీస్తానని కనిగిరి వేదికగా హెచ్చరికలు చేస్తున్నానని అన్నారు. భైరవకోనను రూ. 40 కోట్లతో అభివృద్ధి చేసి జిల్లాలో అద్భుతమైన పర్యాటక ప్రాంతంగా తీర్చి దిద్దుతామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి ఎమ్మెల్యే అయ్యాను ఇక నాకేమి అన్నట్లుగా కాకుండా కనిగిరి అభివృద్ధికి ఎం తో తపన పడుతున్నారన్నారు. ఎమ్మెల్యేగా గెలిచాక కనిగిరి ప్రాంతంలో రూ. 26కోట్లతో రోడ్లు వేయించిన ఘనత డాక్టర్ ఉగ్రకే దక్కుతుందన్నారు. అనంతరం టైలరింగ్‌లో ఉచిత శిక్షణ పొందిన మహిళలకు, యువతులకు ఉచితంగా కుట్టు మిషన్లు నూకసాని అందజేశారు. ఈ కార్యక్రమంలో జనసేన ఇన్‌చార్జి వరికూటి నాగరాజు, టీడీపీ నాయకులు దొడ్డా వెంకటసుబ్బారెడ్డి, పిచ్చాల శ్రీనివాసులరెడ్డి, ముచ్చుమూరి చెంచిరెడ్డి, ఐవీ నారాయణ, తమ్మినేని వెంకటరెడ్డి, ఫిరోజ్, శ్రీనివాసులరెడ్డి, తెలుగుమహిళలు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న టూరిజం చైర్మన్ బాలాజీ, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర నరసింహారెడ్డి



మహిళలకు కుట్టుమిషన్లు అందజేస్తున్న నూకసాని, ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి

మహిళలు స్వయంశక్తితో ఎదగాలి

ఎమ్మెల్యే డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి

కనిగిరి, : కనిగిరి ప్రాంతంలో మహిళలు స్వయం శక్తితో ఎదిగి ఆర్థికంగా పురోభివృద్ధి చెందాలని ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్రనరసింహారెడ్డి అన్నారు. జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో ఎమ్మెల్యే డాక్టర్ ఉగ్ర ఆధ్వర్యంలో రెండవ విడత ఉచిత టైలరింగ్ శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు గురువారం ఉచితంగా కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కనిగిరి ప్రాంత అభివృద్ధే ధ్యేయంగా ముందుకు వెళ్తున్నానన్నారు. ప్రభుత్వం నుంచి పైసా ఖర్చు లేకుండా దాతల సహకారంతో ప్రభుత్వాసుపత్రిలో కార్పొరేట్ వైద్యం అందించే స్థాయికి తీసుకు వచ్చానన్నారు. అధికారంలో ఉన్నా, లేకున్నా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. చంద్రబాబు సహకారంతో కనిగిరిలో మహిళలకు ఉపాధి కల్పించే విధంగా గార్మెంట్ పరిశ్రమ ఏర్పాటు చేసేందుకు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన నాయకులు, తెలుగుమహిళలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

పామూరు,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లోని రైతులకు చెందిన భూ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నదని ఆర్డీవో కేశవవర్ధన్‌రెడ్డి తెలిపారు.మండలంలోని చింతలపాలెం గ్రామంలోని గ్రామ సచివాలయం వద్ద గురువారం రెవెన్యూ సదస్సును సర్పంచ్ మెడబలిమి గురవయ్య అధ్యక్షతన నిర్వహించారు. రెవెన్యూ రికార్డుల్లో ఎమైనా తప్పులు ఉంటే వాటిని సరిదిద్దేందుకు రాష్ట్ర ప్రభుత్వం రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నదన్నారు. ముందుగా గ్రామంలో రెవెన్యూ సదస్సు గురించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సభలో ఆర్డీవో మాట్లాడుతూ గ్రామ సభల ద్వారా భూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా మ్యూటేషన్ కొరకు 13, ఇతర భూ సమస్యలపై 7 దరఖాస్తులు వచ్చినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ బీవీ రమణారావు, రెవెన్యూ సదస్సుల ప్రత్యేకాధికారి ఎం. పానకాలరావు, ఎంఆర్ఐ బి. మల్లికార్జునరావు, వీఆర్వో పరుసు రమేష్, మండల సర్వేయర్ స్నేహ, మాజీ సర్పంచ్ ఇల్లూరి రామిరెడ్డి, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.



చింతలపాలెం రెవెన్యూ సదస్సులో అర్జీలను పరిశీలిస్తున్న ఆర్డీవో కేశవవర్ధన్‌రెడ్డి



రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న దర్శి తహసీల్దార్

సదస్సులతో సమస్యలకు సత్వర పరిష్కారం

దర్శి : రెవెన్యూ సదస్సుల ద్వారా ఎంతోకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను సత్వరమే పరిష్కరిస్తున్నామని దర్శి తహసీల్దార్ ఎం. శ్రావణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పోతకమూరు, పాపిరెడ్డిపాలెం గ్రామాల్లో గురువారం రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. రెండు గ్రామాల్లో మొత్తం 23 అర్జీలు దాఖలయ్యాయి. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పరిటాల శ్రీనివాసరావు, రెవెన్యూ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముండ్లమూరులో..

ముండ్లమూరు : రైతుల భూ సమస్యలను రెవెన్యూ సదస్సుల ద్వారా పరిష్కారమవుతాయని తహసీల్దార్ ఆర్. శ్రీకాంత్ అన్నారు. ఆయన గురువారం మండలంలోని ఈదర గ్రామంలో జరిగిన రెవెన్యూ సదస్సులో పాల్గొని రైతుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ రెవెన్యూ సదస్సులో 25 అర్జీలు వచ్చాయని తహసీల్దార్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, సర్పంచ్ వంగల పద్మావతి, వీఆర్వోలు కావూరి దయానందం, బ్రహ్మతేజ, సుజాత, బీ గురవయ్య, బద్రి అయ్యపరెడ్డి, నాగండ్ల రమణ తదితరులు ఉన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న విద్యుత్ ఈఈ శ్రీనివాసరావు

విద్యుత్ చౌర్యంపై విస్తృత తనిఖీలు

● పదిమందిపై కేసుల నమోదు

దొనకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో విద్యుత్ చౌర్యం జరుగుతుంటే వెంటనే సమాచారం తెలపాలని విద్యుత్ ఈఈ పి. శ్రీనివాసరావు పేర్కొన్నారు. మండలంలో విద్యుత్ సిబ్బంది 42 బృందాలుగా ఏర్పడి 41 గ్రామాల్లో గురువారం విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈఈ మాట్లాడుతూ విద్యుత్ చౌర్యం చేసే క్రమంలో అనుకోకుండా కొన్ని ప్రమాదాలు జరుగుతున్నాయని, విద్యుత్ చౌర్యం చేయటం వలన కఠినమైన చర్యలతో పాటు రెట్టింపు జరిమానాలు వేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా 3,065 విద్యుత్ సర్వీసులను తనిఖీలు చేసి అక్రమ విద్యుత్, రెట్టింపు లోడ్ వినియోగిస్తున్న పదిమందిని పట్టుకొని వారికి రూ.41,100 జరిమానాలు వేసినట్లు తెలిపారు. ట్రాన్స్‌కో విజిలెన్స్ సీఐ టీటీ నాయక్ మాట్లాడుతూ రైతులు వారి పొలాల్లో చెప్పులు లేకుండా తడి చేతులతో మోటార్లు ఆన్‌చేసే క్రమంలో షాక్‌కు గురై చనిపోతున్నారని, వర్షాకాలం తగిన జాగ్రత్తలు పాటించాలన్నారు. జిల్లాలో దాదాపు 56 మంది ఇటువంటి ప్రమాదాలకు గురై మృతిచెందారన్నారు. విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చోరీలపై ప్రత్యేక నిఘా పెట్టామని వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ విజిలెన్స్ ఈఈ టి. హైమవతి, పొదిలి డీఈఈ హరిబాబు, చీమకుర్తి డీఈఈ కృష్ణారెడ్డి, జిల్లాలోని పలు మండలాలకు చెందిన పదకొండు మంది ఏఈలు, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రామాల్లో సాగునీటి సంఘం ఎన్నికల కోలాహలం

కురిచేడు, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): కురిచేడు మండలం సాగు నీటి సంఘాల ఎన్నికలకు సంబంధించి నోటిఫికేషన్ వెలువరించడంతో గ్రామాలలో సందడి వాతావరణం నెలకొంది. 6 మేజర్, 3 మైనర్ ఇరిగేషన్ నీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతున్నాయి. దాదాపుగా ఎక్కువ శాతం ఏకగ్రీవాలు అయ్యేలా గ్రామస్థాయి నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. ఆవుల మంద మైనర్ ఇరిగేషన్ నీటి సంఘం ఎన్నికలకు సంబంధించి ప్రతిష్ఠంభన నెలకొని ఉన్నది. అధికారులు, పోలీసులు సైతం ఈ ఎన్నికలపై ప్రత్యేక దృష్టి పెట్టారు.

వాయిదాలు పడుతూ వస్తున్న సాగునీటి సంఘం ఎన్నికలు ఎట్టకేలకు ఈ నెల 14వ తేదీన జరుగుతున్నాయి. అందుకు సంబంధించి పూర్తి స్థాయి ఏర్పాట్లు పూర్తి చేశారు. పడమరవీరాయపాలెం-1,2, ముష్టగంగవరం, పడమర నాయుడుపాలెం, బయ్యవరం, కల్లూరు -1లు మేజర్ ఇరిగేషన్ కాగా, పడమర నాయుడుపాలె-2, కల్లూరు-2, ఆవుల మందలు మైనర్ ఇరిగేషన్‌లు ఉన్నాయి. మేజర్ ఇరిగేషన్ సాగునీటి సంఘంలో ఒక్కొక్క నీటి సంఘానికి 12 టీసీలు ఉండగా మైనర్ ఇరిగేషన్ నీటి సంఘానికి సంబంధించి ఒక్కొక్క సాగునీటి సంఘానికి 6 టీసీలు ఉంటాయి. పడమర వీరాయపాలెం-1లో 12 టీసీలకు గాను 1,265 మంది ఓటర్లు ఉండగా పడమర వీరాయపాలెం-2లో 631 మంది ఓటర్లు ఉన్నారు. ముష్టగంగవరం సాగునీటి సంఘంలో 337 మంది ఓటర్లు, పడమరనాయుడుపాలెం-1 సాగునీటి సంఘంలో 883 మంది ఓటర్లు, బయ్యవరం సాగునీటి సంఘంలో 664 మంది ఓటర్లు, కల్లూరు-1 సాగునీటి సంఘంలో 937 మంది ఓటర్లు, పడమరనాయుడుపాలెం-2 మైనర్ ఇరిగేషన్ సాగునీటి సంఘంలో 207 మంది ఓటర్లు, కల్లూరు-2 సాగునీటి సంఘంలో 246 మంది ఓటర్లు, ఆవులమంద సాగునీటి సంఘంలో 242 మంది ఓటర్లు ఉన్నారు. మొత్తం 6 మేజర్ ఇరిగేషన్ సాగునీటి సంఘాలలో 72 టీసీలకు గాను 3,817 మంది ఓటర్లు, 3 మైనర్ సాగు నీటి సంఘాలలో 18 టీసీలకు గాను 695 మంది ఓటర్లు వెరసి మొత్తం మీద 9 సాగునీటి సంఘాలకు సంబంధించి 90 టీసీలకు 4,512 మంది ఓటర్లు ఉన్నారు. 9 సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరుగుతుండడగా అధిక శాతం ఏకగ్రీవాలే ఉంటాయని సమాచారం.



ముండ్లమూరు సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ శ్రీకాంత్

ఎన్నికలు ప్రశాంతంగా జరిగేందుకు సహకరించాలి

ముండ్లమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సాగు నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలు ప్రశాంతంగా జరిగే విధంగా సిబ్బందితో పాటు వీఆర్‌వోలు సహకరించాలని తహసీల్దార్ ఆర్. శ్రీకాంత్ అన్నారు. గురువారం సాయంత్రం మండల రెవెన్యూ కార్యాలయంలో వీఆర్‌వోలు, సిబ్బందితో సమావేశం నిర్వహించారు. మండలంలో 17 సాగు నీటి సంఘాలకు, రెండు డీసీలకు ఎన్నికలు జరుగుతున్నాయన్నారు. దాని పరిధిలో 1886 టీసీలకు గాను 20,075 మంది రైతులు తమ ఓటు హక్కును వినియోగించు కోనున్నారన్నారు. ఈ సమావేశంలో రీ సర్వే డిప్యూటీ తహసీల్దార్ ఏ స్రవంతి, ఆర్ఐ పీఎస్ఆర్ మూర్తి, సీనియర్ అసిస్టెంట్ ఎస్. శేషగిరిరావు, వీఆర్‌వోలు గురవయ్య, బ్రహ్మతేజ, నాగేశ్వరరావు, కావూరి దయానందం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరు నాగేశ్వరరావు

హామీలను నిలబెట్టుకోలేకే డైవర్షన్ పాలిటిక్స్

- వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు

కనిగిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నదని వైసీపీ రీజనల్ కోఆర్డినేటర్ కారుమూరి నాగేశ్వరరావు విమర్శించారు. స్థానిక ప్రయివేటు ఫంక్షన్ హాలులో గురువారం వైసీపీ నియోజకవర్గ ఆత్మీయ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి 6నెలలు అయినా గడవక ముందే ప్రజల్లో అసహనం ఏర్పడిందని చెప్పుకొచ్చారు. కనిగిరి నియోజకవర్గంలో వైసీపీకి మంచి ఆదరణ ఉందని, అయినా అభ్యర్థిని ఎందుకు గెలుపించుకో లేకపోయారని ఆశ్చర్యం వ్యక్తం చేశారు. వైసీపీ ఒంగోలు పార్లమెంట్ ఇన్‌చార్జి చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ బూటకపు హామీలతో అధికారంలోకి వచ్చి రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ ఇన్‌చార్జి దద్దాల నారాయణయాదవ్, మాజీ ఎమ్మెల్యే కదిరి బాబూరావు, రెడ్డికార్పొరేషన్ మాజీ చైర్మన్ చింతలచెరువు సత్యనారాయణరెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ ప్రసాద్‌రెడ్డి, మాజీ ఎంపీపీలు, మాజీ జడ్పీటీసీలు, సర్పంచ్‌లు, వైసీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉత్తమ డీలర్ జనార్దన్‌కు షీల్డ్ అందజేత

సీఎస్‌పురం(పామూరు)డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సీఎస్‌పురంలోని శ్రీ అయ్యప్ప భారత్ పెట్రోల్ బంకులో ఈ ఏడాది అత్యధికంగా పెట్రోల్, డీజిల్‌ను వినిమోగదారులకు అందిస్తూ అత్యధికంగా కంపెనీ ఉత్పత్తులను సేల్ చేసినందుకు పెట్రోల్ బంకు డీలర్ తిరివిధి జనార్దనరావుకు ఒంగోలులో జరిగిన కార్యక్రమంలో హెచ్‌పీ షీల్డ్‌ను గురువారం అందజేశారు. శాలువాతో సత్కరించి అభినందించారు.

వరికోతలు వాయిదా వేసుకోండి

దొనకొండ, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): తుఫాన్ హెచ్చరికల కారణంగా కలెక్టర్ , జిల్లా వ్యవసాయాధికారి ఆదేశాల మేరకు మండలంలో నాగార్జునసాగర్ ప్రాజెక్టు కుడి కాలువ కింద సాగుచేసిన వరి రైతులు కోతలను వారం పాటు వాయిదా వేసుకోవాలని వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ సూచించారు. చందవరం, బట్టిపాడు, దేశిరెడ్డిపల్లి, పి. లక్ష్మీపురం గ్రామాల్లో 600 ఎకరాల్లో సాగుచేసిన వరి ప్రస్తుతం కోతకు వచ్చిందన్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర క్వింటాకు రూ.2,300 ఇస్తుందని తొందరపడి మధ్యవర్తులకు అమ్ముకోవద్దని సూచించారు. తుఫాన్ తగ్గిన వెంటనే వరి కోతలు ప్రారం ఈ కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పంట ఉత్పత్తులపై వెలుగు మహిళలకు శిక్షణ

తాళ్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) :పంటలను పండించటంతో పాటు వాటి విలువల పెంపుపై తగిన సూచనలు పాటిస్తే మంచి గిట్టుబాటు ధర వస్తుందని మండల వ్యవసాయాధికారి బి.ప్రసాద్‌రావు అన్నారు. స్థానిక వెలుగు కార్యాలయంలో వెలుగు మహిళలకు పంట ఉత్పత్తులపై గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.సజ్జలు ముడిసరుకు కేవలం రూ. 2,400కు మాత్రమే అమ్ముడుపోతాయని, అదే సజ్జఉత్పత్తులుగా మార్చుకుంటే మంచి ధర వస్తుందని తెలిపారు. పలురకాల ఉత్పత్తులను మహిళలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏపీఎం దేవరాజ్, వెలుగు మహిళలు పాల్గొన్నారు.

భైరవకోనను అభివృద్ధి చేయాలి

సీఎస్‌పురం(పామూరు)డిసెంబరు12(ఆంధ్రజ్యోతి): జిల్లాలోనే ప్రముఖ శైవ క్షేత్రమైన భైరవకోన పుణ్యక్షేత్రాన్ని పర్యాటక టూరిజం కేంద్రంగా అభివృద్ధిచేసి ఈ ప్రాంత ప్రజల జీవనోపాధికి తగిన కృషి చేయాలని ఏపీ టూరిజం కార్పొరేషన్ చైర్మన్ నూకసాని బాలాజీని ఎమ్మెల్యే ఉగ్ర నరసింహారెడ్డి కోరారు కనిగిరిలోని అమరావతి క్యాంప్ కార్యాలయంలో గురువారం నిర్వహించిన కార్యక్రమంలో బాలాజీ పాల్గొన్నారు.

భక్తులకు అన్నదానం

పామూరు,డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : స్థానిక అయ్యప్పస్వామి దేవస్థానంలో అయ్యప్ప భక్తులకు శ్రీ బాలాజీ జ్యూయలర్స్ అధినేత దేవస్థాన చైర్మన్ గుత్తి రాజ దంపతుల ఆధ్వర్యంలో తండ్రి గుత్తి దేవుడు సుబ్బయ్య, జ్ఞాపకార్థం గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా దేవస్థాన చైర్మన్ రాజ కుటుంబ సభ్యులు, దంపతులు దేవస్థానంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఉభయదాతలకు స్వామి చిత్రపటం, తీర్థ ప్రసాదాలు అందజేసి సన్మానించారు. మాజీ సర్పంచ్ కావిటి సుబ్బయ్య, గుత్తి మల్లికార్జున, ఓగూరి నరసింహారావు, కంభాల రోశయ్య, గుత్తి సాయి, పోసం నరసింహారావుతో పాటు భక్తులు పాల్గొన్నారు.

సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు సాధించాలి

ప్రభుత్వ సుస్థిర అభివృద్ధి లక్ష్యాల సాధనపై గ్రామ సచివాలయ అధికారులు కృషి చేయాలని ఎంపీడీవో బి. సురేష్ సూచించారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో పంచాయతీ సర్పంచ్, కార్యదర్శులు, ఇంజనీరింగ్, వెల్ఫేర్, ఎనర్జీ అసిస్టెంట్‌లు, మహిళా పోలీసులకు గురువారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు.

క్రైం సమాచారం

చెరువులో జారిపడి వృద్ధుడు మృతి

వెలిగండ్ల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోప చెరువులో పడి వృద్ధుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం చోటుచేసుకుంది. ఎస్ఐ మదుసూధన్ రావు వివరాల ప్రకారం... మరపగుంట్ల గ్రామానికి చెందిన చింతకాయల లక్ష్మయ్య(61)ఈ నెల9వ తేదీన బహిర్భూమికి వెళ్తున్నానని చెప్పి వెళ్ళాడు. అప్పటి నుంచి ఇంటికి రాలేదు. దీంతో ఆయన బంధువుల ఇంటికి వెళ్లాడని అనుకున్నారు కానీ గురువారం అదే గ్రామానికి చెందిన వ్యక్తి చెరువు దగ్గరుకు వెళ్లగా మృతదేహం ఒడ్డున ఉండడంతో వెంటనే గ్రామస్థులకు తెలపడంతో పాటు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో మృతుడు లక్ష్మయ్యగా గుర్తించారు. బహిర్భూమికి వెళ్లి కాలు జారిపడి మృతి చెందాడని గ్రామస్థులు భావిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.



చెరువులో తేలుతున్న వృద్ధుడి మృతదేహం

దళారులను నమ్మి మోసపోవద్దు : జేసీ ప్రఖర్‌జైన్

నగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రైతులు దళారులను నమ్మి మోసపోకుండా కొనుగోలు కేంద్రాల వద్దనే ధాన్యాన్ని అమ్ముకోవాలని జాయింట్ కలెక్టర్ ప్రఖర్‌జైన్ తెలిపారు. గురువారం మండలంలోని పూడివాడ గ్రామంలో రైతు సేవా కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం రైస్ మిల్లర్లతో మాట్లాడి ధాన్యం కొనుగోలు కేంద్రం ప్రక్రియను పరిశీలించారు. ధాన్యం కొనుగోళ్లకు సంబంధించి రైతులను ప్రశ్నించారు. రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా కొనుగోలు ప్రక్రియ ఉండాలని మిల్లర్లకు జేసీ సూచించారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ శాఖాధికారి వై రామకృష్ణ, ఆర్డీవో రామలక్ష్మి పాల్గొన్నారు.



- రిజిస్ట్రేషన్ చార్జీలో భారీ మినహాయింపు
- పన్నుల్లో రాయితీలతో ప్రభుత్వ ప్రోత్సాహం
- చార్జింగ్ స్టేషన్ల పెట్టుబడిలో 25 శాతం రాయితీ
- విద్యుత్ రవాణా పాలసీ 4.0తో పండుగే పండుగ

ఇక ఈవీల హవా

విద్యుత్ వాహనాలకు వరాలు

గుంటూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): కాలుష్య రహిత వాహనాలను ప్రోత్సహించడమే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం విద్యుత్ రవాణా పాలసీని ప్రకటించింది. ఇప్పటికే ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రజలు విద్యుత్ వాహనాల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. ఈవీ వాహనాలు ధర అధికంగా ఉన్నా పర్యావరణం, పెట్రోలు ధరల భారంతో పలువురు ఈవీ వాహనాలను పెద్దసంఖ్యలో కొనుగోలు చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కూటమి ప్రభుత్వం 'ఏపీ సస్టెయినబుల్ ఎలక్ట్రిక్ మొబిలిటీ పాలసీ 4.0 ప్రకటించింది. విద్యుత్ వాహనాల వినియోగదారులు, చార్జింగ్ స్టేషన్ నిర్వాహకులకు ప్రభుత్వం వరాల జల్లు కురిపించింది. దీంతో విద్యుత్ వాహనదారులకు పండుగే. పండుగని పలువురు అభిప్రాయపడుతున్నారు. విద్యుత్ వాహనాల వినియోగంలో రాష్ట్రం వెనుకంజలో ఉండటంతో వాటిని ప్రోత్సహించడంపై ప్రభుత్వం దృష్టిపెట్టింది. తాజాగా రూపొందించిన విద్యుత్ రవాణా పాలసీ ద్వారా 2029 నాటికి 2 లక్షల విద్యుత్ టూ వీలర్స్, 10 వేల త్రీ వీలర్స్, 20 వేల ఫోర్ వీలర్స్‌ను రిజిస్ట్రేషన్ చేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఔత్సాహిక ఎంఎస్ ఎంఈ పెట్టుబడిదారులకు పెట్టుబడిలో 35 శాతం రాయితీ, ఇంటెన్సివ్‌లు ప్రకటించింది. క్వాలిటీ సర్టిఫికేషన్, విద్యుత్ సుంకం కూడా రీయింబర్స్ చేస్తారు. విద్యుత్ చార్జింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసే వారికి ఒక్కో పబ్లిక్ చార్జింగ్ స్టేషన్‌కు పెట్టుబడిలో 25 శాతం సబ్సిడీ, గరిష్ఠంగా 3 లక్షలు ఇస్తారు.

● వినియోగదారులకూ రాయితీ..

విద్యుత్ వాహనాలు కొనుగోలు చేసే వినియోగదారులకు ప్రభుత్వం రిజిస్ట్రేషన్ చార్జీలో మినహాయింపు ఇచ్చింది. 12 శాతంగా ఉన్న రోడ్ ట్యాక్స్‌ను మినహాయిస్తోంది. అంటే రూ.లక్ష వాహనానికి రూ.12 వేలు లైఫ్ టాక్స్ మినహాయింపు వస్తుంది. దీంతో పాటు వాహన ఖరీదులో 5 శాతం డిస్కౌంట్ లభిస్తుంది. కార్లకు మాత్రం ఇది వర్తించదని సమాచారం. రూ.లక్ష లోపు ఉన్న ఈ-ద్విచక్ర వాహనాలకు, రూ.2 లక్షల లోపు ధర ఉన్న ఈ-3 వీలర్స్‌కు, ఐదు లక్షలలోపు ధర ఉన్న సరుకు ఈ-రవాణా వాహనాలకు, రూ.8 లక్షల లోపు ధర ఉన్న ఈ- ట్రాక్టర్లు, రూ.2 కోట్ల లోపు ధర ఉన్న ఈ-బస్సులకు మాత్రమే ఇది వర్తిస్తుంది. అమ్మకందారులకు కూడా పది శాతం రాయితీ ప్రకటించారు.

● ప్రతి 30 కి.మీ.కి ఒక చార్జింగ్ స్టేషన్

ప్రధాన రహదారుల్లో ప్రతి 30 కిలోమీటర్లకు ఒక చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేయడం పాలసీ లక్ష్యం. నగరాల్లో 3 బై 3 కేఎం గ్రిడ్ ఏర్పాటు చేయాలని సంకల్పించింది. ఈ మొబిలిటీ సిటీల అభివృద్ధి కోసం రూ.500 కోట్లు కార్పస్ ఫండ్‌గా కేటాయించింది. ఈ మొబిలిటీ స్టార్టప్‌ల కోసం 100 ఇంక్యుబేషన్ సెంటర్లను ఏర్పాటు చేయనుంది.

మందులు ఏటిపాలు

ప్రాణాపాయ మందులు.. రోగుల నీరసం పోగొట్టే బలం సిరప్‌లు.. వివిధ రోగాలకు సంబంధించిన ట్యాబ్లెట్లు.. జగనన్న ఆరోగ్య సురక్ష, కోవిడ్ ర్యాపిడ్ టెస్ట్ కిట్లు.. ఏటిపాలు చేశారు. ప్రైవేటు దోపిడీని తట్టుకోలేక ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే పేదలకు ఇవ్వాల్సిన మందులు నదిలో పారేశారు. పేదల కోసం రూ.కోట్లు వెచ్చించి కొనుగోలు చేసిన మందుల్లో చాలావరకు చెత్తకుప్పల్లో దర్శనమిస్తున్నాయి. రోగులకు ఇవ్వడానికి చేతులు రాదు కానీ ఇలా పారేయడం ఏమిటని ఆ మందుల గుట్టలను చూసిన పలువురు విస్తుపోతున్నారు. బయో వ్యర్థాల కింద అప్పగిస్తే దొరికి పోతామనుకున్నారో! లేక నదిలో పారేస్తే ప్రవాహంలో కొట్టుకు పోతాయనుకున్నారో కానీ, పెద్దగుట్ట మందులను కృష్ణానదిలో వేశారు. ఈ మందుల గుట్టలపై ప్రశ్నిస్తే ఆస్పత్రులు, 104 సిబ్బంది మావికాదంటే మావికాదంటూ చెప్తూ కృష్ణాజిల్లా వారు పారేసి ఉంటారని నెపం మోపుతున్నారు. ఈ మందుల్లో కొన్ని గడువు తీరిపోగా.. మరికొన్ని 2025 వరకు గడువు ఉన్నాయి. ఇటీవల తెనాలి అర్బన్ హెల్త్ సెంటర్ ఆవరణలోనే మందులకు నిప్పు పెట్టగా తాజాగా నది మధ్యలో గుట్టలు గుట్టలుగా విలువైన ఔషధాలు దర్శనమివ్వడంపై ప్రజలు అధికారుల తీరుపై మండిపడుతున్నారు.

- 2025 వరకు గడువున్నా పారేశారు
- కృష్ణానదిలో జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు
- ఓ తంతుగా ఆరోగ్య శిబిరాలు.. మందులన్నీ వృథా
- పేద రోగులకు ఇవ్వకుండా పారేయడంపై విమర్శలు
- గడువు ముగిసే సమయంలో కొనుగోలుపై అనుమానాలు
- మావికాదంటే.. మావికాదంటున్న పీహెచ్‌సీ, 104 సిబ్బంది

తెనాలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పేదల కోసం రూ.కోట్ల ప్రజాధనం వెచ్చించి ఔషధ కంపెనీల దగ్గర కొని ప్రభుత్వం అందించిన మందులవి. 104లో అందించాల్సినవో! లేక పీహెచ్‌సీల నిర్వాకమో కానీ, కొన్ని గడువు తీరాక.. మరికొన్ని 2025 వరకు గడువున్నా కృష్ణానదిలో పారేశారు. వాటితోపాటే జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, గుండె సంబంధ మందులు, ర్యాపిడ్ టెస్ట్ కిట్లు వంటివి కూడా ఆ చెత్త గుట్టలో ఉన్నాయి. కొల్లిపర మండలం మున్నంగి ఇసుక రీచ్ కోసం నదిలోకి గాలు వేసి ఉంది. ఆ గాలు మార్గంలోని చెత్త కుప్పల్లో ఈ మందులు కూడా ఉన్నాయి. 2024 మేతో గడువు ముగిసిన మందులు ఎక్కువగా ఉంటే, 2025 వరకు గడువున్న మందులు కూడా ఆ గుట్టలో ఉన్నాయి. కొల్లిపర, మున్నంగి ప్రభుత్వ వైద్యశాల సిబ్బందితో పాటు 104 వాహన సిబ్బంది మావి కాదంటే మావికాదంటున్నారు. ఇటీవల తెనాలి అర్బన్ హెల్త్ సెంటర్‌లో గడువు ముగిసిన మందులను ఆస్పత్రి ఆవరణలోనే నిప్పు పెట్టిన విషయం తెలిసిందే. ఇప్పుడు కృష్ణానదిలో వివిధ రకాల మందులు ప్రత్యక్షం కావడం చూస్తే గత ప్రభుత్వ హయాంలో పేదల వైద్యంపై ఎంతవరకు శ్రద్ధ చూపారనేందుకు నిదర్శనంగా ఉంది. ప్రభుత్వ ఆస్పత్రులను ఆశ్రయించే రోగులకు మందులు ఇస్తే వారి ఆరోగ్యం కుదుటపడటంతోపాటు, ఆర్థికపరంగా కూడా వెసులుబాటు ఉంటుంది. కానీ కొన్ని వైద్యశాలల్లో వైద్యులే పేద రోగులకు ప్రైవేటు దుకాణాల్లో మందులు తెచ్చుకోవాలని రాస్తున్నారు. వివిధ రకాల రక్త పరీక్షల కేంద్రాలకు కూడా పంపిస్తున్నారు. ప్రభుత్వం సరఫరా చేసే మందులు, పరీక్షల కిట్లను మాత్రం ఇలా పారేస్తున్నారు. జగన్ ప్రభుత్వ హయాంలో ఆరోగ్య శిబిరాలు ఓ తంతుగా మారడంతో విలువైన మందులన్నీ వృథాగా మారాయి. ఆస్పత్రులకు ప్రభుత్వం సరఫరా చేసే మందుల్లో ఏదో ఒకటి, రెండు రకాల (మిగతా 6వ పేజీలో)





మున్నంగి ఇసుక రీచ్ మార్గంలో కృష్ణానది మధ్యలో పారేసిన జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు, వివిధ రకాల మందులు

సమీక్షలు... ఆదేశాలు

- రెండో రోజు కలెక్టర్ల సదస్సులో కీలక నిర్ణయాలు
- అనేక అంశాలపై కలెక్టర్లకు ముఖ్యమంత్రి దిశానిర్దేశం
- గోదావరి జలాల ఎత్తిపోతల పథకం నిర్మాణంలో కదలిక
- పల్నాడులో 466 ఎకరాల భూసేకరణకు చంద్రబాబు ఆదేశాలు
- గుంటూరు యూజీడీ పెండింగ్ నిధుల విడుదలకు నిర్ణయం
- ఏఐఐబీ పనుల కొనసాగింపుపై నివేదించిన కలెక్టర్ నాగలక్ష్మి
- కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్రణాళికల రూపకల్పనపై నిర్ణయం



సదస్సుకు హాజరైన బాపట్ల జిల్లా కలెక్టర్ వెంకటమురళి, ఎస్పీ తుషార్ డూడీ



నకరికల్లులో గోదావరి జలాలు ఎత్తిపోతల పథకానికి నాడు సీఎం చంద్రబాబు ఆవిష్కరించిన శంకుస్థాపన శిలాఫలకం

(బాపట్ల, ఆంధ్రజ్యోతి)

వివిధ అంశాలపై సమీక్షలు.. ఆదేశాలు.. సూచనలు.. గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లాలకు సంబంధించి పలు కీలక నిర్ణయాలు.. ఇదీ రాజధాని సచివాలయంలో గురువారం జరిగిన కలెక్టర్ల రెండు రోజు సదస్సు జరిగిన తీరు. నాగార్జున సాగర్ ఆయకట్టు రైతులకు తీపి కబురు చెప్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు కలెక్టర్ల సదస్సులో గోదావరి జలాల ఎత్తిపోతల పథకంపై నిర్ణయం తీసుకున్నారు. పైగా ఈ పథకాన్ని 2026 జూన్ కల్లా పూర్తి చేస్తామని ప్రకటించారు. రెండో రోజు సదస్సులో గుంటూరు కలెక్టర్ నాగలక్ష్మి, పల్నాడు కలెక్టర్ అరుణ్‌బాబు, బాపట్ల కలెక్టర్ వెంకటమురళిలు ఆయా జిల్లాలకు సంబంధించిన పలు అంశాలను ముఖ్యమంత్రికి నివేదించగా, వాటిపై ప్రత్యేకంగా చర్చించారు. గుంటూరు నగరానికి సంబంధించి గతంలో ఆగిపోయిన యూజీడీకి పెండింగ్ నిధులు మంజూరుకు సీఎం ఆమోదం తెలపగా నగరపాలక సంస్థలో ఏఐఐబీ ప నుల కొనసాగింపుపై కలెక్టర్ నాగలక్ష్మి సీఎంకు ప్రత్యేకంగా నివేదించారు. స్వర్ణాంధ్ర-2047 డాక్యుమెంట్లపై విస్తృతంగా చర్చ జరగడంతో పాటు జిల్లా వ్యాప్తంగా అది సాకారం కోసం తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎం కలెక్టర్లకు దిశా నిర్దేశం చేశారు. గురువారం నాటి కలెక్టర్ల సదస్సులో గోదా వరి - పెన్నా నదుల అనుసందానంపై ప్రధానంగా చర్చ జరిగింది. సాగర్ అయకట్టుకు గోదావరి జలాల తరలింపు పథకానికి భూసేకరణకు కలెక్టర్ల సదస్సులో సీఎం ఆదేశాలిచ్చారు. దీంతో ఈ ఎత్తిపోతల పథకం పనులకు త్వరలో కదలిక రానున్నది. ఎత్తిపోతలకు సంబంధించిన రెండు పంపుహౌస్‌ల పనులు పురోగతిలో ఉండగా మరో మూడు పంపుహౌస్‌ల పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయి. ఇక గుంటూరుకు సంబంధించి యూజీడీ పనులకు నిధులు విడుదల చేయకపోవడంతో ఒక్క కనెక్షన్ కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని కలెక్టర్ నాగలక్ష్మి సీఎంకు నివేదించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ స్కీమ్ మంజూరు కాగా దాదాపుగా రూ.500 కోట్లు ఖర్చు చేశామని అయితే రాష్ట్ర ప్రభుత్వ నగరపాలకసంస్థ వాటా రూ.400 కోట్ల వరకు ఉన్నదని పెండింగ్ నిధుల విషయంలో సానుకూల నిర్ణయం తీసుకోవాలని కలెక్టర్ కోరారు. దీనిపై సీఎం స్పందించి ఆర్థికశాఖ వద్ద పెండింగ్ బిల్లులు ఎంత మొత్తంలో ఉన్నాయనేది తెలుసుకున్నారు. దాదాపుగా రూ.300 కోట్లు త్వరలోనే విడుదల చేసి యూజీడీ స్కీమ్‌ని పూర్తి చేయాలన్నారు. గుంటూరు నగరపాలక సంస్థతో పాటు శరవేగంగా అభివృద్ధి చెందుతున్న మంగళగిరి తాడేపల్లి మున్సిపల్ కార్పొరేషన్‌లో తాగునీటి సరఫరా సమస్యలను కలెక్టర్ సీఎం దృష్టికి తీసుకెళ్లారు. ఎంటీఎంసీ పరిధిలో హైరైజ్డ్ బిల్డింగ్‌లు, ఇండస్ట్రియల్ పార్కులు, అపార్టుమెంట్లు వచ్చేశాయని, అయితే వారంతా భూగర్భ జలంపైనే ఆధారపడి ఉన్నారని చెప్పారు. గుంటూరు నగరంలోకి (మిగతా 6వ పేజీలో)

కదిలిన చోరీ డొంక

- అంతర్ రాష్ట్ర దొంగ అరెస్టు
- నిందితుడిపై ఇప్పటికే 72 కేసులు
- ఇటీవలే బాపట్ల సబ్ జైలు నుంచి విడుదల



వివరాలను వెల్లడిస్తున్న డీఎస్పీ మొయిన్

చీరాలటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఇటీవల చీరాలలో జరిగిన చోరీపై దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడు ట్రాక్ రికార్డు చూసి నివ్వెరపోయారు. చిన్నపాటి దొంగగా భావించి దర్యాప్తు చేపడితే ఏకంగా చోరీ డొంకే కదిలింది. చీరాల డీఎస్పీ ఎండీ మొయిన్ వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన సమావేశంలో నిందితుడి వివరాలను వెల్లడించారు. తూర్పు గోదావరి జిల్లా బిక్కవోలు మండలం ఊలపల్లి గ్రామానికి చెందిన కస్తూరి అప్పన్న అలియాస్ వీరప్పన్న ఉమ్మడి తెలుగు రాష్ట్రాల్లో పలు చోరీలకు పాల్పడ్డాడు. దీంతో ఇతడిపై ఇప్పటికే సుమారు 72 కేసులు నమోదయ్యాయి. ఇటీవల బాపట్ల పరిధిలో జరిగిన చోరీ కేసులో సబ్ జైలు నుంచి విడుదలైన వీరప్పన్న చీరాల మండల పరిధిలోని దేవాంగపురి పంచాయతీలో ఓ ఇంట్లో చోరీకి పాల్పడ్డాడు. దీంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన పోలీసులకు కేసు దర్యాప్తులో ఆసక్తికర అంశాలు వెలుగు చూశాయి. అతడి వద్ద నుంచి 5 కేసులకు సంబంధించిన రూ.7.41 లక్షల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకున్నారు. వన్‌టౌన్ సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ కమలాకర్, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు.



హోమం, పూజల్లో పాల్గొన్న భక్తులు

మాధవస్వామి ఆలయంలో పూజలు

విమాన శిఖర గోపుర పునఃప్రతిష్ఠ

అద్దంకి, డిసెంబరు 12 (ఆంధ్ర జ్యోతి) : అద్దంకి పట్టణంలోని మాధవ స్వామి దేవాలయం విమాన శిఖర గోపుర పునః ప్రతిష్ఠ పూజా కార్యక్రమాలు గురువారం రెండవ రోజు నిర్వహించారు. గురువారం ఉదయం పారాయణం, యాగశాల ప్రవేశం, అగ్ని ప్రతిష్ఠ, శిఖరానికి పంచగవ్య శుద్ధి, లఘు పూర్ణాహుతి నిర్వహించారు. విష్ణు సహస్ర నామ పారాయణం, గాయత్రీ హోమం పంచసూక్త హోమం నిర్వహించారు. శుక్ర, శనివారాల్లో కూడా ప్రత్యేక పూజల అనంతరం శనివారం ఉదయం 8-04 గంటలకు విమాన శిఖర గోపుర ప్రతిష్ఠను నిర్వహించనున్నారు. హోమం, పూజలలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

నేడు శింగరకొండలో హనుమత్ వ్రతం

భక్తుల దీక్ష విరమణ, ఏర్పాట్లు చేసిన అధికారులు

అద్దంకి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : హనుమత్ వ్రతం సందర్భంగా శుక్రవారం శింగరకొండ ప్రసన్నాంజనేయస్వామి దేవాలయంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు జరుగుతాయని ఈవో తిమ్మానాయుడు తెలిపారు. ఆంజనేయ స్వామి మాలాధారణ భక్తులు దీక్షా విరమణ కూడా శుక్రవారం జరగనుండడంతో అవసరమైన ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రకాశం, బాపట్ల, పల్నాడు జిల్లాలలోని పలు ప్రాంతాల నుంచి దీక్షా భక్తులు గురువారం రాత్రి కి శింగరకొండకు చేరుకున్నారు. ఉదయం 7-30 గంటలకు దీక్షధారులతో ఆలయ ప్రదక్షిణ, ఇరుముడి ద్రవ్యములతో ఉత్సవ మూర్తులకు పంచామృత అభిషేకం, 9 గంటలకు హనుమత్ వ్రతం, మధ్యాహ్నం 12 గంటలకు మన్యుసూక్త హోమము, అన్న ప్రసాద వితరణ జరుగుతాయని ఈవో తెలిపారు.

ముగిసిన హనుమాన్ చాలీసా పారాయణం

ఇంకొల్లు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఇంకొల్లు కృష్ణనగర్ శ్రీ ప్రసన్న ఆంజనేయ స్వామి ఆలయంలో కార్తీక మాసంలో ప్రారంభించిన హనుమాన్ చాలీసా పారాయణం గురువారంతో ముగిసింది. 40 రోజులపాటు భక్తులు చాలీసా పారాయణాన్ని భక్తిశ్రద్ధలతో చేశారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనగా, చివరి రోజు 108 సార్లు పారాయణం నిర్వహించి ముగించారు. అనంతరం స్వామి వారి తీర్థప్రసాదాలను భక్తులకు పంచిపెట్టారు.

16 నుంచి శిక్షణ తరగతులు

చినగంజాం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి) : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సమావేశపు హాల్ నందు ఈ నెల 16 నుంచి 19వ తేదీ వరకు మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శిలు, 13 సచివాలయాల సిబ్బందికి శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీవో ఏ.శ్రీనివాసమూర్తి గురువారం తెలిపారు. ఒంగోలు జిల్లా ప్రజా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి ఉత్తర్వులు మేరకు ఆరోగ్యవంతమైన గ్రామ పంచాయతీలు, పేదరిక నిర్మూలన, నీటి వనరుల అభివృద్ధి, పచ్చదనం, పరిశుభ్రత, సుపరిపాలన తదితర అంశాలపై స్థిరమైన లక్ష్యాలను గ్రామ స్థాయిలో సాధించేందుకు శిక్షణ తరగతులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 16 నుంచి 17 వ తేదీ వరకు జరిగే మొదటి బ్యాచ్‌లో మండల పరిధిలోని గ్రామ సర్పంచ్‌లు, గ్రామ కార్యదర్శులు, మహిళా పోలీసులు, వెల్ఫేర్, ఎడ్యుకేషనల్ సహాయకులు, ఇంజనీరింగ్ సహాయకులకు, 18 నుంచి 19వ తేదీ వరకు జరిగే రెండవ బ్యాచ్‌లో 13 గ్రామ సచివాలయల్లోని డిజిటల్ అసిస్టెంట్‌లు, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు, అగ్రికల్చర్, వెటర్నరీ సహాయకులు, ఏఎన్ఎంలు, ఎనర్జీ సహాయకులకు శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.

సమీక్షలు.. ఆదేశాలు

(5వ పేజీ తరువాయి)

కొన్ని పంచాయతీలను విలీనం చేసి పదేళ్లు దాటిందని, అయితే పరిశుభ్రమైన తాగునీటిని అందించలేని పరిస్థితి ఉందన్నారు. గతంలో ఏషియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు(ఏఐఐబీ) నుంచి రుణాలు మంజూరై ఉన్నాయని, అయితే కొన్ని పనులు ప్రారంభించి నిలుపుదల చేశారన్నారు. ఆ పనులను కొనసాగించడమా.. అంచనాలను సవరించి కొత్తగా చేపట్టడమా అనే విషయంలో తుది నిర్ణయం తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇదే అంశంపై మంత్రి, మంగళగిరి ఎమ్మెల్యే నారా లోకేశ్ స్పందించి మాట్లాడుతూ అమరావతి రాజధాని పరిధిలో భాగస్వామ్యమైన మంగళగిరి నియోజకవర్గానికి కూడా మౌలిక సదుపాయాల కల్పన పనులను పొడిగించాలని కోరారు. దీనిపై సీఎం చంద్రబాబు స్పందించి తాగునీటికి అత్యంత ప్రాధాన్యం ఇచ్చి పనులు పూర్తి చేస్తామన్నారు.

సూచనలు.. లక్ష్యాలు

కలెక్టర్ల సదస్సు చివరి రోజున వివిధ ప్రభుత్వ శాఖల ఉన్నతాధికారులు కలెక్టర్లకు కొన్ని సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వచ్చే మూడున్నర నెలల్లో పీఎంఏవై అర్బన్ కింద 4200 ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయాలని గుంటూరు కలెక్టర్‌కు లక్ష్యాన్ని నిర్దేశించారు. పీఎంఏవై అర్బన్‌ని 2026 మార్చి వరకు కేంద్ర ప్రభుత్వం గడవు పొడిగించినందున సాధ్యమైనంత త్వరగా పెండింగ్ గృహాలు పూర్తి చేయాలన్నారు. గోకులాల నిర్మాణం విషయంలో నిర్లక్ష్యం వీడాలన్నారు. అటవీ శాఖ క్లియరెన్స్‌లు జిల్లాలో ఏడు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిపై త్వరితగతిన చర్యలు తీసుకోవాలన్నారు. పట్టణీకరణ వేగవంతంగా విస్తరిస్తున్నందున ప్రతీ ప్రాంతానికి మౌలిక సదుపాయాల కల్పనకు ఒక బ్లూప్రింట్ తయారు చేసి అమలు చేయాలన్నారు. కృష్ణా పుష్కరాలకు ఇప్పటి నుంచే ప్లానింగ్ చేసుకుని ఘాట్ల నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. మంగళగిరిలో ఐటీ పార్కు నిర్మాణానికి 200 ఎకరాల భూమిని గుర్తించాలని ఆదేశించారు. అమరావతిని బుద్ధిస్టు సర్క్యూట్‌గా పర్యాటకాభివృద్ధికి చర్యలు చేపట్టాలన్నారు. మంగళగిరిలోని లక్ష్మీనృసింహస్వామి ఆలయ అభివృద్ధికి కూడా ప్రణాళిక రూపొందించాలన్నారు. మానవవనరులు, గృహ నిర్మాణం, చైల్డ్ వెల్‌ఫేర్, వెనకబడిన వర్గాల కార్పొరేషన్లు ఇలా దాదాపు అన్ని విభాగాలలో బాపట్ల జిల్లాకు సంబంధించి సమీక్షలో చర్చించించారు. రాబోయే నాలుగున్నరేళ్లలో ఆయా రంగాలలో సాధించాల్సిన పురోగతితో పాటు జిల్లాలో పారిశ్రామికంగా, పర్యాటకంగా ఉన్న వనరుల లభ్యత వంటి అంశాలన్నీ సదస్సులో చర్చకు వచ్చాయి

ఓఆర్ఆర్‌తో గుంటూరు - విజయవాడ - అమరావతి కలిసిపోతాయి

అమరావతి ఔటర్ రింగురోడ్డు డీపీఆర్‌ని త్వరితగతిన పూర్తి చేయాలన్నారు. ఈ ప్రాజెక్టుని కేంద్ర ప్రభుత్వ సహకారంతో 2026 డిసెంబరు నాటికి పూర్తి చేసేందుకు లక్ష్యంగా పెట్టుకోవాలని ఆదేశించారు. ఈ ఔటర్ రింగురోడ్డు అభివృద్ధితో గుంటూరు, అమరావతి, విజయవాడ, వీటి మధ్య ఉన్న గ్రామాలు కలిసిపోతాయని సీఎం చెప్పారు. దీంతో పట్టణీకరణ పెరిగిపోతుందని, ఈ నేపథ్యంలో ప్రతీ గ్రామానికి మాస్టర్‌ప్లాన్ తయారు చేసి ప్రాధాన్యక్రమంలో పనులను నిర్ణయించి, ఆ దిశగా వాటిని చేపట్టాలని సూచించారు.

వరప్రదాయినికి వీడిన గ్రహణం

సాగర్ ఆయకట్టుకు వరప్రదాయినిగా నిలిచే గోదావరి జలాల తరలింపు పథకానికి వైసీపీ ప్రభుత్వ హయాంలో పట్టిన గ్రహణం వీడింది. కూటమి ప్రభుత్వం ఈ పథకం నిర్మాణాన్ని పట్టాలెక్కిస్తూ కలెక్టర్ల సదస్సులో సీఎం నిర్ణయం తీసుకోవడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. గోదావరి పెన్నా నదుల అనుసంధానంలో భాగంగా తొలిదశలో గోదావరి జలాలను సాగర్ ఆయకట్టుకు తరలించేందుకు గత టీడీపీ ప్రభుత్వం ఎత్తిపోతల పథకాన్ని చేపట్టగా వైసీపీ ఐదేళ్ల పాలనలో నిర్మాణాన్ని నిలిపివేసింది. అమరావతి మండలం వైకుంఠపురం వద్ద కృష్ణానది నుంచి నీటిని అక్కడి నుంచి 66.59 కిలోమీటర్ల పొడవునా పైపులైన్ నిర్మించి సాగర్ కాల్వ 80వ మైలు వద్దకు గోదావరి నీటిని ఎత్తిపోతల ద్వారా తరలించేందుకు పథకాన్ని రూపొందించారు. అయితే వైసీపీ ప్రభుత్వం నిధుల విడుదల చేయకపోవడంతో కాంట్రాక్టర్లు పనులను నిలిపివేశారు. కూటమి ప్రభుత్వం ఎత్తిపోతల పనులు తిరిగి ప్రారంభించేందుకు చర్యలు చేపట్టింది. నిర్మాణ వ్యయం రూ.6020 కోట్లు కానున్నది. 466 ఎకరాల భూమిని రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఈ పథకం పూర్తి చేస్తే సాగర్ కుడి కాల్వ ఆయకట్టుకు మహర్దశ పడుతుంది. గోదావరి, పెన్నా అనుసంధానం కుడి కాల్వ ఆయకట్టుకు జీవం పోస్తుంది.

నీటి సంఘం ఏకగ్రీవం!

- రేపు ఎన్నికల ప్రక్రియ
- పీసీ చైర్మన్ పదవి కోసం మద్యం వ్యాపారి విశ్వప్రయత్నం

చీరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నీటి సంఘాల ఎన్నికలను పాలకులు ప్రతిష్ఠాత్మకంగా తీసుకుంటున్నారు. దాదాపు అన్ని కమిటీలు ఏకగ్రీవం అయ్యేందుకు కసరత్తు చేస్తున్నారు. ఏకగ్రీవం అయితే పంతాలు, పట్టింపులు ఉండకపోవడంతో పాటు, ప్రభుత్వ పరంగా ప్రోత్సాహక బహుమతి కూడా ఉంటుంది. ఈ నేపథ్యంలో పాలకులు అన్ని నీటి సంఘాలు, డీసీలు, పీసీ ఏకగ్రీవం అయ్యేందుకు కసరత్తు చేస్తున్నారు. ఆ క్రమంలో పీసీ (ప్రాజెక్టు కమిటీ) చైర్మన్ పదవి కోసం ఓ మద్యం వ్యాపారి విశ్వప్రయత్నం చేస్తున్నారు. సదరు వ్యాపారికి ప్రాజెక్ట్ కమిటీ చైర్మన్ పదవి దక్కితే తన మద్యం వ్యాపారాన్ని విస్తరించుకునేందుకు ప్రయత్నిస్తారా.. లేక రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు ప్రయత్నిస్తారా అనే విషయంపై రాజకీయ వర్గాల్లోను, రైతుల్లో చర్చ జరుగుతోంది.

చీరాల, చినగంజాంలకు సంబంధించి రెండు డీసీ (డిస్ట్రిబ్యూటరీ కమిటీ)లు ఉన్నాయి. చీరాల డీసీ పరిధిలో 8, చినగంజాం డీసీ పరిధిలో 9 నీటి సంఘాలు ఉన్నాయి. ఈ క్రమంలో దాదాపు అన్ని నీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యేందుకు ఇప్పటికే ఆయా ప్రాంతాల ప్రజాప్రతినిధులు ఆశావహులతో ప్రత్యేకంగా మాట్లాడారు. పోటీలు లేకుండా ఏకగ్రీవాలు అయ్యేందుకు అనుసరించాల్సిన విధి, విధానాలను వారికి వివరించారు. ఏకగ్రీవం అయితే ఇటు సాగుపరంగా, అటు రాజకీయంగా ఒనగూరే ప్రయోజనాలను విశ్లేషించారు. దాదాపు అన్ని నీటి సంఘాలు ఏకగ్రీవం అయ్యేందుకు అవకాశం ఉందని చెప్తున్నారు. ముందస్తుగా నీటి సంఘాల ప్రక్రియ పూర్తయితే వారు డీసీలను ఎన్నుకుంటారు. డీసీలకు ప్రాజెక్టు కమిటీ చైర్మన్‌ను ఎన్నుకునేందుకు ఓటు హక్కు ఉంటుంది. ఇదిలా ఉంటే శనివారం నీటి సంఘాల ఎన్నికలకు నామినేషన్ ప్రక్రియ ప్రారంభమవుతుంది. పోటీలో పాల్గొనే వారికి ఫారం-4 ఇస్తారు. కమిటీ సభ్యులుగా పోటీకి ఒకరికి కన్నా ఎక్కువ నామినేషన్లు దాఖలు కాకుంటే, నామినేషన్ వేసిన వ్యక్తిని ఏకగ్రీవంగా ప్రకటిస్తారు. పోటీ గనుక ఉంటే ముందుగా చేతులు ఎత్తి ఎన్నుకునే విధానంను అనుసరిస్తారు. కాదని ఎవరన్నా రహస్య ఓటింగ్ పద్ధతిని కోరుకుంటే, బ్యాలెట్ ఇస్తారు. అయితే దాదాపుగా చేతులు ఎత్తటం లేదా బ్యాలెట్ పద్ధతి రాకుండానే ఏకగ్రీవాలు అయ్యేందుకు కూటమి నేతలు కసరత్తు చేస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం. ఇదిలా ఉంటే డీసీల నుంచి పీసీ(ప్రాజెక్టు కమిటీ)చైర్మన్ ఎంపికను కూడా ఏకగ్రీవం చేయాలో తలంపులో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో ఈ పర్యాయం ఆయకట్టు చివరిభూములకు సంబంధించిన ప్రాంతపు వ్యక్తికి పీసీ చైర్మన్‌గా అవకాశం కల్పించే అవకాశం ఉందని చెప్తున్నారు. అందుకుగాను ఓ మద్యం వ్యాపారి పీసీ చైర్మన్‌గా తనపేరును ఖరారు చేసుకునేందుకు విశ్వప్రయత్నం చేస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ నేపథ్యంలో సదరు మద్యం వ్యాపారి రైతు ప్రయోజనాలను కాపాడేందుకు, వారి సమస్యలను పరిష్కరించేందుకు కృసి చేస్తాడా, లేకుంటే ఈ పదవిని అడ్డుపెట్టుకుని తన మద్యం వ్యాపారంను విస్తృతం చేసుకునేందుకు పావులు కదుపుతాడా అన్న అంశం అటు రాజకీయ వర్గాల్లోను, ఇటు ఆయకట్టు పరిధిలోని రైతాంగంలోను చర్చ జరుగుతోంది.

ఆ దిశగా అడుగులు

అద్దంకి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి వినియోదారుల సంఘాల ఎన్నికలు అత్యధికశాతం ఏకగ్రీవం దిశగా అడుగులు పడుతున్నాయి. ఈ నెల 14వ తేదీన ఎన్నికలు జరగనున్నాయి. ఆయా గ్రామాలలో కూటమి నేతలు పోటీ చేసేందుకు ఉవ్విళ్లూరుతుండగా వైసీపీ నేతలు మాత్రం దూరంగా ఉండే అవకాశాలు కనిపిస్తున్నాయి. దీంతో అత్యధిక శాతం సాగునీటి వినియోగదారుల సంఘాలు ఏకగ్రీవం అయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. అద్దంకి నియోజకవర్గంలో కామేపల్లి 2, ఏల్చూరు 2, కొప్పరం 1, తంగేడుమల్లి 2, కుందుర్రు 2, ఏల్చూరు 1, కొప్పరం 2, గొర్రెపాడు 1, కొప్పరం 3, కొణిదెన, ఉప్పమాగులూరు, చెన్నుపల్లి, గొర్రెపాడు 2, చినకొత్తపల్లి 1, వైదన, బల్లికురవ, చినకొత్తపల్లి, కలవకూరు, అద్దంకి1, కొండమంజులూరు 1, అద్దంకి 2,3,4 పంగులూరు 1, 2, మణికేశ్వరం, బొడ్డువానిపాలెం, రావినూతల, చందలూరు 1, దుద్దుకూరు, రామకూరు, చందలూరు 2, కొండమంజులూరు 2, కొటికలపూడి, రామాయపాలెం, మోదేపల్లి, తంగేడుమల్లి, కామేపల్లి 1 మేజర్ సాగునీటి సంఘాలకు, మైనర్ ఇరిగేషన్ పరిధిలోని అలవలపాడు, రాళ్లపల్లి, అద్దంకి-5, కలవకూరు 2, గొర్రెపాడు 3, కొణిదెన 3, నక్కబొక్కలపాడు, చెన్నుపల్లి 2, సంతమాగులూరు, కొప్పరం 4, 5 ఏల్చూరు 3, కుందుర్రు 3 మైనర్ సాగునీటి సంఘాలకు ఎన్నికలు జరగనున్నాయి. ఆయా సాగునీటి సంఘాల ఎన్నికలు ఏ క గ్రీ వం జరిగే విధంగా చేసేందుకు అధికార పార్టీ నాయకులు గ్రామాలవారీగా ఆశావహులతో చర్చిస్తున్నారు. ఇప్పటికే అత్యధికశాతం కొలిక్కి వచ్చినట్లు తెలుస్తుంది. కొన్ని చోట్ల అధికార పార్టీలోనే పలువురు పోటీపడుతున్నప్పటికీ ఒప్పించే ప్రయత్నాలు జరుగుతున్నట్లు సమాచారం. ఎన్నిక జరగాల్సి వస్తే ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు అధికారులు చేపట్టారు.

భారీ వర్షాలు పడితే తీవ్ర నష్టమే

- వరి, మొక్కజొన్న కోతలు, నూర్పిళ్లు
- రైతుల్లో అల్పపీడనం ఆందోళన
- పంటలను కాపాడుకునే యత్నం



గుంటుపల్లిలలో వర్షాలు పడతాయని వరి నూర్పిడి చేస్తున్న రైతు

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బోరు బావుల కింద వరి, మొక్కజొన్న పంటలు సాగు చేసిన అన్నదాతల్లో అల్పపీడనం దడ పుట్టిస్తోంది. భారీ వర్షాలు పడితే చేతికి వచ్చిన పంటలకు తీవ్ర నష్టాలు తప్పవు అని వారు ఆందోళన చెందుతున్నారు. రెండు రోజుల నుంచి వాతావరణంలో మార్పులు వచ్చి ఉదయం నుంచే నల్లగా కారుమబ్బులు కమ్మడంతో రైతులు మరింత ఆందోళనలో ఉన్నారు. పొలాల మీద కొందరు రైతులు వరి పంటను కోత కోసి నూర్పిడి చేసేందుకు సిద్ధం అవుతుండగా కొందరు రైతులు కోత కొసి ఉంచారు. కొందరు కోత దశలో ఉన్న పంటను వర్షాలు లేకుంటే కోసేందుకు సిద్ధం అవుతున్నారు. మొక్కజొన్న, జూట్ పంటలు సాగు చేసిన రైతులు కోత దశలో పంట ఉందని ఇప్పుడు వర్షాలు పడితే పంటకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని అంటున్నారు.

బల్లికురవ మండలంలోని కొమ్మినేనివారిపాలెం, అంబడిపూడి, వల్లాపల్లి, గుంటుపల్లి, కొత్తపాలెం, వైదన, ఎస్ఎల్ గుడిపాడు, కూకట్లపల్లి, కొప్పెరపాడు, గొర్రెపాడు, వెలమవారిపాలెం తదితర గ్రామాలలో రైతులు గత మూడు మాసాల కిందట బోరు బావుల నీటి ద్వారా వరి పంటను, మొక్కజొన్న పంటను సాగు చేశారు. ఇప్పుడు పంటలు కోత దశలో ఉన్నాయి. బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడడంతో ఈ ప్రభావంతో భారీ వర్షాలు కురిస్తే తమకు తీవ్ర నష్టాలు వస్తాయని ఆందోళనకు గురవుతున్నారు. కొందరు రైతులు వరి పంటను నూర్పిడి చేసేందుకు పనులు వేగవంతం చేస్తున్నారు. మరో రెండు రోజులు భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వాతావరణ శాఖ తెలపడంతో రైతులు పంటలను కాపడుకునే ప్రయత్నాలలో ఉన్నారు. భారీ వర్షాలు కురిస్తే వరి కంకులు దెబ్బతినే ప్రమాదం ఉందని రైతులు తెలిపారు. వేలకు వేలు పెట్టుబడులు పెట్టి పంట ఇంటికి వచ్చే సమయంలో భారీ వర్షాలు పడితే తమకు పెట్టుబడులు కూడా చేతికి రావని రైతులు తెలిపారు.



కోత దశలో ఉన్న వరి

మందులు.. ఏటిపాలు

(5వ పేజీ తరువాయి)

మందులు మిగిలిపోయినా, వాటిని పారేశారంటే అర్థం ఉంటుంది. కరోనా తర్వాత వస్తున్న రోగాలకు తగ్గ మందులన్నీ ఉన్నా, అవన్నీ మిగిలిపోవడం విడ్డూరమే. పారాసిట్‌మాల్, ఇతర యాంటీబయోటిక్స్, విటమిన్ డీ 3, గ్యాస్, షుగర్, బీపీ వంటి నిత్యావసర మందులు కూడా నదిలో పారేసిన వాటిలో ఉండటం విశేషం. ఇకటి, రెండు పీహెచ్‌సీల పరిధిలోనే ఇన్ని మందులు గడువు ముగిసిపోయినవి ఉంటే, రాష్ట్రం మొత్తం మీద ఇంకెన్ని ఉంటాయనేది ఆందోళన కలిగించే విషయం. బలానికి సంబంధించి, ఐరన్ వంటి పోషక విలువలు తగ్గిన వారికి ఉపకరించే విటమిన్ ట్యాబ్లెట్లు కూడా వృథా చేశారు. ఖరీదైన ఇంజక్షన్లు కూడా పారేసిన వాటిలో దర్శనమిస్తున్నాయి. చివరకు చిన్న పిల్లలకు అవసరమైన మందులు, వ్యాక్సిన్లు కూడా ఉపయోగించలేదంటే వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యం ఏ స్థాయిలో ఉందో తెలుసుకోవచ్చు. ఈ మందులను ప్రభుత్వం సరఫరా చేసిన తర్వాత రెండు వేసవి సీజన్లు వచ్చాయి. ఆ సమయంలో డీహైడ్రేషన్‌తో ఆస్పత్రి పాలైన వారు ఎందరో ఉన్నారు. వారికి ఉపయోగపడే ఓఆర్ఎస్ ప్యాకెట్లు కూడా నదిలో పారేశారు. ఇక నిరోద్ ప్యాకెట్లను కూడా పారేశారు.

సురక్ష అమల్లో నిర్లక్ష్యం

జగన్ ప్రభుత్వ కాలంలో పేదల కోసం అంటూ జగనన్న ఆరోగ్య సురక్ష పథకాన్ని తీసుకొచ్చారు. 2023 సెప్టెంబరులో సర్వే, మెడికల్ క్యాంపులు నిర్వహించేలా నిర్ణయం తీసుకున్నారు. దీనిలో వలంటీర్లు, ఏఎన్ఎంలు ఇంటింటికీ రెండుసార్లు తిరిగి, సర్వే, వైద్య పరీక్షలు నిర్వహించి మందులు ఇవ్వాలి. దీనికోసం 104 వాహనాన్ని ఉపయోగించుకున్నారు. చికిత్స అవసరం అనుకుంటే శిబిరాల్లో పరీక్షించి, మందులు అందేలా చూడాలి. అయితే ఇవేమీ అన్నిచోట్ల ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం జరగలేదు. దీంతో మందులన్నీ మూలన పడేశారు. పైగా 2023లో పథకం అమలు జరిపితే, దానికి అవసరమైన మందులను 2022 చివరలో తయారు చేసినవి సరఫరా చేశారు. అవికూడా 2023-24లో గడువు పూర్తయ్యే సమయంలో వాటిని నాటి ప్రభుత్వం కొనుగోలు చేయడంపైనా అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పోనీ వాటినైనా గడువు ముగిసేలోపు రోగులకు అందించారా అంటే అదీ లేదు. జ్వరం, యాంటీబయోటిక్స్ ట్యాబ్లెట్లు అందించలేకపోయారంటే ఏదో సాకు చెప్పవచ్చు. కానీ వాక్సిన్లు, ఓఆర్ఎస్ ప్యాకెట్లు, కోవిడ్ ర్యాపిడ్, మలేరియా ర్యాపిడ్ టెస్ట్‌ల కిట్లు కూడా ఏటిపాలు చేశారంటే ఈ పథకం అమలులో ఎంత నిర్లక్ష్యం రాజ్యమేలిందనేది అర్థమవుతుంది. గడువు ఉన్నప్పుడు ప్రాణాలు కాపాడే మందులు గడువు తీరాక విషంతో సమానం. ప్రమాదకర పరిస్థితులు కలిగించే మందులను, సెలైన్ సీసాలను నదిలో పారేయడం దారుణం. అవి నదిలో కొట్టుకుపోయి నీరు కలుషితమవుతుంది. తాగిన జంతువులు, మనుషులు హాని కలిగే అవకాశం ఉంది. వైద్యులు, సిబ్బంది నిర్లక్ష్యంగా మందులను నదిలో పారేయడంపై సమీప గ్రామస్థులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర నివేదిక

- వెలిగొండ పూర్తి - డెయిరీ పునరుద్ధరణ
- ట్రిపుల్ ఐటీ, ఏకే వర్సిటీ పూర్తి వంటి

కీలక అంశాలు ప్రభుత్వం దృష్టికి : కలెక్టర్ అన్సారియా

ఒంగోలు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రానున్న ఐదేళ్లలో జిల్లా ప్రగతి ప్రణాళికలతో పాటు అభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మౌలిక రంగాలకు సంబంధించిన కీలక అంశాలను కలెక్టర్ తమీమ్ అన్సారియా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు.

రెండురోజుల పాటు జరిగిన కలెక్టర్ల సదస్సులో రెండవ రోజైన గురువారం రాత్రి జిల్లా విజన్ ప్రణాళిక-29పై వివరించే అవకాశం ఆమెకు లభించింది. ప్రణాళికలు బాగా రూపొందించిన మూడు జిల్లాల్లో ఒకటిగా జిల్లాగా ఎంపిక కావడంతో సంబంధిత అంశాలపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌ను సదస్సులో ఇచ్చారు. కొద్దిపాటి సమయమే దక్కగా అధిక భాగం నివేదిక రూపంలో ఇచ్చారు. అందులో ప్రధానంగా ప్రస్తుతం జిల్లా ఉన్న స్థూల ఉత్పత్తి రూ. 50,350 కోట్లు, తలసరి ఆదాయం రూ.1,97,357 కోట్ల నుంచి 2029 నాటికి స్థూల ఉత్పత్తి రూ.1,14,712 కోట్లు, అలాగే రూ.4.27 లక్షల తలసరి ఆదాయం పెరిగేలా చేయడానికి లక్ష్యం నిర్దేశం, దాని సాధన కోసం అనుసరించాల్సిన వ్యూహాలను పేర్కొన్నారు.

వెనుకబడి

- ప్రభుత్వ పాఠశాలల పనితీరు దారుణం
- ఒక్క దానికీ దక్కని ఫైవ్ స్టార్ రేటింగ్
- కొన్ని నాలుగు స్టార్లకే పరిమితం
- మౌలిక సదుపాయాలు అంతంతమాత్రమే
- వైసీపీ ప్రభుత్వ హయాంలో ఆర్భాటం తప్ప విద్యను పట్టించుకోకపోవడమే కారణం

ప్రభుత్వ బడులు విద్యలో వెనుకబడిపోయాయి. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో నాడు-నేడు పేరుతో ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ స్థాయిలో మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామంటూ చెప్పినదంతా ఆర్భాటపు ప్రచారమనేది తేటతెల్లమైంది. కొన్ని స్కూళ్లల్లో సదుపాయాలు ఉంటే ఫలితాలు లేవు. అభ్యసన ఫలితాలు బాగున్న కొన్నిచోట్ల వసతులు అంతంతమాత్రంగా ఉన్నాయి. కొన్ని పాఠశాలల్లో ఈ రెండు లేవు. అటు మౌలిక సదుపాయాలు, ఇటు ఫలితాల్లో అత్యుత్తమంగా నిలిచిన పాశాలలు ఒక్కటి కూడా జిల్లాలో లేదంటే పరిస్థితి ఎంత దారుణంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. దీనిపై విద్యాశాఖాధికారులు దృష్టిసారించారు. ఆర్జేడీ ఆధ్వర్యంలో కార్యాచరణ చేపట్టారు.



ఒంగోలు కలెక్టరేట్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక తాజాగా చేపట్టిన అధ్యయనంలో ప్రభుత్వ పాఠశాలలల్లో వాస్తవ పరిస్థితి వెలుగులోకి వచ్చింది. ప్రభుత్వ ఎయిడెడ్ పాఠశాలల స్థితిగతులను తెలుసుకునేందుకు మౌలిక సదుపాయాలు, అభ్యసన ఫలితాలు(లెర్నింగ్ అవుట్ కమ్స్)కు ప్రభుత్వం స్టార్ రేటింగ్‌ను ప్రకటించింది. ఏ పాఠశాల ఏ స్థాయి ఉంది? అనే అంశంపై వివరాలు సేకరించడంతో ఇప్పటి వరకు వైసీపీ ప్రభుత్వం చేసిన నాడు-నేడు పథకం పేరుతో చేసిన హడావుడి అంతా ఉత్తదేనని తేలిపోయింది. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాలకు ఫైవ్ స్టార్లు, అభ్యసర ఫలితాలకు ఫైవ్ స్టార్లు ప్రామాణికంగా తీసుకొని జిల్లాలో ఈ అధ్యయనం చేశారు.

నాడు-నేడు అంతా హడావుడే

జిల్లాలో మొత్తం ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలలు 2,406 ఉండగా వాటిలో ఏ ఒక్క పాఠశాలకు కూడా కనీస విభాగంలో ఫైవ్ స్టార్ వచ్చిన పరిస్థితి లేకుండాపోయింది. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలను కార్పొరేట్ స్థాయిగా దీటుగా అభివృద్ధి చేసినట్లు గత వైసీపీ ప్రభుత్వం ఆర్భాటపు ప్రచారం చేసుకుందే తప్ప వాటి అభివృద్ధిని పట్టించుకోలేదు. నాడు-నేడుతో పాఠశాల స్వరూపాన్నే మార్చామని జగన్మోహన్‌రెడ్డి పదే పదే చెప్పుకోవడం తప్పా ఆచరణలో అభివృద్ధి చేయలేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం చేసిన అధ్యయనంలో స్టార్ రేటింగ్ ఫలితాల్లో 5 స్టార్ ఫలితాలు వచ్చిన పాఠశాలలు ఒక్కటి లేదు. 4 స్టార్ ఫలితాల్లో కేవలం 439 పాఠశాలలు ఉండగా అభ్యసనలో 4 స్టార్‌లో నాలుగు పాఠశాలలు ఉన్నాయంటే పాఠశాలల పరిస్థితి ఏ విధంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.

స్టార్ రేటింగ్ ఇలా

మౌలిక సదుపాయాల విభాగంలో రేటింగ్ కోసం 18 అంశాలను ప్రామాణికంగా తీసుకున్నారు. పాఠశాలలో మరుగుదొడ్లు, ల్యాబ్‌లు, క్రీడామైదానం, ప్రహరీ, గ్రంథాలయం, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ తరగతి గదులు, తాగునీరు తదితర అంశాలను పరిశీలించారు. ఒక్కొక్క అంశానికి ఐదు చొప్పున గ్రేడింగ్ ఇచ్చారు. వీటిలో 90 శాతం గ్రేడింగ్ సాధించిన పాఠశాలలకు ఫైవ్ స్టార్లు కేటాయించగా 30 కంటే తక్కువ ఉంటే ఒక స్టార్‌ను ఇచ్చారు. అభ్యసన ఫలితాల విభాగంలో ఉపాధ్యాయుల హాజరు, విద్యార్థుల హాజరు, గత ఏడాది పదవ తరగతి పరీక్ష ఫలితాలు, ఇటీవల జరిగిన సమ్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను, ఒకవేళ పదవ తరగతి లేకపోతే ఫార్మేటివ్ అసెస్‌మెంట్ పరీక్షల ఫలితాలను ప్రామాణికంగా తీసుకొని ఈ అధ్యయనం చేశారు. ఈ నాలుగు విభాగాల్లో హాజరుకు 40శాతం, ఫలితాలకు 60శాతం గ్రేడింగ్ ఇచ్చారు. రెండు కలిపి 90శాతం దాటిన బడులకు ఫైవ్ స్టార్ రేటింగ్ ఇచ్చారు. అంతకంటే తక్కువ ఫలితాలు ఉన్న పాఠశాలలకు ఒకటి నుంచి నాలుగు స్టార్లు కేటాయించారు.

ఆర్భాటంతో బోధన నిర్వీర్యం

గత వైసీపీ ప్రభుత్వం పాఠశాలలను రాజకీయ ప్రచారానికి వాడుకుందనేది ఇప్పుడు బహిర్గతమైంది. విద్యార్థుల హాజరు, వారి పరీక్షల ఫలితాలను పట్టించుకోని పరిస్థితి ఏర్పడింది. నాడు-నేడు పేరుతో బడులకు రంగులు, కుర్చీలు, బెంచీలు అంటూ బోధనను నిర్వీర్యం చేసిందనే ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి పాఠశాల విద్య అంటే నాడు-నేడు పథకం ఒక్కటేనన్నట్లుగా మార్చేసి ఫలితాలను దిగజార్చిందనే ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి.

బోగస్ రోల్‌ను తొలగించాలి

- పాఠశాలల పనితీరును మెరుగుపర్చాలి
- ముగ్గురు సస్పెన్షన్‌కు ప్రతిపాదనలు పంపాలి
- డీఈవోకు ఆర్జేడీ లింగేశ్వరరెడ్డి ఆదేశం

పాఠశాలల్లో బోగస్ ఎన్‌రోల్‌మెంట్ ఉంటే వెంటనే తొలగించే విధంగా చర్యలు తీసుకోవాలని గుంటూరు విద్య ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి లింగేశ్వరరెడ్డి ఆదేశించారు. కలెక్టరేట్‌లోని గ్రీవెన్స్ హాలులో గురువారం ఉప విద్యాధికారులు, మండల విద్యాధికారులు, స్కూలు కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. హాజరు సక్రమంగా లేని విద్యార్థులను చివరి వరకు ఉంచి బోగస్ ఎన్‌రోల్ చేయడం సరికాదన్నారు. స్కూలు కాంప్లెక్స్ హెచ్‌ఎంలు తమ కాంప్లెక్స్ పరిధిలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలల్లో బోగస్ ఎన్‌రోల్ ఉంటే శుక్రవారం సాయంత్రంలోపు తొలగించాలన్నారు. ఈ విషయంలో ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. బడిబయట ఉన్న పిల్లలను గుర్తించి పాఠశాలల్లో చేర్పించాలన్నారు. వరుసగా 30రోజులు బడికి రాని విద్యార్థులను డ్రాప్ అవుట్స్ లిస్టులో చేర్చాలన్నారు. తరుచుగా బడికి రాని విద్యార్థుల తల్లిదండ్రులకు ఫోన్లు చేసి మాట్లాడాలని ఆదేశించారు. పాఠశాలలోని హాజరు రిజిస్టర్‌లో విద్యార్థుల సంఖ్యకు, యూడైస్ సైట్‌లోని సంఖ్య సరిపోయే విధంగా ఉండాలన్నారు. పదవ తరగతి విద్యార్థుల హాజరు 75శాతం ఉండాలన్నారు. వారు హాజరయ్యే విధంగా చూడాల్సిన బాధ్యత సంబంధిత హెచ్‌ఎంలపై ఉందన్నారు. ఇప్పటి వరకు 604 మంది విద్యార్థులు పదవ తరగతి పరీక్ష ఫీజు చెల్లించలేదన్నారు. వారందరూ పరీక్ష ఫీజు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు.

ఎన్‌జీపాడు ఎంఈవోలు, హెచ్‌ఎంపై చర్యలు

గత నెలలో తాను నాగులుప్పలపాడు జిల్లా పరిషత్ హైస్కూలును సందర్శించానని, అయినా ఈ రోజుకు పాల్యాబ్ 0.04శాతంగానే ఉందన్నారు. తాను స్వయంగా పరిశీలించిన తర్వాత కూడా మెరుగుపర్చకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. అదే క్యాంపస్‌లో మండల విద్యాధికారి కార్యాలయం కూడా ఉందని, అయినా తగిన విధంగా స్పందించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంఈవోలు ఇద్దరు, ఎన్‌జీపాడు జడ్పీ హైస్కూలు హెచ్‌ఎంలను సస్పెండ్ చేసేందుకు ప్రతిపాదనలు పంపాలని డీఈవో కిరణ్‌కుమార్‌ను ఆదేశించారు. గిద్దలూరు, వైపాలెం ప్రాంత మండలాలకు మార్కాపురంలో సమీక్షా సమావేశం నిర్వహిస్తామన్నారు. ప్రధాన మంత్రి స్కూల్స్ ఫర్ రైజింగ్ ఇండియా పాఠశాలల్లో ఆట స్థలానికి రూ.5లక్షలు గతంలో మంజూరు చేశామని, వెంటనే ఆ పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం అంశాల వారీగా సమీక్ష చేసి దిశానిర్దేశం చేశారు. సమావేశంలో డీఈవో ఏ.కిరణ్‌కుమార్, డీసీబీఈ సెక్రటరి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొలువుదీరనున్న శ్రీ వేణుగోపాలస్వామి

» కొండమంజులూరు గ్రామస్థులు, దాతల విరాళాలతో పునర్ నిర్మితం
» 23న వైభవంగా ప్రతిష్ఠోత్సవం




కొండమంజులూరులో పునర్ నిర్మాణమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం

శ్రీ వేణుగోపాల స్వామి మూలవిరాట్

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కొండమంజులూరు గ్రామంలో రూ.2 కోట్ల 40 లక్షల వ్యయంతో పునర్ నిర్మాణమైన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం శిఖర గోపురాలు, వాటిపై రూపుదిద్దుకున్న, దేవతామూర్తుల రాతి చిత్రాలతో ఆధ్యాత్మిక శోభ సోభిల్లుతుంది.

దాతలు, గ్రామస్థుల సహకారంతో ఈ ఆలయాన్ని సుందరంగా నిర్మించారు. 2018లో గ్రామస్థులు 13 లక్షల 40 వేల రూపాయల మ్యాచింగ్ గ్రాంట్ చెల్లించగా, నాటి ప్రభుత్వం రూ.26 లక్షల 60వేల సీజీఎఫ్ నిధులను మంజూరు చేసింది. భూమి పూజ అనంతరం 2019లో ప్రారంభమైన నిర్మాణ పనులు పూర్తయ్యాయి. ఐదేళ్ల కాల వ్యవధిలో పలువురు దాతలు, గ్రామస్థులు అందించిన భూరి విరాళాలతో శోభాయమానంగా రూపుదిద్దుకున్న ఈ ఆలయంలో ఈనెల 23న దేవతామూర్తులను శాస్త్రోక్తంగా కొలువు దీర్చేందుకు ఆలయ కమిటీ తగిన ఏర్పాట్లలో నిమగ్నమైంది.



శిథిలమైన విజయనగర రాజుల నాటి ఆలయం (ఫైల్)

దాతల భూరి విరాళాలతో

కొండమంజులూరు గ్రామంలో 16వ శతాబ్దంలో ఆ నాటి విజయనగర రాజులు రుక్మిణీసత్యభామ సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయాన్ని నిర్మించినట్లు మకర తోరణాల కింద అంత్రాలపై లిఖితమైన ఆనవాళ్లున్నాయి. ఎంతో ప్రాచుర్యం ఉన్న ఈ ఆలయం శిథిలావస్థకు చేరింది. దీంతో 2018లో గ్రామస్థులు ఆలయ పునర్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రానైట్ రాతి కట్టడంతో నిర్మించ తలపెట్టిన ఆలయానికి గర్భగుడికి అవసరమైన గ్రానైట్ రాయిని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ సమకూర్చారు. గుడిపై గోపుర నిర్మాణానికి విశ్రాంత రెవెన్యూ అధికారి కరణం లింగారావు రూ.14లక్షలు, ముఖ మండప నిర్మాణానికి గ్రామానికి చెందిన రావులవారి వంశస్తులు రూ.41లక్షల నిధులు సమకూర్చారు. ఆలయం మందు భాగంలో శోభాయమానంగా రూపు దిద్దుకున్న రాజగోపుర నిర్మాణానికి ప్రవాసాంధ్రులు, గ్రామవాసి చింతల రమేష్ రూ.25లక్షలు విరాళంగా అందచేశారు. ఆలయ ముందు భాగంలో నిర్మితమైన గరుత్మంతుని గుడి ఏర్పాటుకు కరణం కోటేశ్వరరావు, పున్నారావు రూ.8లక్షల నిధులు సమకూర్చగా, ఆలయ ధ్వజ స్తంభ నిర్మాణానికి విశ్రాంత ఉపాధ్యాయులు బత్తుల బాపయ్య రూ.8లక్షల నిధులను అందచేశారు. దేవతా మూర్తుల విగ్రహాలకు గుంటుపల్లి శ్రీకాంత్ రూ.6లక్షలు, ఆలయ ప్రాంగణం చుట్టూ ప్రహరీ నిర్మాణానికి చింతల సహదేవుడు రూ.10లక్షలు, రావుల రామకృష్ణ 2 లక్షలు నిధులు సమకూర్చారు. గ్రానైట్ వ్యాపారి వేములపల్లి శ్రీనివాసరావు, ఆలయంలో స్టోర్ రూము నిర్మాణానికి రూ.5లక్షల విరాళాన్ని బొప్పూడి నాగేశ్వరరావు,ఎడవల్లికి చెందిన ఇన్నమూరి శ్రీనివాసరావు సత్యవాణి, గుండవరపు వెంకట ప్రసాద్, మండవ కృష్ణమూర్తితో పాటు గ్రామస్థులు అందించిన సుమారు రూ.35లక్షల భూరి విరాళాలతో ఆలయ నిర్మాణం చకచకా పూర్తయినట్లు ఆలయ కమిటీ సభ్యులు, నిర్మాణ పర్యవేక్షకులు దొప్పలపూడి వీరయ్య తెలిపారు. కొండమంజులూరు కొండకు దిగువన తూర్పు దిక్కుగా సుందరంగా నిర్మితమైన శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ పునర్ నిర్మాణ ప్రతిష్ఠ మహోత్సవాన్ని ఈనెల 23వ తేదీన శాస్త్రోక్తంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ అవసరమైన ఏర్పాట్లు చేస్తున్నారు.

ఆలయ పునర్ నిర్మాణంతో ఆధ్యాత్మిక శోభ



16వ దశాబ్దంలో కొంమంజులూరు గ్రామంలో నిర్మితమైన శ్రీ రుక్మిణీ సత్యభామా సమేత శ్రీ వేణుగోపాలస్వామి ఆలయం శిథిలావస్థకు చేరడంతో స్వామి వారికి పూజా కైంకర్యాలు, నిత్య నైవేద్య నిర్వహణకు కొంత కాలంగా ఇబ్బందిగా అనిపించేది. తమ వంశస్తులు తరతరాలుగా ఆలయంలో కొలువు దీరిన శ్రీ వేణుగోపాలస్వామి వారికి సేవ చేసే భాగ్యం ప్రసాదించిన సాక్షాత్తు ఆ మహా విష్ణువు భక్తుల మదిలో కొలువుదీరి, గ్రామస్థులను ఆలయ పునర్ నిర్మాణానికి పురికొల్పాడనే భావన కలుగుతుంది. ఆలయం సర్వాంగ సుందరంగా రూపు దిద్దుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. నిర్మాణంలో భాగస్వాములైన అందరికీ ధన్యవాదాలు తెలుపుకుంటున్నాను.

- ముప్పాళ్ల శ్రీనివాస్, ఆలయ అర్చక స్వామి



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

భక్తిశ్రద్ధలతో దత్త జయంతి పూజలు

వేటపాలెం, చీరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : దత్త క్షేత్రంలో దత్తజయంతి వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం భక్తులు దత్త క్షేత్రంలోని శ్రీరామ యంత్ర క్షేత్రంలో తాము రాసిన రామకోటి ప్రతులను నిక్షిప్తం చేశారు. అనంతరం దత్తయజ్ఞం, పంచదత్తులకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. 1008 సార్లు సిద్ధ మంగళ స్తోత్రాన్ని పారాయణం చేవారు. ఈ సందర్భంగా ఆలయ అధ్యక్షుడు ప్రతి వెంకటసుబ్బారావు మాట్లాడుతూ 15వ తేదీ ఆదివారం దత్త జయంతి పర్వదినాన్ని అత్యంత ఘనంగా నిర్వహించేందుకు చేపడుతున్న కార్యక్రమాలు వివరించారు. శ్రీవేంకటేశ్వర కోలాట భక్త బృందం దత్త మందిరం, రామభక్త హనుమాన్ మందిరంలలో నిర్వహించిన ప్రదర్శనలు అందరినీ అలరించాయి. కార్యక్రమంలో ప్రమీలదేవి, చుండూరి లక్ష్మి, కరణం మురళీకృష్ణ, గుర్రం రంగనాయకులు, కన్నయ్య, రాంబాబు, వెంకట్రావు, చంద్ర, చంద్రకళ, రమాదేవి, భువనేశ్వరి, రాజేశ్వరి, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ఇంకొల్లు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : మండలంలో రుణాలు తీసుకున్న డ్వాక్రా మహిళలు వెంటనే బకాయి చెల్లించాలని స్త్రీనిధి ఏజీఎం నాగబాబు ఆదేశించారు. వెలుగు కార్యాలయంలో గ్రామ సంఘం సహాయకులకు సమీక్షా సమావేశం గురువారం జరిగింది. ఈ సందర్భంగా ఏజీఎం నాగబాబు మాట్లాడుతూ ఇంకొల్లు మండలానికి రూ.4కోట్ల 50లక్షల స్త్రీనిధి రుణాలు ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నట్లు చెప్పారు. మండలంలో మొండి బకాయిలను వెంటనే చెల్లించినట్లయితే తిరిగి రుణాలు పొందవచ్చన్నారు. ఇడుపులపాడు గ్రామంలో ఎక్కువ రుణ బకాయిలు ఉన్నాయని వాటి రికవరీపై సిబ్బంది దృష్టి సారించాలని ఏపీఎం అనూరాధను ఆదేశించారు. బకాయి ఉన్న ప్రతి గ్రూపు సభ్యురాలికి మండల సమాఖ్య నుంచి నోటీసులు జారీ చేయాలని సూచించారు. తీసుకున్న రుణాలతో జీవనోపాధి అభివృద్ధికి వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో గ్రామ సహాయకులు, సీసీలు డి.అశోక్, అంజిరెడ్డి పాల్గొన్నారు.

విద్యుత్ అక్రమ వినియోగంపై నిఘా

» అధికారుల ఆకస్మిక తనిఖీ
» 63 మందిపై కేసులు, రూ.3,18,000 అపరాధ రుసుం విధింపు



తనిఖీలపై విద్యుత్ సిబ్బందితో మాట్లాడుతున్న ఈఈ మస్తానరావు, డీఈ

మార్టూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ శాఖ అధికారులు గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. నాణ్యమైన విద్యుత్‌ను వినియోగదారులకు అందచేస్తున్నామని, అయితే విద్యుత్ శాఖను మోసం చేస్తూ నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిఘాను పెంచాలని విద్యుత్ శాఖ అద్దంకి ఈఈ ఎస్.మస్తాన్‌రావు విద్యుత్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. గురువారం మార్టూరులో విద్యుత్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. పలు గ్రానైట్ పరిశ్రమలను, వ్యాపారవర్గాలు, పలు వినియోగదారుల గృహాలను తనిఖీ చేసి విద్యుత్ అక్రమ వినియోగం, అధికలోడు, కరెంటు మీటర్ల వినియోగం తదితర అంశాలను వారు తనిఖీ చేశారు. వారిలో నిబంధనలను ఉల్లంఘించిన 63 మందిపై కేసులు నమోదు చేసి, వారిపై రూ.3,18,000 అపరాధ రుసుంతో కేసులు నమోదుచేసినట్లు ఈఈ మస్తానరావు తెలిపారు. ఈ తనిఖీలలో ప్రత్యేకంగా 30 మందితో కూడిన అధికారుల బృందం పాల్గొన్నారు. అనంతరం విద్యుత్ కార్యాలయం వద్ద ఈఈ మస్తాన్‌రావు తనిఖీ అధికారులతో కలిసి మాట్లాడారు. గ్రామాలలో విద్యుత్ అక్రమ వినియోగం చేసే వారిపై చర్యలు ఉంటాయని, ఈ విషయంపై వినియోగదారులకు అవగాహన కలిగించాలని సిబ్బందికి సూచనలు చేశారు. కార్యక్రమంలో మార్టూరు డీఈఈ ఎం.సురేంద్రబాబు, అద్దంకి డీఈఈ ఎం.దామోదరరాజుతో పాటు అద్దంకి డివిజన్‌లోని పలువురు మండల ఏఈలు, విద్యుత్ సిబ్బంది పాల్గొన్నారు.

జొన్నతాళిలో రూ.20లక్షలతో సీసీ రోడ్ల నిర్మాణం

మార్టూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మండలంలో తొలుత జొన్నతాళి గ్రామ పంచాయతీలో రెండు సీసీ రోడ్ల నిర్మాణం పూర్తయ్యాయి. వాటిలో ఎస్టీ కాలనీలో సైడు కాల్వలతోపాటు సీసీ రోడ్డు నిర్మాణం, అదేవిధంగా బీసీ కాలనీలో సీసీరోడ్డు నిర్మాణం పూర్తయ్యాయి. గ్రామ పంచాయతీ నిధులు, 15వ ఆర్థిక సంఘం నిధులు కలిపి రూ.20లక్షల వ్యయంతో పంచాయతీ సర్పంచ్ శానంపూడి నాగేంద్రమ్మ రోడ్ల నిర్మాణాన్ని పూర్తి చేయించారు.దాంతో గతంలో ఈ రెండు కాలనీల్లో ముఖ్యంగా వర్షాకాలంలో అధ్వాన్నంగా, బురదమయంగా ఉండే మట్టిరోడ్ల స్థానంలో సీసీ రోడ్ల నిర్మాణం జరగడం పట్ల కాలనీల వాసులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.



బీసీకాలనీలో సీసీ రోడ్డును పరిశీలిస్తున్న సర్పంచ్ నాగేంద్రమ్మ, పంచాయతీ అధికారులు

నీటి సంఘం ఎన్నికపై సిబ్బందికి సూచనలు



సిబ్బందికి సూచనలిస్తున్న ఎన్నికల అధికారి సుమంత్

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల నిర్వహణపై సిబ్బందికి గురువారం శిక్షణ ఇచ్చారు. పంగులూరు మండల పరిషత్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఈ నెల 14న జరుగనున్న ఎన్నికలకు సంబంధించి పంగులూరు - 2 నీటి వినియోగదారుల సంఘం ఎన్నికల అధికారి సుమంత్ మాట్లాడుతూ ఎన్నికల విధులు నిర్వహించే సిబ్బంది 14వ తేదీ ఉదయం 8 గంటలలోపే ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాలన్నారు. నిర్దీత వ్యవధిలో పోటీ చేసే ఆసక్తి గల రైతుల నుంచి నామినేషన్లు స్వీకరించడం, వాటి పరిశీలన, ఉపసంహరణ కార్యక్రమాలు పూర్తి చేయాలని సూచించారు. ప్రక్రియ సాయంత్రం 5 గంటలలోపు పూర్తి చేసేందుకు సిబ్బంది ఎన్నికల నిర్వహణాధికారికి సహకరించాలని కోరారు. నిబంధనల మేరకు ఎన్నిక నిర్వహించడంతో పాటు ఓటర్లతో సమన్వయంతో వ్యవహరించి ఎన్నిక పక్రియ శాంతియుతంగా పూర్తి చేయాలని కోరారు. సమావేశంలో కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ వేణుగోపాల్, ఎన్నికల నిర్వహణ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల తక్షణ పరిష్కారానికి కృషి



కల్లంవారిపాలెంలో తహసీల్దార్ సింగారావుకు అర్జీలు అందజేస్తున్న రైతులు

పంగులూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : రైతులు ఎదుర్కొంటున్న భూ సమస్యల పరిష్కారం కోసమే రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు మండల పరిషత్ ఉపాధ్యక్షుడు ఎర్రం శ్రీనివాసరెడ్డి అన్నా రు. మండలంలోని రామకూరు, కల్లంవారిపాలెం గ్రామాలలో గురువారం తహసీల్దార్ సింగారావు పర్యవేక్షణలో రెవెన్యూ సదస్సు ను నిర్వహించారు. రామకూరులో ఆర్‌వోఆర్‌కు సంబంధించి 31, ఎఫ్‌లైన్ కోరుతూ 6, 22-ఎ(1) సి-1, కల్లంవారిపాలెం గ్రామ సదస్సులో ఆర్వోఆర్-4, ఎఫ్‌లైన్‌కు 7 దరఖాస్తులు అందగా, నాలుగు సమస్యలు సదస్సులోనే పరిష్కరించినట్లు తహసీల్దార్ తెలిపా రు. కార్యక్రమంలో కల్లంవారిపాలెం సర్పంచ్ శ్రీనివాసరెడ్డి, చినఆదిరెడ్డి, గుడిపాటి సుబ్బారెడ్డి, రామకూరు ఉప సర్పంచ్ అశోక్, సర్వేయర్ సురేష్, ఆర్ఐ బాపయ్య, రైతులు పాల్గొన్నారు.

బల్లికురవ : గ్రామాలలో ఉన్న రెవెన్యూ సమస్యలను తక్షణమే పరిష్కారం చూపుతామని తహసీల్దార్ రవినాయక్ తెలిపారు. గురువారం మండలంలోని నక్కబొక్కలపాడులో రెవెన్యూ సదస్సు జరిగింది. ఈ సందర్భంగా తహసీల్దార్ రైతుల సమస్యలను అడిగి తెలుసుకొన్నారు. ఈ సందర్భంగా నక్కబొక్కలపాడు గ్రామ ప్రజలు శివాలయానికి వెళ్లేందుకు దారి అక్రమణకు గురైందని ఫిర్యాదు చేశారు. ఈ సభలో ప్రత్యేకాధికారి శ్రీనివాసులు, సర్పంచ్ ధూళిపాళ్ల బుల్లిరామయ్య పాల్గొన్నారు.

చినగంజాం : సమస్యలను పరిష్కరించుకునేందుకు రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ జీవిగుంట ప్రభాకరరావు అన్నారు. మండలంలోని రాజుబంగారుపాలెం గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద గురువారం జరిగిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల కోసం 12, భూసర్వేకు నాలుగు, అండగల్ 1బీ కోసం రెండు అర్జీలను స్వీకరించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో మండల సర్వేయర్ సుబ్బారావు, గ్రామ రెవెన్యూ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పర్చూరు : రెవెన్యూ సదస్సులో సమస్యలను పరిష్కరించుకోవాలని తహసీల్దార్ వీ.బ్రహ్మయ్య కోరారు. గురువారం చెరుకూరు, కొత్తపాలెంలో జరిగిన సదస్సుల్లో ఆయన 11 అర్జీలను స్వీకరించారు.



శిక్షణలో మాట్లాడుతున్న ఎంపీడీవో కుసుమకుమారి

ప్రత్యేక ప్రణాళికలతో గ్రామాల అభివృద్ధి

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ప్రత్యేక ప్రణాళికల ద్వారా గ్రామాలను అభివృద్ధి పరుచుకోవాలని ఎంపీడీవో కె.కుసుమకుమారి కోరారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో ఎల్ఎస్‌డీజీఎస్‌పై పంచాయతీ సర్పంచ్‌లకు, కార్యదర్శులకు, సచివాలయ సిబ్బందికి శిక్షణ జరిగింది. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పంచాయతీలకు ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతో అభివృద్ధి పనులను చేసుకోవాలన్నారు. ప్రజలందరూ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. అన్ని శాఖలకు సంబంధించిన అభివృద్ధి పనులకు నిధులు మంజూరు అవుతాయన్నారు. ప్రజలకు ఉపయోగ పడే పనులను గుర్తించాలన్నారు. అలానే పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. సీజనల్ వ్యాధులు రాకుండా ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. విద్యార్థులను ప్రభుత్వ అంగన్‌వాడీ కేంద్రాలకు, పాఠశాలలకు పంపాలన్నారు. కార్యక్రమంలో ఈవోపీఆర్డీ సుమతి, ఐసీడీఎస్ సీడీపీవో సుధ, వైద్యాధికారి రవితేజ పాల్గొన్నారు.

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

ఒక్కొక్కరికీ రూ.3వేల జరిమానా

వేటపాలెం, చీరాల, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : 216 జాతీయ రహదారిలో బచ్చులవారిపాలెం క్రాస్ రోడ్డు సమీపంలో గురువారం తహసీల్దార్ పార్వతి సిబ్బందితో కలసి నిర్వహించిన అకస్మిక తనిఖీలలో అనుమతులు లేకుండా అక్రమంగా తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకున్నారు. ఈక్రమంలో తహసీల్దార్‌తో అక్రమార్కులు ఒకింత వాదనకు దిగారు. అనుమతులు లేకుండా ఇసుక రవాణా, అక్రమ తవ్వకాలు నేరమన్నారు. అలాంటి చర్యలను ఉపేక్షించమని తహసీల్దార్ పార్వతి హెచ్చరించారు. ఒక్కొక్కరికీ రూ.3వేల చొప్పున ముగ్గురికి రూ.9వేల జరిమానా విధించినట్లు తహసీల్దార్ తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీకాంత్, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘనంగా సెమీ క్రిస్మస్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న తహసీల్దార్ రవినాయక్

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : క్రీస్తు దీవెనలు ప్రజలందరిపై ఉండాలని తహసీల్దార్ రవినాయక్, ఎంపీడీవో కుసుమకుమారి పేర్కొన్నారు. గురువారం మండలంలోని గుంటుపల్లి గ్రామంలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల పాస్టర్ల సంఘ సమావేశం జరిగింది. సమస్యలను అధికారులకు వివరించారు. ముందుగా కేక్‌ను కట్ చేసి క్రిస్మస్ శుభాకాంక్షలను పాస్టర్లకు అధికారులు తెలియజేశారు. కార్యక్రమంలో టీడీపీ మండల నాయకులు మలినేని గోవిందరావు, గుంటూరుకు చెందిన పాస్టర్ కిషోర్, పాస్టర్లు శ్యాంబాబు పాల్గొన్నారు.

పాస్టర్ల సంఘ మండల కమిటీ ఎన్నిక

మండల పాస్టర్ల సంఘం అధ్యక్షుడిగా కె.శ్యాంబాబు, ఉపాధ్యక్షుడిగా ఎం.యోహాన్, జి.యోహాన్‌లను పాస్టర్లు ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు. అనంతరం నూతన కమిటీ రానున్న రోజుల్లో పాస్టర్ల సమస్యలపై ముందుంటామని తెలిపారు.

నిలిపి ఉన్న లారీలలో డీజీల్ చోరీ

ఆందోళనలో యజమానులు

బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బల్లికురవ ప్రాంతంలో గ్రానైట్ ముడిరాయి రవాణా చేసే లారీలు అధికంగా ఉన్నాయి. ఈ లారీలపై కన్నేసిన కొందరు దొంగలు రాత్రిపూట డీజీల్ చోరీలకు పాల్పడుతున్నారు. నాలుగు రోజుల వ్యవధిలోనే మల్లాయపాలెం, వీర్లకొండ, బల్లికురవ గ్రామాల పరిధిలో రాత్రుళ్లు నిలిపి ఉన్న ఆరు లారీలలో రూ.లక్షల విలువ చేసే డీజీల్‌ను చోరీ చేశారు. లారీలలో డీజీల్ ట్యాంకులు ఖాళీగా ఉండడం చూసి యజమానులు ఆందోళనకు గురవుతున్నారు. ఎవరో కావాలనే చోరీలకు పాల్పడుతున్నారని వారు తెలిపారు. అత్యధికంగా లారీలు ఉండడంతో అవి పెట్టేందుకు సరైన స్థలం లేక కొందరు యజమానులు రోడ్ల వెంబడి లారీలను పార్కింగ్ చేస్తున్నారు. దీంతో అర్ధరాత్రి గుర్తుతెలియని వ్యక్తులు డీజీల్‌ను చోరీ చేస్తున్నారు. ట్యాంకులకు పైపులు ఏర్పాటు చేసి డీజీల్‌ను లాగేస్తున్నారని యజమానులు వాపోతున్నారు. చోరీలకు పాల్పడుతున్న వారిపై ప్రత్యేక నిఘా పెట్టాలని లారీల యజమానులు పోలీసులను కోరుతున్నారు.

రైలు నుంచి జారి పడి సాఫ్ట్‌వేర్ ఉద్యోగి మృతి



బల్లికురవ, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : ఐ మండలంలోని కొమ్మినేనివారిపాలెం గ్రామానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి చింతల శ్రీకాంత్ (30) బుధవారం రాత్రి రైలులో ప్రయాణిస్తూ ప్రమాదవశాత్తు జారి పడి నెల్లూరు సమీపంలో మృతి చెందాడు. అందిన సమాచారం మేరకు.. కొమ్మినేనివారిపా లెం గ్రామానికి చెందిన చింతల వెంకయ్య రెండో కుమారుడు చింతల శ్రీకాంత్ బుధవారం తన ఇంటి నుంచి తిరుపతి బయలుదేరి ఒంగోలులో రైలు ఎక్కాడు. నెల్లూరు సమీపానికి రైలు వెళ్లగానే ప్రమాదవ శాత్తు శ్రీకాంత్ కది లే రైలు నుంచి కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. బెంగళూరులో సాఫ్ట్ వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్న శ్రీకాంత్ కొంత కాలం నుంచి ఇంటి వద్దే ఉంటున్నాడు. శ్రీకాంత్ రైలు ప్రమాదంలో మృతి చెందిన విషయాన్ని రైల్వే పోలీసులు వారి కుటుంబ సభ్యులకు తెలియజేశారు. గురువారం నెల్లూరు నుంచి మృతదేహాన్ని స్వగ్రామానికి తీసుకొచ్చారు. శ్రీకాంత్‌కు వివాహం కాలేదు.

తోటవారిపాలెంలో దెబ్బతిన్న మొక్కజొన్న

» ఎరువుల దుకాణ యజమాని, రైతుల మధ్య వాదన
» విచారణ చేపట్టిన అధికారులు

చీరాలటౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : చీరాల మండల పరిధిలోని తోటవారి పాలెంలో సుమారు 4.50 ఎకరాల మొక్కజొన్న పైరు దెబ్బతింది. దీంతో రైతులు ఎరువుల దుకాణ నిర్వాహకుడిపై అధికారులకు ఫిర్యాదు చేశారు. వివరాల్లోకి వెళితే.. తోటవారిపాలెం అంబేడ్కర్‌నగర్‌లో గుమ్మడి రత్నం 2.50 ఎకరాలు కౌలుకు మొక్కజొన్న సాగు చేశారు. అలాగే మరో ఇద్దరు కూడా రెండు ఎకరాల్లో మొక్కజొన్న వేశారు. ఇప్పటికి పంట వేసి సుమారు 45 రోజులు గడుస్తుంది. అయితే ఈనెల 6వ తేదీన రైతులు ఈపూరుపాలెంకు చెందిన జ్యోతి ఫెర్టిలైజర్స్ వద్ద పురుగు మందులను కొనుగోలు చేసి చేనులో చల్లారు. వారం తిరగకముందే 4.50 ఎకరాల పంట పూర్తిగా దెబ్బతిన్నది. దీంతో ఎరువుల దుకాణదారుడు సరైన మందులు ఇవ్వలేదని రైతులు అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో గురువారం తహసీల్దార్ గోపీకృష్ణ, వ్యవసాయాధికారి సుమతి విచారణ చేపట్టారు. రెండు వర్గాలను అధికారులు విచారించారు. అయితే రైతులు మినుము పంటకు మందులు అడిగారని ఫెర్టిలైజర్స్ నిర్వాహకుడు చక్కా శ్రీనివాసరావు చెప్తుండగా, మొక్కజొన్న పంటకే మందులు అడిగామని రైతులు అంటున్నారు. ఈ విషయమై రెండురోజులుగా పంచాయితీ సాగుతోంది.




దెబ్బతిన్న పంటను పరిశీలిస్తున్న అధికారులు

జిల్లా ప్రత్యేకాధికారిగా కోన శశిధర్

● జిల్లాస్థాయి అధికారుల నియామకం

నెల్లూరు(హరనాథపురం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): జిల్లా ప్రత్యేకాధికారిగా పాఠశాల విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్‌ను నియమిస్తూ గురువారం రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. అలాగే పలుశాఖలకు జిల్లాస్థాయి అధికారులను నియమిస్తూ ఆదేశాలు వెలువడ్డాయి. సాంఘిక సంక్షేమ శాఖ డీడీగా శోభారాణి నియమితులయ్యారు. ఈమె పశ్చిమ గోదావరి జిల్లా సాంఘిక సంక్షేమాధికారిగా పనిచేస్తూ ఉద్యోగోన్నతిపై నెల్లూరుకు బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఆ శాఖ డీడీగా శ్రీనివాసులు

- మిగతా 6లో



‘పెరంకొండ’ కదిలింది!

- ఫైలును విజిలెన్స్‌కు అప్పగించిన కూటమి ప్రభుత్వం
- అక్రమాలపై క్షేత్రస్థాయిలో మొదలైన విచారణ
- ‘ఆంధ్రజ్యోతి’ కథనాలతో నాడు జేసీ ఎంక్వయిరీ

సుమారు రూ.100 కోట్ల ప్రజాధనాన్ని దోచి పెట్టిన కుంభకోణమిది. అధికారులు, దళారులు కుమ్మక్కై దోపిడీకి వేసిన భారీ స్కెచ్ ఈ వ్యవహారం. కండలేరు ముంపు కింద లేకపోయినా ఉన్నట్లుగా చూపించి రూ.కోట్ల ప్రజల సొమ్మును దిగమింగిన వైనమిది. ‘ఆంధ్రజ్యోతి’ కథనాలతో గత ప్రభుత్వంలో అప్పటి జాయింట్ కలెక్టర్ విచారణ జరిపి అక్రమాలు నిజమని తేల్చారు. అయినా నాడు భోక్తలు డబ్బులతో అన్ని వ్యవస్థలను మేనేజ్ చేసి ఈ విచారణ ఫైల్ బయటకు రాకుండా తొక్కిపెట్టారు. కానీ ఇప్పుడు కూటమి ప్రభుత్వం ఈ అవినీతి వ్యవహారంపై దృష్టి పెట్టింది. ముంపు అక్రమాలు ఇంకా కొనసాగుతూనే ఉండటంతో వీటికి చెక్ పెట్టేందుకు పెరంకొండ వ్యవహారాన్ని విజిలెన్స్ విభాగానికి అప్పగించింది. పెరంకొండలో విజిలెన్స్ అధికారులు విచారిస్తుండటంతో అక్రమార్కుల గుండెల్లో రైళ్లు పరిగెడుతున్నాయి.

- వివరాలు 6లో

రోజంతా చినుకులే!

● రాపూరులో భారీ వర్షం ● నేడు కూడా జిల్లాకు వర్ష సూచన

నెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : బంగాళా ఖాతంలో ఏర్పడిన అల్పపీడనద్రోణి జిల్లాను చిత్తడి చిత్తడి చేస్తోంది. భారీ వర్షపాతం నమోదు కాకపోయి నా గురువారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎడతెరపి లేకుండా తేలికపాటి నుంచి మోస్తరు వర్షం కురవడంతో జనజీవ నానికి ఆటంకం ఏర్పడింది. ఆకాశం మేఘావృతం కావడంతో సాయంత్రం ఐదు గంటలకే చీకటి పడింది. రాపూరు, పొదలకూరు, సైదాపురం, సీతారామపురంలో అత్యధిక వర్షపాతం నమోదయ్యింది. రాపూరులో ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు ఎడతెరపి లేకుండా భారీ వర్షం కురిసింది. జిల్లావ్యాప్తంగా 6.4 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదయ్యింది. రాపూరులో అత్యధికంగా 97.8 మి.మీ, ఆ తర్వాత సైదాపురంలో 37.4, పొదల కూరులో 13, సీతారామ పురంలో 19.2, నెల్లూరు అర్బన్‌లో 7.8, రూరల్‌లో 5.6 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. మిగిలిన ప్రాంతాల్లో కనిష్ఠంగా 1.8 నుంచి గరిష్ఠంగా 8 మి.మీ వర్షపాతం నమోదయ్యింది. జిల్లాలోని 19 మండలాల్లో వర్షం కురవలేదు. అల్పపీడన ప్రభావంతో శుక్ర వారం కూడా జిల్లాకు వర్ష సూచన ఉన్నట్లు అధికారులు తెలిపారు.

● రాపూరు, (ఆంధ్రజ్యోతి) : రోజంతా వర్షం కురవడంతో రోడ్లపై నీరు చేరింది. దీంతో రాకపోకలకు అంతరాయం కలిగింది. ఇక పెంచలకోన క్షేత్రంలో భారీ వర్షం కురవడంతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. కోన పరిసరాలు పచ్చదనంతో ఆహ్లాదకరంగా మారింది. ఎత్తయిన కొండల్లో నుంచి తెల్లని పాలధారలా నుర గలు కక్కుతూ కిందకు జాలు వారుతున్న జలపాత దృశ్యాలు ఆకట్టుకున్నాయి.

● అనంతసాగరం, (ఆంధ్రజ్యోతి) : చల్లని వాతావరణం, సన్నని చినుకులు.. పచ్చని కొండలపై అలుముకొన్న మంచు తెర.. జలజల పారే పెన్నమ్మ అందాలతో సోమశిల జలాశయం పర్యాటకులను మంత్రముగ్ధులను చేసింది. ఊటీని తలపిస్తున్న ఈ దృశ్యాలను పర్యావరణ ప్రియులు తమ కెమెరాల్లో బంధించారు. కాగా, సోమశిల జలాశయానికి 2,903 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతుండగా, 72.468 టీఎంసీల నీరు నిల్వ ఉంది. డెల్టాకు 2,550, కండలేరుకు 1,250, ఉత్తర కాలువకు 500, దక్షిణ కాలువ 150 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

● సైదాపురం (ఆంధ్రజ్యోతి) : ఎడతెరిపిలేకుండా కురిసిన వర్షానికి కైవల్యానది పొంగి ప్రవహించింది. స్థానిక ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాల ఆవరణలోఇక నీరు చేరడంతో విద్యార్థులు ఇళ్లకు వెళ్లిపోయారు.





అనంతసాగరం : పచ్చని అందాల వెనుక మంచు తెర మధ్య కొండలు



రాపూరు : పెంచలకోనలోని కొండలను కమ్మేసిన పొగమంచు, దుముకుతున్న జలపాతం



నెల్లూరు : గాంధీబొమ్మ కూడలిలో నీరు



సైదాపురం : కైవల్యా నదిలో నీటి ఉధృతి




సైదాపురం : ఎస్టీ కాలనీ ప్రాథమిక పాఠశాలలోకి చేరిన నీరు

నిధుల్లేవు.. ఎన్నికలు ఎలా!?

- రేపు సాగునీటి సంఘాలకు తుదిపోరు
- పైసా విదల్చని ప్రభుత్వం
- ఇరిగేషన్‌లోనూ డబ్బుల్లేవు
- మల్లగుల్లాలు పడుతున్న అధికారులు

ఉదయగిరి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల నిర్వహణ జలవనరుల శాఖ అధికారులకు సమస్యగా మారింది. ఇప్పటికే నోటిఫికేషన్ ప్రకటించగా శనివారం ఎన్నికలు నిర్వహించాల్సి ఉంది. అయితే, ప్రభుత్వం నుంచి పైసా కూడా విడుదల కాలేదు. పైగా జలవనరుల శాఖలోనూ చిల్లిగవ్వలేదు. ఈ పరిస్థితుల్లో ఎన్నికల నిర్వహణ ఎలా అన్నది అర్థంకాక అధికారులు మల్లగుల్లాలు పడుతున్నారు. జిల్లాలో 765 సాగునీటి సంఘాలు, 13 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, ఐదు ప్రాజెక్టు కమిటీలకు ఎన్నికలు జరగను న్నాయి. రెవెన్యూ జల వనరుల శాఖ భాగస్వామ్యంతో ఈ ఎన్నికలు నిర్వహించాలి. కాకపోతే సాగునీటి సంఘాలు, వాటి పరిధిలోని ఆస్తులన్నీ జలవనరుల శాఖకు చెందినవే కావడంతో ఎన్నికల ప్రక్రియ వరకే రెవెన్యూ శాఖ భాగస్వామ్యం ఉంటుంది. మిగిలిన ప్రక్రియ జలవనరుల శాఖ అధికారులు చూసుకోవాలి. నిధులు అందుబాటులో లేకపోవడం, కొన్ని ప్రాంతాల్లో సిబ్బంది కొరత తీవ్రంగా ఉండటంతో ఆ శాఖ అధికారులు ఆందోళన చెందుతున్నారు.



● నిధులపై స్పష్టత కరువు

ఒక్కో సాగునీటి సంఘాన్ని ఒక పోలింగ్ కేంద్రంగా పరిగణిస్తారు. అందులో ఎలక్షన్ అధికారి, అసిస్టెంట్ ఎలక్షన్ అధికారి, పోలింగ్ అధికారులు ఇద్దరు, అసిస్టెంట్ పోలింగ్ అధికారులు ఇద్దరితో కలిపి ఆరుగురు సిబ్బందిని నియమిస్తారు. అలా జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణ కోసం వందలాది మంది ఉద్యోగుల సేవలు అవసరం. ఇక ఎన్నికల నిర్వహణలో భాగంగా నోటిఫికేషన్ విడుదల, నామినేషన్ల స్వీకరణ, అవసరమైతే పోలింగ్ కోసం ఒక్కో సంఘానికి ఒకచోట కేంద్రాన్ని ఏర్పాటు చేయాలి. ఇలా పోలింగ్ ఏర్పాట్లు, సిబ్బంది నియామకం, శిక్షణ, పోలింగ్ సామగ్రి, షామియానా, కుర్చీలు, ఉద్యోగులను కేంద్రాలకు తరలించడం, వారికి టిఫిన్లు, భోజనాలు, కాఫీలు వంటి ఖర్చులకు లక్షలాది రూపాయలు అవసరమవుతుంది. పోలింగ్ నిర్వహణకు అటు సిబ్బందికి, ఇటు ఓటర్లకు ఏర్పాట్లు చేయాలి. అయితే, ప్రభుత్వం ఇంతవరకు నిధులు ఇవ్వకపోగా, ఎలా ముందుకు వెళ్లాలన్న దానిపై స్పష్టత ఇవ్వకపోవడంతో జలవనరుల శాఖ అధికారులు అయోమయంలో పడ్డారు. కొంతమంది అధికారులు తమ జేబుల నుంచి తీసి ఖర్చు చేస్తుండగా, మరికొందరు అప్పులు చేసి ఎన్నికల ఏర్పాట్లు చేస్తున్నారు.

మెయింటెనెన్స్ లేకనే!

- ‘రాళ్లపాడు’ గేటు విరిగింది! ● అభిప్రాయపడ్డ స్కూబా డైవర్లు
- గేటు తొలగింపునకు నేడు మరోమారు ప్రయత్నం



కాలువలోకి నీటి విడుదలపై చర్చిస్తున్న ఇంజనీరింగ్ అధికారులు

లింగసముద్రం, డిసెంబరు 12 : రాళ్లపాడు ప్రాజెక్టు గేట్ల నిర్వహణ సరిగా లేనందునే కుడికాలువ గేటు విరిగిందని విశాఖ నుంచి వచ్చిన స్కూబా డైవర్లు అభిప్రాయపడ్డారు. గురువారం నలుగురు స్కూబా డైవర్లు తూములోనికి దిగి గేటును పరిశీలించారు. గేటుకు, రాడ్‌కు మధ్య ఉన్న బోల్టు విరిగి పోవడంతో గేటు పైకి లేవడం లేదన్నారు. అంతేగాక గేటుకు, తూముకు మధ్య ఖాళీ లేదందున గేటును పగలగొట్టడం సాధ్యం కాదన్నారు. నదివైపు వెళ్లి గేటును పగలగొటాలన్నా నీటి ఉధృతి ఎక్కువగా ఉన్నట్లు పేర్కొన్నారు. గేటు లేపేందుకు అవసరమైన ప్లేట్లు లేకపోవడంతో సాయంత్రం పనులు నిలిపి వేశారు. శుక్రవారం గేటును తొలగించేందుకు విశ్వప్రయత్నం చేస్తామని అన్నారు. కాగా, కుడి కాలువ గేటు పనులను మధ్యాహ్నం కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, సబ్ కలెక్టర్ తిరుమణి

- మిగతా 6లో

‘పొదుపు’ మంత్రం..

కాజేసిన వైనం!

- కష్టజీవుల కడుపు కొట్టిన పొదుపు సంస్థ
- గడువు ముగిసినా చెల్లించని నగదు
- రెండు జిల్లాల్లో సుమారు రూ.కోటి టోకరా
- న్యాయం కోసం పోలీసులను ఆశ్రయించిన మహిళలు

ఉలవపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : అమాయక గిరిజన మహిళలే లక్ష్యంగా ఓ పొదుపు సంస్థ రూ.లక్షలు వసూలు చేసి నగదు చెల్లింపుల్లో చేతులెత్తేసింది. రోజులు గడుస్తున్నా నగదు చేతికి అందకపోవడంతో బాధిత మహిళలు న్యాయం కోసం గురువారం ఉలవపాడు పోలీసులను ఆశ్రయించారు. ఉలవపాడు మండలంతోపాటు చుట్టు పక్కల మండలాల బాధిత మహిళలు సుమారు 200 మంది ఉదయం నుంచి స్టేషన్ వద్దే మకాం వేశారు. బాధితుల కథనం మేరకు.. ఉలవపాడులో ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన కామంచి కోటి 2016 నందిని పొదుపు సంస్థను ప్రారంభిం చారు. గ్రామాల్లో ఎస్టీ సామా జిక వర్గానికి చెందిన మహి ళలకు పొదుపుపై అవగాహన కల్పించి, వారానికి రూ.50 నుంచి 200 వరకు స్తోమతను బట్టి కట్టించేవారు. ఇలా దాదాపు రూ.1 కోటి వరకు వసూలు చేసినట్టు సమాచారం. పొదుపు వారాలు కట్టడం పూర్తయ్యాక ఆ సభ్యులకు కట్టిన నగదుతోపాటు అదనంగా మరో రూ.1000 కలిపి చెల్లిస్తారు. ప్రకాశం, నెల్లూరు జిల్లాల్లోని ఎస్టీ కాలనీల్లో సుమారు 1000 మంది మహిళలు నందిని పొదుపు సంస్థలో సభ్యులుగా ఉన్నట్లు బాధితులు చెబుతున్నారు. అల్లూరు, జలదంకి, కావలి, గౌరవరం (కొండాపురం మండలం), గుడ్లూరు మండలం, కందుకూరు మండలం, చీమకుర్తి, చినగంజాం, కొత్తపట్నం, మన్నూరు గ్రామాల ఎస్టీ మహిళలు సభ్యులుగా ఉన్నారు. అయితే, నాలుగేళ్ల క్రితం నందిని పొదుపు సంస్థ బాధ్యుడు కోటి కేన్సర్ వ్యాధితో మృతి చెందాడు. ఆయన భార్య నందిని పొదుపు సంస్థ నిర్వాహణ బాధ్యతలు చేపట్టింది. పొదుపు సొమ్ము వారం వారం వసూళ్లు చేసేందుకు కొంతమంది సిబ్బందిని నియమించుకుంది. డబ్బులు కట్టడం పూర్తయ్యాక సభ్యులకు అడపాదడపా మొత్తం నగదు చెల్లిస్తూ కొత్త సభ్యులను చేర్చుకుంటూ వచ్చారు. అయితే, ఆరేడు నెలల నుంచి పొదుపు డబ్బులు కట్టించుకోవడం తప్ప మెచ్యూరిటీ అయిన సభ్యుల పొదుపు నగదు చెల్లిలేదు. దీంతో సభ్యులు ఆమెపై ఒత్తిడి తీసుకొచ్చారు.



ఉలవపాడు స్టేషన్ వద్ద పొదుపు బాధిత మహిళలు

పొట్లూరి బుజ్జమ్మ



కాయాకష్టం చేసి రూపాయి రూపా యి కూడబెట్టుకొని పొదుపు రూ.25 వేలు కట్టాను. అదేవిధంగా మా ఎస్టీ కాలనీలో కూడా 50 మంది వరకు మహి ళలు పొదుపు కట్టాము. మా కష్టార్జితం సొమ్మును తిరిగి చెల్లించేలా న్యాయం చేస్తారని పోలీస్ స్టేషన్‌కు వచ్చాము.

- పొదుపు బాధిత మహిళ

● సింగరాయకొండలో కేసు

ప్రకాశం జిల్లా సింగరాయకొండ పోలీస్ స్టేషన్‌లో బాధితుల ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదయ్యింది. నందినిని స్టేషన్‌ను పిలిపించి, సొంత పూచీకత్తుపై వదిలారు. అయితే, తన స్వగ్రామం ఉలవపాడుకు చేరుకున్న నందిని తన పిల్లలతో సహా అదృశ్యమైనట్లు బాధితులు చెబుతున్నారు. గుడ్లూరు, కందుకూరు, ఉలవపాడు మండలాలకు చెందిన సుమారు 200 మంది మహిళలు గురువారం ఉలవపాడు స్టేషన్‌కు చేరుకుని, ఫిర్యాదు చేశారు. బాధితుల నుంచి పొదుపు ఆధారాలు, వివరాలను ఎస్సై అంకమ్మ సేకరించారు. ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి దర్యాప్తు చేపట్టి బాధితులకు న్యాయం చేస్తామని వారికి సర్ది చెప్పారు.

వానొస్తే నాకేంటి!



రామలింగాపురం జంక్షన్‌లో వర్షంలోనూ ద్విచక్రవాహనంపై దూసుకుపోతున్న వాహనదారుడు

నెల్లూరు నగరంలో కొందరు ద్విచక్ర వాహనదారులు జోరు వానలోనూ తడవకుండా రైయ్ మంటూ దూసుకుపోతున్నారు. కొన్ని రోజులుగా విస్తారంగా కురుస్తున్న వర్షాలతో రోజువారి పనులకు ఇబ్బందులు కలుగకుండా బైక్‌ల కోసం ప్రత్యేకంగా తయారు చేసిన గొడుగులు ఏర్పాటు చేసుకొంటున్నారు. వీటిని ఎక్కువగా ఆన్‌లైన్‌లో బుక్ చేసుకుంటున్నారు. వీటి ధర కంపెనీలను బట్టి రూ.3 వేలు నుంచి రూ.20 వేలకు పైగా ఉన్నాయి. వీటిని ఏర్పాటు చేసుకున్న వాహనదారులు వర్షానికి తడవకుండా సేఫ్‌గా గమ్యస్థానాలకు వెళుతున్నారు.

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)

నేడు హనుమద్వ్రతం

నెల్లూరు(సాంస్కృతికం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా అన్ని హను మాన్ మందిరాలు, రామాలయాల్లో శుక్రవారం హనుమద్వ్రతం చేయనున్నారు. ఇందులో భాగంగా నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో ఉదయం అభిషేకం, హనుమద్ హోమం, లక్ష నాగవల్లీదళ అర్చన, పూర్ణాహుతి, ప్రసాద వితరణలు జరుగుతాయి. సాయంత్రం 4గంటలకు శ్రీరామ స్తూపంలో రామ నామ గ్రంథాలు నిక్షేపం చేస్తారు. గాంధీ నగర్ శ్రీకృష్ణమందిరంలో ఉదయం 10 గంటలకు ఆకుపూజ జరుగుతోంది. పప్పులవీధి ప్రసన్నఆంజనేయస్వామి ఆలయంలో ఉదయం హనుమద్వ్రతం నిర్వహిస్తారు. ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని ఆయా ఆలయాల చైర్మన్లు కోరారు.

శీతాకాలంలో తియ్యని మామిడి పండ్లు!



వేసవి కాలంలోనే కన్పించే తియ్యని మామిడి పండ్లు జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురుస్తున్న శీతాకాల సమయంలో ప్రత్యక్షమై ప్రజలను ఆశ్చర్యపరిచాయి. గురువారం ఓ పక్క జోరువాన కురుస్తుండగా మరోపక్క నగరంలోని చింతారెడ్డి పాలెం సమీపంలో చెన్నై-కోల్‌కత్తా జాతీయ రహదారిపై దర్శనమి చ్చాయి. ఇవి చూసిన ప్రజలు వర్షాకాలంలో మామిడి పండ్లు ఏమిటని వ్యాపారులను ప్రశ్నించగా ఉలవపాడులో ముందస్తుగా పండే పునాస కాపు అందుబాటులోకి వచ్చిందని తెలిపారు. ఈ మామిడి పండ్లను కిలో రూ.200కు విక్రయించారు.

- నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట, ఆంధ్రజ్యోతి)



అమరావతిలో సచివాలయంలో గురువారం జరిగిన సదస్సులో పాల్గొన్న కలెక్టర్ ఆనంద్, ఎస్పీ కృష్ణకాంత్

'పెరంకొండ' కదిలింది!

- ఫైల్‌ను విజిలెన్స్‌కు అప్పగించిన ప్రభుత్వం
- అక్రమాలపై క్షేత్రస్థాయిలో మొదలైన విచారణ
- ముంపు మాటున రూ.కోట్ల ప్రజాధనం దోపిడీ
- అధికారులు, దళారులు కుమ్మక్కై బరితెగింపు
- 'ఆంధ్రజ్యోతి' కథనాలతో నాడు జేసీ విచారణ
- అక్రమాలు తేల్చి ప్రభుత్వానికి నివేదిక అందజేత
- వైసీపీ ప్రభుత్వంలో తొక్కి పెట్టిన భోక్తలు

నెల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : కండలేరు ప్రాజెక్టు ముంపు కింద కలువాయి మండలం పెరంకొండ గ్రామం ఉన్నట్లుగా చూపించి సుమారు రూ.100 కోట్లను ఆర్‌అండ్‌ఆర్, పరిహారం కింద చెల్లించారు. అయితే ఈ గ్రామంలోని ఓ కాలనీ మాత్రమే ముంపునకు గురవుతుందని, మిగిలిన ఊరు ముంపు కిందకు రాదన్న ప్రచారముంది. కానీ తెలుగు గంగ అధికారులు మాత్రం ఈ గ్రామం మొత్తం ముంపు కిందకు వస్తుందని రికార్డు చేసి పరిహారం చెల్లించారు. ఇందులో సుమారు రూ.60 కోట్లను ఇళ్లు, ఇతర నిర్మాణాలకు పరిహారం కింద చెల్లించగా, మిగిలిన రూ.40 కోట్లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద చెల్లించారు. ఇక్కడ మరో కుంభకోణానికి తెరలేపారు. పాత ఇళ్లకు కూడా కొత్త ఇళ్ల మాదిరి పరిహారం ఇచ్చారు. ఇక లేని ఇళ్లు కూడా ఉన్నట్లుగా చూపించి ప్రజాధనం దోచిపెట్టారు. ఈ అక్రమాలపై అప్పట్లో ఉన్నతాధికారులకు అనేక ఫిర్యా దులు అందాయి. స్పందించిన అప్పటి కలెక్టర్ చక్రధర్‌బాబు విచారణకు ఆదేశించారు. తెలుగు గంగ స్పెషల్ కలెక్టర్ బాధ్యతలతో పాటు ఈ ఫిర్యాదులపై విచారణ బాధ్యతలను కూడా అప్పటి జేసీ రోణంకి కూర్మనాథ్‌కు అప్పగించారు. ఫిర్యాదులను, రికార్డులను పరిశీలించిన జేసీ, తదుపరి పెరంకొండలో స్వయంగా పర్యటించారు. సర్వే, ఆర్‌అండ్‌బీ శాఖల అధికారులతో రెండు నెలలపాటు పెరంకొండలోని ఇళ్లకు కొలతలు వేయించారు. ప్రతీ నిర్మాణానికి విలువ లెక్క గట్టించారు. ఈ అధికారుల బృందం ఇచ్చిన నివేదిక ప్రకారం సుమారు రూ.26 కోట్లు మాత్రమే ఇళ్లు, ఇతర నిర్మాణాలకు పరిహారం కింద చెల్లించాల్సి ఉండగా దాదాపు రూ.59 కోట్లను చెల్లించినట్లు గుర్తించారు. సుమారు రూ.33 కోట్లకు పైగా ప్రజాధనం పక్కదారి పట్టినట్లు నివేదికలో పేర్కొన్నారు. ఎప్పుడో రెండు, మూడు దశాబ్దాల క్రితం నిర్మించిన ఇళ్లకు కూడా భారీ రేటు కట్టి పరిహారంగా చెల్లించారు. కొన్ని పూరిళ్లకు రూ.20 లక్షల వరకు చెల్లించడం గమనార్హం. ఇక పెరంకొండ గ్రామంలో దాదాపు 430 ఇళ్లకు పరిహారం చెల్లించడంతో పాటు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీను కూడా అందజేశారు. అయితే సదరు పంచాయతీ అధికారులు మాత్రం 2016 అసెస్మెంట్ రికార్డు ప్రకారం సుమారు 220 ఇళ్లు మాత్రమే ఉన్నట్లు రిపోర్టు ఇచ్చారని తెలుస్తోంది.

అంతా కుమ్మక్కై స్కామ్..!

పెరంకొండ అవినీతి వ్యవహారంలో ఓ అడ్వకేట్‌ది ప్రధాన పాత్ర అని జేసీ విచారణలో తేలింది. పరిహారం పొందిన లబ్ధిదారుల ఖాతాల నుంచి సదరు అడ్వకేట్‌తోపాటు ఆయన కుటుంబ సభ్యుల బ్యాంకు ఖాతాలకు భారీగా నగదు బదిలీ అయినట్లు అధికారులు గుర్తించారు. సుమారు రూ.5 కోట్లకు పైగానే నెల్లూరులోని ఓ ప్రైవేటు బ్యాంకు నుంచి డబ్బులు మళ్లినట్లు నివేదికలో పేర్కొన్నారు. అటు అధికారులను, ఇటు పెరంకొండ గ్రామస్థులకు డబ్బులు ఆశచూపి కుంభకోణానికి తెరలేపింది ఈ దళారేనని విచారణలో గుర్తించారు. కాగా పెరంకొండ గ్రామంలోని ఇళ్ల నిర్మాణాలకు పరిహారం పొందిన వ్యక్తులు ఎక్కువగా నెల్లూరులోని ఆర్టీసీ ప్రధాన బస్టాండ్‌కు సమీపంలో ఉన్న ఓ ప్రైవేటు బ్యాంకులో సుమారు 236 ఖాతాలు తెరిచారు. ఎక్కడో అరవై కిలోమీటర్ల దూరంలో ఉన్న గ్రామస్థులు తమ ఊరిలోని బ్యాంకులను కాదని, నెల్లూరులోని ఓ ప్రైవేటు బ్యాంకులో ఖాతాలు తెరవడంపై అనుమానాలు వ్యక్తం చేసిన ఉన్నతాధికారులు ఆ దిశగా విచారణ జరిపారు. ఈ బ్యాంకు నుంచే సదరు అడ్వకేట్‌కు కూడా నగదు బదిలీ అవ్వడం, ఇవన్నీ అనుమానం కలిగిస్తున్న నేపథ్యంలో సదరు బ్యాంకుపై ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ)కు ఫిర్యాదు చేసే విధంగా కూడా అప్పట్లో జేసీ తన నివేదికలో పేర్కొన్నట్లు తెలిసింది. కాగా పెరంకొండ పునరావాస పంపిణీలో అవకతవకలకు 11 మంది వివిధ హోదాల్లో పనిచేసిన అధికారులు, ఉద్యోగులు బాధ్యులుగా విచారణలో గుర్తించారు. గతంలో టీజీపీలో పనిచేసిన స్పెషల్ కలెక్టర్, డిప్యూటీ కలెక్టర్లు, తహసీల్దార్లను బాధ్యులను చేశారు. ఇక ఇంజనీరింగ్ విభాగంలో కూడా ఓ ఎస్ఈ, ఈఈ, డీఈ, ఏఈలను బాధ్యులుగా గుర్తించి వారిపై కూడా చర్యలకు సిఫార్సు చేశారు.

వేగంగా విజిలెన్స్ విచారణ

ఈ మొత్తం నివేదికను గతేడాది జూన్‌లో అప్పటి జాయింట్ కలెక్టర్ రోణంకి కూర్మనాథ్ ప్రభుత్వానికి పంపారు. ఆ తర్వాత ఫైల్ కదలకుండా రాష్ట్రస్థాయిలో తొక్కిపెట్టారు. ఇప్పుడు ఈ అక్రమాలపై మరోసారి విచారణ జరిపేందుకు నిర్ణయించిన ప్రభుత్వం ఆ బాధ్యతలను విజిలెన్స్ విభాగానికి అప్పగించింది. దీంతో రంగంలోకి దిగిన విజిలెన్స్ అధికారులు క్షేత్రస్థాయి విచారణకు దిగారు. మూడు రోజులపాటు పెరంకొండ గ్రామంలో పర్యటించి కండలేరు జలాశయం కాంటూరన్‌ను నిర్ధారిస్తున్నారు. అయితే ముంపు కింద పరిహారం పొందిన ఈ గ్రామం ఇప్పటికీ ఖాళీ కాకపోవడం గమనార్హం. ఫిర్యాదుల్లో వచ్చినట్లు నిజంగానే ముంపు కిందన లేకపోతే ఆ గ్రామంలో ఇప్పటి వరకూ చెల్లించిన సుమారు రూ.100 కోట్లు పక్కదారి పట్టినట్లేనని ఓ అధికారి వ్యాఖ్యానించారు.

పొదుపు మహిళల ఆన్‌లైన్ వ్యాపారం

- మైస్టోర్ యాప్‌లో ఉత్పత్తుల నమోదు
- ఓఎన్‌డీసీని ప్రవేశపెట్టిన కేంద్రం
- పరిశ్రమల ఏర్పాటుకు విరివిగా రుణాలు
- అతివలకు అవగాహన కల్పిస్తున్న డీఆర్‌డీఏ



తమ ఉత్పత్తులను మైస్టోర్ యాప్‌లో నమోదు చేయిస్తున్న పొదుపు మహిళలు

నెల్లూరు (హరనాథపురం), డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి) : పొదుపు ద్వారా ఖండాంతర ఖ్యాతినార్జించిన జిల్లాలోని పొదుపు మహిళలు తదనంతరం మహిళా పారిశ్రామికవేత్తలుగా ఎదుగుతున్నారు. భౌతికంగా చిన్న చిన్న వ్యాపారాలు చేస్తున్న వారు తాజాగా ఆన్‌లైన్ వ్యాపారంలోకి అడుగుపెడుతున్నారు. అమెజాన్, ఫ్లిప్‌కార్టు వంటి సంస్థలకు దీటుగా ఓఎన్‌డీసీను (ఓపెన్ నెట్‌వర్కింగ్ ఫర్ డిజిటల్ కామర్స్) భారత ప్రభుత్వం ప్రవేశ పెట్టింది. కేంద్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక ప్రాజెక్టు అయిన ఈ ఓఎన్‌డీసీలో జిల్లాకు చెందిన మహిళలు తాము తయారు చేసిన ఉత్పత్తులను అమ్ముకోవచ్చు. ఇందుకు జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ఈ ఓఎన్ డీసీ ద్వారా వ్యాపారాభివృద్ధి కోసం రూ.1 కోటి నుంచి 5 కోట్ల వరకు రుణాలు ఇప్పించడానికి అధికారులు ప్రయత్నిస్తున్నారు. అంతేగాక ఆన్‌లైన్ వ్యాపారం చేసే అవకాశం ఉన్నందున వారు తయారు చేసే ఉత్పత్తులకు మంచి మార్కెట్ సౌకర్యం కలుగుతుంది. దిగ్గజ సంస్థలకు పోటీగా కొనుగోలు దారులకు తక్కువ ధరకు వస్తువులు అందుబాటులో ఉంటాయి. అమ్మకందారుల నుంచి అన్ని రకాల ఉత్పత్తులు, సేవలు అందుబాటులో ఉంటాయి. అమ్మకందారులు, ఎలాంటి ప్లాట్‌ఫాం లేదా యాప్‌లను ఉపయోగించినా, వారు కనెక్ట్ అయి ఉంటే వారు ఒకరితో ఒకరు వర్తకం చేసుకోవచ్చు. ఈ ఓఎన్‌డీసీపై ఆన్‌లైన్ వ్యాపారాన్ని మహిళల చేత చేయించడానికి డీఆర్‌డీఏ అధికారులు చర్యలు చేపట్టబోతున్నారు. ప్లేస్టోర్ నుంచి మైస్టోర్ యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకుని అందులో తమ వ్యాపార ఉత్పత్తులను నమోదు చేసుకున్న వెంటనే అనుమతి లభిస్తుంది. ఇందుకు సంబంధించి డీఆర్‌డీఏ అధికారులు విస్తృతంగా అవగాహన కల్పించారు. మైస్టోర్ యాప్‌లో ఆర్డర్ పెట్టగానే కొనుగోలుదారు ముందుగానే ఆన్‌లైన్ చెల్లింపులు చేయాలి. సరుకు డెలివరీ అయ్యాకే సదరు నగదు ఉత్పత్తిదారుకు చేరుతుంది. ఇతర ఆన్‌లైన్ యాప్‌ల కమీషన్ కంటే పొదుపు మహిళలు అందించే ఆన్‌లైన్ ఉత్పత్తులకు తక్కువ కమీషన్ తీసుకుంటారు.

ఉత్పత్తులను నమోదు చేయిస్తున్నాం



జిల్లాలోని పొదుపు మహిళలు తయారు చేసిన ఉత్పత్తులను ఆన్‌లైన్‌లో విక్రయానికి మైస్టోర్ యాప్‌లో నమోదు చేయిస్తున్నాము. ఇందుకు వారికి అవగాహన కూడా కల్పిస్తున్నాం. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన ఓఎన్‌డీసీ కార్యక్రమం ద్వారా మహిళలకు బ్యాంకుల ద్వారా రుణాలు మంజూరు చేయించి పరిశ్రమలు ఏర్పాటు చేయిస్తాం. ఆన్‌లైన్ ద్వారా వారు తయారు చేసిన ఉత్పత్తులకు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తాం. తద్వారా వారు ఆర్థికంగా నిలదొక్కుకునే అవకాశం కల్పించి, వారిద్వారా పదిమందికి ఉపాధి అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నాం.

- నాగరాజకుమారి, ప్రాజెక్టు డైరెక్టర్, జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ

● 274 మంది నమోదు

మైస్టోర్ యాప్‌లో 274 మంది పొదుపు మహిళలు అమ్మకందారులుగా నమోదై ఉన్నారు. జిల్లాలో మొత్తం 1,587 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లను మహిళలు స్థాపించి ఉన్నారు. ఇప్పటివరకు మూడు విడతల్లో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లకు రుణాలు మంజూరు చేశారు. 1587 యూనిట్లకు ఒక్కో యూనిట్‌కు రూ.40 వేల వంతున మంజూరు చేయగా, కాఫీపొడి, వెన్నతీసే మిషన్లు, ప్యాకింగ్, పచ్చళ్ల తయారీ పరిశ్రమలను మహిళలు ఏర్పాటు చేశారు. 18 సంవత్సరాలు నిండిన మహిళలకు జీవనోపాధి కల్పించడానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆహార శుద్ధి పరిశ్రమలను ప్రోత్సహిస్తున్నాయి. ప్రధాన మంత్రి ఫార్మలేషన్ ఆఫ్ మైక్రోఫుడ్ ప్రాసెసింగ్ ఎంటర్‌ప్రైజస్ స్కీం (పీఎంఎఫ్‌ఎంఈ), ఏపీ ఫుడ్ ప్రాసెసింగ్ సొసైటీ ద్వారా రూ.లక్ష నుంచి 10 లక్షల వరకు యంత్రాల కొనుగోలుకు రుణాలు మంజూరు చేస్తారు. వ్యక్తిగతంగా లేదా సంఘాల ద్వారా పరిశ్రమలు ఏర్పాటు చేసుకోవచ్చు. ఇందుకు రాయితీలు కూడా ఇస్తారు. రూ.10 లక్షల యూనిట్ ఖర్చుతో ఏర్పాటు చేసే పరిశ్రమలకు లైసెన్సులు, జీఎస్‌టీ తదితరాలు అవసరం లేదు. జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ రంగాన్ని బాగా అభివృద్ధి చేయడానికి ఆ రంగ ఉత్పత్తులను ఓఎన్‌డీసీ ఆన్‌లైన్ విధానంతో టైఅప్ చేయడానికి డీఆర్‌డీఏ అధికారులు చర్యలు తీసుకున్నారు.

జాతీయస్థాయి షార్ట్‌పుట్ పోటీలో రజతం



ఆర్టీసీ కానిస్టేబుల్ చంద్రశేఖర్

ఉలవపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రానికి చెందిన ఈర్ల చంద్రశేఖర్ ఏఎస్ఆర్‌టీయూ ఆధ్వర్యంలో విశాఖపట్నంలో గురువారం జరిగిన అథ్లెటిక్స్ మీట్‌లో షార్ట్‌పుట్ విభాగంలో ప్రతిభ చూపి రజత పతకం సాధించాడు. అలాగే విజయవాడలో జరిగిన రాష్ట్రస్థాయి ఏపీఎస్ ఆర్టీసీ అథ్లెటిక్స్‌లో కావలి ఆర్టీసీ డిపోలో కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నచంద్రశేఖర్ మొదటిస్థానంతో స్వర్ణ పతకం సాధించి జాతీయస్థాయికి ఎంపికయ్యాడు. జాతీయస్థాయిలో పతకం సాధించిన చంద్రశేఖర్‌ను గ్రామస్థులు, స్నేహితులు, కావలి డిపో అధికారులు అభినందించారు.

జాతీయ రహదారి దొంగలకు రిమాండ్



వివరాలను వెల్లడిస్తున్న సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ అంకమ్మ

ఉలవపాడు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై మారణాయుధాలతో వాహన చోదకులను బెదిరించే దొంగలను చాకచక్యంగా పట్టుకుని రిమాండ్‌కు తరలించినట్లు కందుకూరు సీఐ వెంకటేశ్వరరావు, ఎస్ఐ అంకమ్మలు తెలిపారు. ఆ వివరాలు ఇలా ఉన్నాయి. బోగోలు మండలం అల్లిమడుగు సంఘం పిరిగ రమేష్, మల్లీ దివ్యతేజలు ఉలవపాడు జాతీయ రహదారి వీరేపల్లి అడ్డరోడ్డు బస్‌షల్టర్ వద్ద ఈ నెల 8న కావలి మండలం చెన్నాయపాలెం బుట్టి వెంకట్రావు ద్విచక్ర వాహనంపై ఆగి ఉండగా అతని వద్దకు వచ్చిన వీరు కత్తి చూపించి బెదిరించి సెల్‌ఫోన్ లాక్కొని వెళ్లారు. బాధితుడు ఈ విషయంపై ఉలవపాడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అందులో దుండగులు ఆనవాళ్లు, వారు ఉపయోగించిన యూనికాన్ మోటార్ బైక్‌ను రాతపూర్వకంగా తెలిపాడు. కేసు నమోదు చేసిన ఎస్ఐ అంకమ్మ దర్యాప్తు చేపట్టారు. గురువారం కందుకూరు సీఐ, ఎస్సైలు హైవేపై రాజుపాలెం జంక్షన్ వద్ద వాహనాల తనిఖీ చేస్తుండగా కావలి వైపు నుంచి యూనికాన్ బైక్‌పై వస్తున్న ఇద్దరు యువకులను ఆపి వివరాలు అడిగే క్రమంలో పొంతనలేని మాటలు చెప్పడంతో స్టేషన్‌కు తీసుకొచ్చి విచారించగా నిజాలు బయటపెట్టారు. ఇద్దరి నుంచి ఒక కత్తి, దొంగిలించబడిన సెల్‌ఫోన్‌లు స్వాధీనం చేసుకున్నారు. వీరిపై పలు స్టేషన్లలో పలురకాల కేసులు నమోదై ఉనానయి. రమేష్‌పై రౌడీషీట్, దివ్యతేజపై సస్పెక్ట్ షీటు ఉన్నట్లు సీఐ తెలిపారు. నిందుతులను చాకచక్యంగా పట్టుకున్న సీఐ, ఎస్సై, సిబ్బందిని కందుకూరు డీఎస్పీ సుబ్రహ్మణ్యం అభినందించారు.

మెయింటెనెన్స్ లేకనే !

(5వ పేజీ తరువాయి)



రాళ్లపాడు ప్రాజెక్టు వద్ద ఎమ్మెల్యే ఇంటూరి, సబ్ కలెక్టర్ పూజిత తదితరులు

శ్రీపూజ పరిశీలించారు. స్కూబా డైవర్లతో చర్చించి, రైతులకు నీరిచ్చేందుకు చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

● మోటార్ల ద్వారా నీరిచేందుకు చర్యలు

గేటు తొలగింపు పనులు ఆలస్యమవుతుండటంతో ప్రత్యామ్నాయంగా మోటార్ల ద్వారా నీటిని తూములోకి పంపి కాలువకు ఇచ్చేందుకు ప్రయత్నిస్తున్నారు. ముందుగా సైఫన్ పద్ధతిలో నీరిచ్చేందుకు పైపును నీళ్లలో వేసి దాని నుంచి తూములోకి నీరు పంపేందుకు ప్రయత్నించారు. అయితే, ఆ ప్రయత్నం విఫలం కావడంతో ప్రకాశం జిల్లా చీఫ్ ఇంజనీర్ శ్యాంప్రసాద్, గుండ్లకమ్మ ప్రాజెక్టు ఎస్ఈ అబ్దుల్ తలీమ్, ప్రాజెక్టు డీఈలు వెంకటేశ్వర్లు, మధుసూదనరావులతో గేటు తొలగింపులో ఆలస్యం, రైతులకు నీరు ఎలా ఇవ్వాలని చర్చల్లో నిమగ్నమయ్యారు. గేటు తొలగింపు పనులు జరిగే వరకు రైతులకు నీరివ్వాలని నిర్ణయించారు.

జిల్లా ప్రత్యేకాధికారిగా కోన శశిధర్

(5వ పేజీ తరువాయి)

కొనసాగుతున్నారు. అలాగే, జిల్లా స్త్రీ శిశు సంక్షేమశాఖ డీడీగా సుశీల నియమితులయ్యారు. ఇక్కడ పనిచేస్తున్న పీడీ హేనా సుజన్ పదోన్నతిపై ఒంగోలు ఐసీడీఎస్ పీడీగా నియమితులయ్యారు. జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా కె.అర్జున్ నాయక్ నియమితులయ్యారు. ప్రస్తుతం ఈయన ప్రకాశం జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా పని చేస్తున్నారు.

యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించాలి

- ఆత్మ పీడీ శివన్నారాయణ



మాట్లాడుతున్న ఆత్మ పీడీ శివన్నారాయణ

నెల్లూరు(వ్యవసాయం), డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): పంటలకు ఆశించే చీడ పీడల నివారణకు చేపట్టాల్సిన యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించాలని ఆత్మ పీడీ జీ.శివన్నారాయణ సూచించారు. నెల్లూరులోని వ్యవసాయ పరిశోధన స్థానంలో గురువారం ఉదయగిరి, వింజమూరు, ఆత్మకూరు, కావలి, కందుకూరు సబ్‌డివిజన్ల పరిధిలోని వీఏఏ, వీహెచ్ఏ, వీఎస్ఏలకు జిల్లా వనరుల కేంద్రం (డీఆర్‌సీ) ఆధ్వర్యంలో వారి సామర్థ్యం పెంపుదలపై శిక్షణ ఇచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు సకాలంలో ఎరువులు, పురుగు మందులు అందేలా చూడాలని సూచించారు. డ్రోన్ల సహాయంతో పురుగు మందులు, ఎరువులు పిచికారి చేయడం వల్ల కూలీల కొరతను అధిగమించవచ్చని, అంతేకాకుండా ఖర్చు కూడా తగ్గుతుందని వివరించారు. వరి నాట్లు సకాలంలో వేయకపోవడం వల్ల వచ్చే లోటుపాట్లను పొదలకూరు వ్యవసాయ పరిశోధనా స్థానం శాస్త్రవేత్త శ్రీలక్ష్మి వివరించారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌సీ ఏడీఏలు మారుతిదేవి, లక్ష్మీమాధవి, డీఏవో కార్యాలయం ఏడీఏ నర్సోజీరావు, పలువురు మండల వ్యవసాయ అధికారులు పాల్గొన్నారు.

వసతిగృహాల మరమ్మతులకు రూ. 8 కోట్ల మంజూరు

- సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు

సంగం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ సాంఘీక సంక్షేమ వసతి గృహాల మరమ్మతులకు సుమారు రూ. 8 కోట్ల నిధులు మంజూరయ్యాయని సోషల్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. గురువారం ఆయన స్థానిక ఎస్సీ బాలిక వసతి గృహాన్ని సందర్శించి రికార్డులను పరిశీలించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాలకు వసతిగృహం చుట్టూ నిలిచిన నీటిని బయటకు తొలగించాలని పంచాయతీ అధికారులకు సూచించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 71 సాంఘీక సంక్షేమ వసతి గృహాలు ఉన్నాయని, వీటిలో 65 ప్రభుత్వ భవనాలు కాగా, 6 అద్దె భవనాల్లో ఉన్నాయన్నారు. వీటిల్లో 4,656 మంది విద్యార్థులు వసతి పొందుతున్నారు. వీరికి మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నామని తెలిపారు. పదవ తరగతిలో పదిమంది విద్యార్థులుంటే ట్యూటర్లను నియమిస్తున్నామన్నారు. ఈ ఏడాది మంచి ఉత్తీర్ణత శాతం సాధించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ప్రభుత్వ భవనాల్లో మరమ్మతులు, మౌలిక వసతుల కల్పనకు రూ. 10.16 లక్షలతో ప్రతిపాదనలు పంపగా రూ. 8 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. సోషల్ వెల్ఫేర్ విభాగం ఇంజనీరింగ్ అధికారులు త్వరలో పనులు చేపట్టేందుకు శ్రీకారం చుట్టనున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



వసతిగృహం ఆవరణలో నిలిచిన వర్షపు నీటిని పరిశీలిస్తున్న సోషల్ వెల్ఫేర్ డీడీ

బెల్టుషాపులు ఏర్పాటు చేస్తే చర్యలు

● ఎక్సైజ్ సీఐ బీ. వెంకటరావు



కందుకూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్టు దుకాణాలను ఏర్పాటు చేసినా, వాటికి మద్యం సరఫరా చేసినా చర్యలు తప్పవని వాటి నిర్మూలనకు నిరంతర నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు కందుకూరు ఎక్సైజ్ సీఐ బీవెంకటరావు తెలిపారు.

? బెల్టుషాపులపై మీ చర్యలేమి.

! బెల్టుషాపుల నిర్మూలనకు నిరంతర నిఘా పెట్టి తనిఖీలు నిర్వహిస్తున్నాం. నూతన మద్యం పాలసీ అమల్లోకి వచ్చాక అనధికారికంగా మద్యం నిల్వ చేసి ఉన్న 14మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు పంపాం. వారివద్ద 187 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నాం.

? లైసెన్సుదారులపై చర్యలు తీసుకుంటున్నారా.

! దొరికిన మద్యం సీసాలపై ఉన్న ఆధారాలు లభించలేదు. అయితే దుకాణదారులతో సమావేశాలు ఏర్పాటు చేసి హెచ్చరికలు జారీ చేస్తున్నాం. బెల్టుషాపుల్లో పట్టుబడితే తొలి సారి రూ.5లక్షలు జరిమానా, రెండవ సారి లైసెన్సు రద్దు చేస్తామని హెచ్చరిస్తున్నాం. అలాగే నూతనపాలన, ఎంఆర్పీ అమలుపై కూడా గట్టి నిఘా ఉంచాం.

? ఉదయం వేళల్లో అనధికారిక విక్రయాలు జరుగుతున్నాయా.

! మా పాటు ఐజీసర్ టాస్క్‌ఫోర్స్ బృందాలు కూడా తనిఖీలు చేపడుతున్నారు. ఉదయం వేళల్లో విక్రయాలపై ఫిర్యాదులు వస్తున్న చోట నిఘా పెంచుతున్నాం.

ఇంటికే కాదు చెట్టుకూ మీటరు ఉంది..



ఇప్పటివరకు మనం ఇళ్లకు విద్యుత్ మీటర్లను చూశాం. చెట్టుకు కూడా విద్యుత్ మీటర్లు ఇవ్వడం చూడాలంటే మీరు కావలి పట్టణానికి వెళ్లాల్సిందే. ఎలాంటి నిర్మాణాలు లేని, రోడ్డు వెంబడి ఉన్న బంకులకే కాకుండా రోడ్డ వెంబడి చిరు వ్యాపారం చేసుకునే వారికి కూడా కావలిలో విద్యుత్ మీటర్లు బిగిస్తున్నారు. చెట్ల కింద వ్యాపారాలు చేసుకునే వారికీ విద్యుత్ మీటరు బిగించారు. పట్టణంలోని ట్రంకు రోడ్డు వెంబడి నిత్యం రద్దీగా ఉండే ఎన్టీఆర్ విగ్రహం పక్కనే ఓ చెట్టుకు మీటర్‌ను ఏర్పాటు చేశారు.

- కావలి, (ఆంధ్రజ్యోతి)

పొగాకులో సస్యరక్షణ

చర్యలు చేపట్టాలి

వలేటివారిపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): పొగాకు పంటలో సమగ్ర సస్యరక్షణ చర్యలు చేపట్టాలని కందుకూరు పొగాకు బోర్డు 27వ వేలం కేంద్రం నిర్వాహణాధికారి చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని శాఖవరం గ్రామంలో గురువారం పొగాకు పంటలో సమగ్ర సస్యరక్షణ, రసాయన అవశేషాలు నిర్మూలన, ఎన్‌టీఆర్‌పీ నిర్మూలనపై రైతులకు నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో మాట్లాడారు. పొగాకు పంటలో సిటీఆర్‌ఐ అధికారులు సూచించిన పురుగుమందులు అవసరమైన మోతాదులో పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో సీనియర్ గ్రేడ్ ఆఫీసర్ శివకుమార్, 26వ వేలం కేంద్రం నిర్వాహణాధికారి కిరణ్, పొగాకుబోర్డు సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

దిమ్మె కూలితే పరిస్థితి ఏంటి ?



ముసునూరు బాలాజీనగర్‌లో రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫారం ఏర్పాటు చేశారు. కొన్నేళ్ల కిందట నిర్మించిన దిమ్మె కావడంతో అది నేడు పగుళ్లిచ్చి పూర్తిగా దెబ్బతిని కూలేందుకు సిద్ధంగా ఉన్నది. ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు దిమ్మె నానుతూ కూలితే ట్రాన్స్‌ఫార్మర్ రోడ్డుపై పడి అటువైపు వాహనాలపై వెళ్లే వారిపై పడే ప్రమాదం ఉంది. ట్రాన్స్‌కో అధికారులు స్పందించి ప్రమాదం జరుగక ముందే ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

- కావలి రూరల్, (ఆంధ్రజ్యోతి)

మామూళ్లకు చెక్ పడినట్టేనా?

● చలానా తప్ప మామూళ్లు ఇవ్వొద్దు ● కార్యాలయంలో ఫ్లెక్సీ ఏర్పాటు
● కావలి సబ్ రిజిస్ట్రార్‌లో కొత్త సంప్రదాయం



కావలి సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం

కావలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఆదాయం వచ్చే సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో కావలి ఒకటి. ఇక్కడ ప్రతిపనికి ఒక రేటు ఉంటుందనేది బహిరంగ రహస్యం. ఐతేవల కావలి సబ్ రిజిస్ట్రార్ పోస్టింగ్ వివాదాస్పదంగా మారిన విషయం తెలిసిందే. అలాంటి కావలిలో అవినీతి రహిత పాలన అందిస్తానని ప్రస్తుత సబ్‌రిజిస్ట్రార్ సుమలతారెడ్డి ఏకంగా కార్యాలయంలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేయించారు. అంతటితో సరిపెట్టుకోకుండా రిజిస్ట్రేషన్‌కు వచ్చిన ప్రతిఒక్కరూ చలానాలు కట్టు కోవటం తప్ప దూరులు, మధ్యవర్తులకు నగదు చెల్లించవద్దని మరీ చెబుతున్నారు. ఈ విషయం ప్రస్తుతం కావలిలో చర్చనీయాంశంగా మారింది. అయితే ఆమె అవినీతికి దూరంగా నిజాయితీగా పని చేస్తుందనుకుంటే పొరపాటే. ఆమె కావలికి సబ్ రిజిస్ట్రార్‌గా వచ్చిన నాటి నుంచి మామూళ్లు తీసుకోకుండా రిజిస్ట్రేషన్లు చేస్తే ఆమె నిజాయితీకి అందరూ జేజేలు పలికే



కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫ్లెక్సీ

వారు. ఆమె కావలిలో జాయిన్ అయిన తర్వాత రెండు నెలలు మామూళ్లు తీసుకుని రిజిస్ట్రేషన్లు చేశారు. ఆ తర్వాత వివాదాల కారణంగా నెల రోజులు సెలవుపై వెళ్లారు. అయితే సెలవుపై వెళ్లే రోజు మాత్రం మామూళ్లు తీసుకోకుండానే రిజిస్ట్రేషన్లు చేసింది. తర్వాత ఇన్‌ఛార్జి పాలనలో మామూళ్ల పర్వం యధాప్రకారంగా కొనసాగింది. మరలా ఆమె సెలవు నుంచి వచ్చిన తర్వాత రెండురోజులు పాటు యధాప్రకారం మామూళ్లు తీసుకున్నారు. అయితే సబ్ రిజిస్ట్రార్‌గా కొనసాగేందుకు ఆమెకు స్థానిక ఎమ్మెల్యే నుంచి సరైన సహకారం లేదనే భావంతో ప్రజల దృష్టిలో పడేందుకు మామూళ్లకు స్వస్తి పలికారని కొందరు చెబుతున్నారు. మరికొందరు మాత్రం తాను ఎలాగూ కావలిలో కొనసాగటం కష్టంగా ఉన్నందున మామూళ్లు తీసుకోకుండా రిజిస్ట్రేషన్లు చేస్తే ఇక్కడకు కొత్తవారు రావటానికి సాహసించరనే భావంతో ఉన్నారు. ఈ కొత్త సాంప్రదాయం ఎంతకాలం కొనసాగుతుందో చూడాలి మరి.

నిజమైన హక్కుదారుల కోసమే మీ భూమి-మీ హక్కు



కావలి: రెవెన్యూ సదస్సులో అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దార్



ఉదయగిరి రూరల్: అర్జీలు స్వీకరిస్తున్న తహసీల్దారు నాగరాజు

లింగసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నిజమైన భూ హక్కుదారుల కోసమే మీ భూమి - మీ హక్కు, పేరుతో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రెవెన్యూ సదస్సులను నిర్వహిస్తున్నట్లు కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు తెలిపారు. గురువారం పెంట్రాల సచివాలయంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. గత వైసీపీ ప్రభుత్వం రీ సర్వే పేరుతో రైతులకు అన్యాయం చేసిందన్నారు. ప్రతిభూమి సమస్యను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. అనంతరం కందుకూరు సబ్ కలెక్టర్ తిరుమణి శ్రీపూజ మాట్లాడారు. గతంలో జరిగిన ఫ్రీహోల్డ్‌లో ఏమైనా అవకతవకలుంటే ఫిర్యాదు చేయాలన్నారు. పేదల నుండి అసైన్మెంట్ భూములున్న వారు కొంటే వాటిని రద్దు చేసి పేదలకు అందజేస్తామన్నారు. ఈ సందర్భంగా పలువురు రైతులు అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో తహసీల్దారు సీతామహలక్ష్మి, ఆర్ఐ రమణయ్య, వీఆర్‌ఓ, వినోద్, సర్వేయరు వెంకటేష్, కిలారి కొండయ్య, మద్దెల రామారావు, వెంకటేశ్వర్లు, రంగయ్య పాల్గొన్నారు.

● వలేటివారిపాలెం: గ్రామాల్లో ఎక్క భూసమస్యలు ఉన్నాయో వాటిని పరిష్కరించడానికే ప్రభుత్వం రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దారు అబ్దుల్‌హమీద్ తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రజల నుండి వచ్చిన అర్జీలను స్వీకరించారు. కార్యక్రమంలో ఆర్ఐ ప్రసాద్, ఎంపీడీఓ ఈఓ, పావని, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

● కొండాపురం: వెలిగండ్లలో సదస్సులో 8మంది రైతులు వినతులు అందినట్లు తహసీల్దార్ కోటేశ్వరరావు తెలిపారు. వినతులను పరిశీలించి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, రెవెన్యూ సిబ్బంది, సర్వేయర్లు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

● కావలి రూరల్: తహసీల్దారు ప్రావణి కుమార్ తాళ్లపాలెంలో జరిగిన సదస్సులో పాల్గొని 15అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దారు నరసారెడ్డి, సర్వేయర్ వెంకటేశ్వర్లు, వీఆర్వో మహేంద్ర పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు మండలం అల్లిమడుగు పంచాయతీ కడనూతలలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో తహసీల్దారు సురేష్‌బాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా రైతులు వివిధరకాల భూ సమస్యలపై 46అర్జీలు వచ్చినట్లు తహసీల్దారు తెలిపారు. ఆర్ఐ షేక్ వాజిద్, సర్వేయర్ శ్రీనివాసులురెడ్డి, వీఆర్వో శివ, సచివాలయ సర్వేయర్ అశోక్ ఉన్నారు.

● సంగం: మండలంలోని కోలగట్లలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దారు సోమ్లా నాయక్ రైతుల నుంచి అర్జీలు స్వీకరించి సమస్యలపై స్థానిక రెవెన్యూ అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

●ఉదయగిరి రూరల్: మండలంలోని జి.చెరువుపల్లిలో తహసీల్దారు సుబ్బరాజ్ రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులు, ప్రజలు భూ సమస్యలపై అర్జీలు అందజేశారు. అర్జీలను పరిశీలించి పరిష్కారమార్గం చూపుతామని ఆమె తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ పీ.గీత, ఆర్ఐ సుబ్బరెడ్డి, వీఆర్వో శ్రీనివాసులు పాల్గొన్నారు.

● దుత్తలూరు: మండలంలోని పాపంపల్లిలో తహసీల్దారు మైనాగరాజు రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై ప్రజలు, రైతులు అందజేసిన అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కనసాని ఆదెమ్మ, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

● వరికుంటపాడు: తహసీల్దారు హేమంత్ కుమార్ గొల్లపల్లి, తోటలచెరువుపల్లి గ్రామాల్లో నిర్వహించిన సదస్సుల్లో ఆయన మాట్లాడుతూ ప్రజలు, రైతులు సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో వీఆర్వో శ్రీనివాసులు, నాయకులు గంగవరపు పుల్లయ్య, గంగవరపు శివరామయ్య, పగడాల హజరత్తయ్య, దొడ్డ మోహన్, కాకుమాను ప్రసాద్, నూల కాశీ పాల్గొన్నారు.

నాగంపల్లి, పెద్దనాగంపల్లిలో..

● సీతారామపురం: మండల పరిధిలోని చిన్ననాగంపల్లి గ్రామ పంచాయతీలోని పెద్దనాగంపల్లిలో గురువారం తహసీల్దార్ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. రైతులు భూ సమస్యలను పరిష్కరించాలని అర్జీలు అందజేశారు. కార్యక్రమంలో ఆర్ఐ శ్రీనివాసులు, సర్వేయర్ బాల్యనాయక్, వీఆర్వో బాలయ్య పాల్గొన్నారు.

రైల్వేగేట్ల స్థానంలో ఆర్వోబీ, ఆర్‌యూబీల ఏర్పాటు

● రైల్వే అధికారులతో కలిసి ఎమ్మెల్యే స్థలాల పరిశీలన



ముసునూరు పమిడి రైల్వే గేట్ ప్రాంతాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, రైల్వే అధికారులు

కావలి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని దగదర్తి మండలం నుంచి కావలి రూరల్ వరకు విస్తరించి ఉన్న రైల్వే లైన్‌పై ఉన్న గేట్ల స్థానంలో రైల్వే ఓవర్‌బ్రిడ్జి (ఆర్వోబీ), రైల్వే అండర్ బ్రిడ్జి (ఆర్‌యూబీ)లను ఏర్పాటు చేస్తామని ఎమ్మెల్యే దగుమాటి వెంకటకృష్ణారెడ్డి తెలిపారు. గురువారం దక్షిణమధ్య రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీరు కేడీఎస్ క్రిష్ణ తమ సిబ్బందితో ఎమ్మెల్యే చౌదరిపాలెం రైల్వే గేట్, పమిడి స్కూల్ రైల్వేగేట్, కొత్తూరి మిట్ట ప్రాంతంలోన్న ఆర్వోబీ వంతెన ప్రాంతం, పెద్దపవని రైల్వేగేట్ ప్రాంతాలను పరిశీలించారు. వంతెనల నిర్మాణ ఆవశ్యకతను రైల్వే అధికారుల దృష్టికి తీసుకెళ్లగా వీటిపై త్వరలో డీపీఆర్ తయారు చేసి ఉన్నతాధికారులకు నివేదిస్తామని రైల్వే సీనియర్ ఇంజనీర్ క్రిష్ణ ఎమ్మెల్యేకు తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడారు. పెద్దపవని రైల్వే గేట్ వద్ద తక్కువ ఖర్చుతో స్థానిక ప్రజలకు అనుకూలంగా రైల్వే అండర్‌పాస్ వంతెన నిర్మాణం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రమాదాలు, ట్రాఫిక్ ఇబ్బందులను తొలగిస్తూ పట్టణంలోని ప్రతి ప్రాంతాన్ని అనుసంధానం చేయటానికి ఈ చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఎంపీ వేమిరెడ్డి సహకారంతో వంతెనల నిర్మాణం త్వరితగతిన జరిగేట్లుగా రైల్వే అధికారుల వద్దకు వేగవంతం గా ఉంటున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ శ్రావణ్‌కుమార్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, గుత్తికొండ క్రిషోర్, మలిశెట్టి వెంకటేశ్వర్లు, కండ్లగుంట మధుబాబు నాయుడు, గుంటుపల్లి రాజకుమార్‌చౌదరి, శ్రీరామనాయుడు పాల్గొన్నారు.

● బిట్రగుంట: బోగోలు మేజర్ పంచాయతీలోని ఎల్సీ గేట్లు 144, 149ల వద్ద రైల్వే, ప్రైవేట్ స్థలాలను గురువారం సౌత్‌సెంట్రల్ రైల్వే సీనియర్ డివిజనల్ ఇంజనీరు కేడీ.ఎస్ కృష్ణతో ఎమ్మెల్యే దగుమాటి కిష్టారెడ్డి పరిశీలించారు. చిరువ్యాపారులకు ఇబ్బందికలగ కుండా, ఆడిక వ్యయం లేకుండా నిర్మాణం ఉండాలన్న ఆలోచనలు చేశారు. రైల్వే ప్రైవేట్ భూముల వివరాలను మండల తహసీల్దారు సురేష్‌బాబు, ఎంపీడీవో సుబ్రహ్మణ్యం, ఏవో గోవిందరావు, కార్యదర్శి జహీరాబాషాలు ఎమ్మెల్యేకి వివరించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు ఎం.నాగేశ్వరావు, బీజేపీ మండల అధ్యక్షుడు ఎన్ఎస్‌యాదవ్, స్థానిక టీడీపీ నేతలు వెంకటేశ్వర్లు, కేవీఎల్ బీజార్జిరెడ్డి, డి.అంజయ్య, మాధవరావు, అర్జునరాజ్, ప్రభాకర్ ఉన్నారు.

దివ్యాంగులకు ఆటల పోటీలు



కావలి టౌన్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక ముసునూరు రైల్వేక్రాసింగ్ గేట్ సమీపంలో గురువారం నిర్వహించిన దివ్యాంగుల ఆటల పోటీలను రూరల్ ఎస్ఐ తిరుమల రెడ్డి ప్రారంభించారు. అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో భాగంగా దివ్యాంగుల హక్కుల వేదిక ఆధ్వర్యంలో వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మండవ వెంకట్రావు అధ్యక్షతన ఈ పోటీలు జరిగాయి. ఈనెల 15న పొదిలపుంజలో జరిగే అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవ వేడుకల్లో ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే కృష్ణారెడ్డి పాల్గొని విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారని మండవ వెంకట్రావు తెలిపారు. సామాజిక కార్యకర్త నటరాజ్ పోటీలకు న్యాయనిర్ణేతగా వ్యవహరించారు. కార్యక్రమంలో టీడీపీ దివ్యాంగుల విభాగం నేత వేణు, వేదిక నేతలు సోమయ్య, మహబూబ్‌బాషా పాల్గొన్నారు.

ఘనంగా గంధ మహోత్సవం

అనంతసాగరం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక గుంతబజారులో ఉన్న హజరత్ నాగూర్ షరీఫ్ నిషాని దర్గా వద్ద గురువారం గంధ మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గుండాని మేళతాళాలతో గ్రామంలో ఊరేగించి అనంతరం దర్గాకు చేర్చి ఫాతెహా అనంతరం భక్తులకు అందించారు.

ఎమ్మెల్సీ క్షమాపణ చెప్పాలి

కలువాయి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): హైందవ ధర్మాన్ని కించపరుస్తూ మాట్లాడిన పీడీఎఫ్ ఎమ్మెల్సీ వెంకటేశ్వర్లు వెంటనే హిందూ సమాజానికి క్షమాపణలు చెప్పాలని కలువాయి హిందూధర్మ పరిరక్షణ సమితి, సమరసతసేవా ఫౌండేషన్ సభ్యులు బల్లా విజయభాస్కర్‌రెడ్డి, విశ్వనాథరెడ్డి, కొండారెడ్డి, మల్లికార్జున, రామచంద్రయ్య, చిన్నయ్య, మహేష్ గురువారం ప్రకటనలో డిమాండ్ చేశారు.

క్విజ్ పోటీలు నిర్వహించాలి

ఉదయగిరి రూరల్, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు సైన్స్‌పరమైన క్విజ్, వ్యక్తృత్వ పోటీలు నిర్వహించాలని ఎంఈఓ మస్తాన్‌వలి సూచించారు. గురువారం పట్టణ నార్త్ ప్రాథమిక పాఠశాలను సందర్శించారు. కార్యక్రమంలో స్కూల్ కాంప్లెక్స్ చైర్మన్ బాలశేషులు, హెచ్ఎం సయ్యద్ జాఫర్‌మొహిద్దీన్, సలీం, సందానీబాషా పాల్గొన్నారు.

2న మెగా టాలెంట్ టెస్ట్

వింజమూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం ఉదయగిరి నియోజకవర్గ స్థాయిలో 10వ తరగతి విద్యార్థులకు మెగా టాలెంట్ టెస్ట్ ఫిబ్రవరి 2న నిర్వహిస్తున్నట్లు ఆపస్ రాష్ట్ర కార్యదర్శి వెంగయ్య తెలిపారు. స్థానిక డివిజన్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ స్థానిక వైఆర్ జూనియర్ కళాశాల ఆవరణలో పరీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

న్యూస్ బాక్స్

మార్చి నెలాఖరులోగా నిర్మాణాలు పూర్తిచేయాలి

అల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మార్చి నెలాఖరులోగా ఇంటి నిర్మాణాలను పూర్తి చేయాలని అలా చేయని వారి బిల్లులు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందని హౌసింగ్ పీడీ టీవేణుగోపాల్ తెలిపారు. గురువారం ఆయన స్థానిక దయాకర్‌రెడ్డి లేఅవుట్‌తో పాటు నార్త్‌మోహరూ లేఅవుట్‌ను పరిశీలించారు. ఇళ్ల నిర్మాణంకోసం లబ్ధిదారులు కాంట్రాక్టర్లతో నిర్మించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఏఈ వెంకటేశ్వర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సురేష్, మాధవరావు ఉన్నారు.

లోక్ అదాలత్ సేవలు వినియోగించుకోవాలి

కలిగిరి, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 14న కలిగిరిలో జరిగే జాతీయ మెగా లోక్‌అదాలత్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి తెలిపారు. ఈ విషయమై గురువారం ఆయన మాట్లాడారు. కోర్టుకు రాని కేసులు, పెండింగ్ కేసులు, ఖర్చు, కాలయాపన, అప్పీల్ లేని అంతిమ తీర్పులు లోక్ అదాలత్‌లో ఇవ్వడం జరుగుతుందన్నారు. కావలి న్యాయసేవాల పరిధిలోని, న్యాయమూర్తుల ఆధ్వర్యంలో జరిగే లోక్ అదాలత్‌తో కక్షిదారులకు సత్వరన్యాయం జరుగుతుందని కలిగిరి, కొండాపురం, జలదంకి, కావలి, బోగోలు మండలాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

చెంచయ్యకు నివాళి

వలేటివారిపాలెం, డిసెంబరు 12(ఆంధ్రజ్యోతి): స్థానిక టీడీపీ సీనియర్ నాయకులు కుంచాల చెంచయ్య దశదినకర్మకు గురువారం ఆంధ్రప్రదేశ్ టూరిజం డైరెక్టర్ డాక్టర్ సూకసాని బాలాజీ హాజరయ్యారు. ఈ సందర్భంగా చెంచయ్య చిత్రపటానికి నివాళులర్పించి పార్టీకి చేసిన సేవలను కొనియాడారు. చెంచయ్య తనయుడు అంజయ్యతో పాటు కుటుంబసభ్యులకు ప్రగాఢ సంతాపం తెలిపారు. ఆయన వెంట పరిటాల బాస్కర్‌రావు, గుత్తా కొండయ్య, చెన్నిబోయిన బసవ కొండయ్య, పొట్లేళ్ళ కొండయ్య, కాకుమాను అంజనేయులు, మైనిడ నరసింహం, సుధాకర్, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

రెండు బ్యాచ్‌లకు శిక్షణ

వలేటివారిపాలెం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం నుంచి 19వ తేదీ వరకు రెండు బ్యాచ్‌లకు రెండురోజులపాటు శిక్షణ తరగతులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ నరేంద్రదేవ్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని సచివాలయాల్లోని పంచాయతీ కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు వీఆర్వోలు, అగ్రికల్చర్ అసిస్టెంట్లు, ఏఎన్ఎంలు, సర్వేయర్లు, ఎనర్జీ అసిస్టెంట్లు 67 మంది పాల్గొంటారని పేర్కొన్నారు.

మాలల మహాగర్జనను విజయవంతం చేయండి

అల్లూరు, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా ఈనెల 15న గుంటూరులో చేపడుతున్న మాలల మహాగర్జనను విజయవంతం చేయాలని అంబేద్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎల్లు సాల్మన్‌రాజు పిలుపునిచ్చారు. స్థానిక కార్యాలయంలో గురువారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. గుంటూరు కార్యక్రమానికి సంబంధించిన గోడపత్రికను దళిత నేతలతో కలిసి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ అమలైతే మాలల పరిస్థితి దుర్భరంగా మారుతుందని దీనిపై తీవ్ర పోరాటాన్ని చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో దళిత నేతలు మాల్యాద్రి, గాలి వేణుగోపాల్, సతీష్‌కుమార్, నరేష్ పాల్గొన్నారు.

చిల్లచెట్లు తొలగింపు

లింగసముద్రం, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): రాళ్లపాడు ప్రాజెక్టు ఎడమ కాలువ సమీపం నుంచి బ్రిడ్జి రోడ్డు మీదుగా అతిథిగృహానికి, ప్రాజెక్టు కార్యాలయానికి వెళ్లే రోడ్డుకు ఇరువైపుల కమ్ముకున్న చిల్లచెట్లను అధికారులు తొలగింపజేశారు. చెట్లు తొలగించడంతో గ్రామాల ప్రజలు, ప్రాజెక్టు సందర్శకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

రైల్వే ఏఆర్టీ తనిఖీ

బిట్రగుంట, డిసెంబరు 12 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వే స్టేషన్ పరిధిలోని ఏఆర్టీ (యాక్సిడెంట్ రిలీఫ్ ట్రైన్)ను విజయవాడ రైల్వే సహాయక డివిజనల్ మేనేజర్ హాషిమ్ గురువారం తనిఖీ చేశారు. మొదట స్టేషన్ మాస్టర్ కార్యాలయాన్ని చేరుకున్నారు. అనంతరం ఏఆర్టీలో ప్రస్తుతం ఉన్న వసతుల వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే సిబ్బంది సమస్యలపై చర్చించారు.